అనుదినం... జనస్వరం
www.navatelangana.com

# నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక
బుధవారం 25-09-2024

సంపుటి : 10 | సంచిక : 217 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు | వెల : 6.50



## శ్రీలంక నూతన ప్రధానిగా హరిణి అమరసూర్య

### ప్రమాణం చేయించిన దేశాధ్యక్షుడు దిసనాయకే

కొలంబో : శ్రీలంక కొత్త ప్రధానిగా హరిణి అమరసూర్య (54) మంగళవారం ప్రమాణ స్వీకారం చేశారు. తొలి ప్రధాని సిరిమావో బండారునాయకె తర్వాత 24ఏండ్ల సుదీర్ఘ విరామం అనంతరం మళ్లీ ప్రధాని పదవిని ఒక మహిళ చేపట్టారు. అధ్యక్ష ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే రాజీనామా చేసిన ప్రధాని దినేష్ గుణవర్ధనె స్థానంలో నేషనల్ పీపుల్స్ పవర్ (ఎన్‌పిపి) నాయకురాలైన హరిణితో అధ్యక్షుడు దిసనాయకె ప్రమాణ స్వీకారం చేయించారు. తనతోపాటు మరో ముగ్గురిని క్యాబినెట్ మంత్రులుగా నియమించారు. న్యాయ, విద్య, కార్మిక, పరిశ్రమలు, సైన్స్ అండ్ టెక్నాలజీ, ఆరోగ్యం, పెట్టుబడులు వంటి శాఖలను ప్రధానికే అప్పగించారు. హక్కుల కార్యకర్త, యూనివర్శిటీ లెక్చరర్ అయిన అమరసూర్య దేశ 16వ ప్రధానిగా, దేశ చరిత్రలో మూడో మహిళా ప్రధానిగా రికార్డు సృష్టించారు. ఎన్‌పీపీ పార్లమెంట్ సభ్యులు విజిత హీరత్, లక్ష్మణ్ నిపునరాచ్చి క్యాబినెట్ మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. తాత్కాలిక కేబినెట్‌గా వీరు పనిచేస్తారు. పార్లమెంట్‌ను రద్దు చేసి, తక్షణ ఎన్నికలకు పిలుపివ్వనున్నారు. నవంబరు చివరిలో ఎన్నికలు జరగవచ్చని అధికారులు తెలిపారు. అలాగే 15 కీలక మంత్రిత్వ శాఖలకు కొత్త కార్యదర్శులను కూడా నియమించారు. వీరిలో ప్రధాన మంత్రి కార్యదర్శిగా జిపి సపుతంత్రి, క్యాబినెట్ కార్యదర్శిగా డబ్ల్యూఎండీజే ఫెర్నాండో ఉన్నారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో మాజీ అధ్యక్షుడు యూఎన్‌పీ నేత రణిల్ విక్రమ సింఘె పోటీ చేయరని ఆ పార్టీ ఉప నాయకుడు రువాస్ జయవర్దనే ప్రకటించారు.

## లెబనాన్‌లో మారణకాండ

ఇజ్రాయిల్ దాడుల్లో 558కి పెరిగిన మృతులు
ఆరోగ్యమంత్రిత్వ శాఖ వెల్లడి
ప్రపంచ నేతల ఆందోళన 10లో..



## అలాంటి వ్యక్తి గవర్నరా..?

### రవి లౌకికత్వం వ్యాఖ్యలపై బృందాకరత్ ఆగ్రహం

కాంగ్రెస్, డీఎంకే, సీపీఐ మండిపాటు

న్యూఢిల్లీ : 'లౌకికతత్వం' ఐరోపా వాడి భావనని తమిళనాడు గవర్నర్ రవి చేసిన వ్యాఖ్యలపై సీపీఐ (ఎం) నాయకురాలు బృందా కరత్ మండిపడ్డారు. తమిళనాడు వంటి ముఖ్యమైన రాష్ట్రానికి అలాంటి వ్యక్తిని నియమించడం సిగ్గుచేటని ఆమె వ్యాఖ్యానించారు. రవి వ్యాఖ్యపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ అది ఆర్‌ఎస్‌ఎస్ అవగాహన అని అన్నారు. రాజ్యాంగం కూడా విదేశీ భావనేనని ఆయన రేపు అనవచ్చునని ఎత్తి పొడిచారు. బృందా కరత్ ఏఎన్ఐ వార్తా సంస్థతో మాట్లాడుతూ ...11లో

## ఆ టైంలో సెలవులివ్వాలి

### నెలసరి సమయంలో వేతనం చెల్లించాలి

ఐరాస వేదికలో సామాజిక ఉద్యమకారిణి రంజితా ప్రియదర్శిని






జెనీవా : నెలసరి రోజుల్లో మహిళలకు వేతనంతో కూడిన సెలవులు ఇవ్వాలని ఒడిశాకు చెందిన సామాజిక ఉద్యమకారిణి రంజితా ప్రియదర్శిని అన్నారు. అప్పుడే మహిళలు జీతంలో కోత పడుతుందని ఆలోచించకుండా సెలవు తీసుకోగలుగుతారని ఐక్యరాజ్యసమితి సమావేశంలో వెల్లడించారు. అమెరికాలోని న్యూయార్క్ నగరంలో నిర్వహించిన 79వ సర్వసభ్య ప్రతినిధి సభలో 'సమ్మిట్ ఆఫ్ ది ఫ్యూచర్' కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. నెలసరి విషయంలో సమాజంలో ఉన్న అపోహలు తొలగించేందుకు కృషి చేస్తున్నట్టు ...11లో

# ప్రచారం జాస్తి ఎఫ్‌డీఐలు నాస్తి

### మేక్ ఇన్ ఇండియాకు పదేండ్లు

కఠిన నిబంధనలు...పన్ను వడ్డింపులతో ఇన్వెస్టర్లు బేజారు
వేధిస్తున్న నిపుణుల కొరత

తయారీ రంగంపై దృష్టి కేంద్రీకరించే దిశగా నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమం పది సంవత్సరాలు పూర్తి చేసుకుంది. భారత్‌ను అంతర్జాతీయ తయారీ కేంద్రంగా అభివృద్ధి చేయడమే దీని ఉద్దేశం. భారత్‌కు వచ్చి ఉత్పత్తులు చేపట్టాలని ఈ కార్యక్రమం ద్వారా ప్రధాని మోడీ ప్రపంచ దేశాలకు పిలుపునిచ్చారు. అయితే 2014 సెప్టెంబరులో చేపట్టిన ఈ కార్యక్రమం గత దశాబ్ద కాలంలో ఏ మాత్రం పురోగతి సాధించలేకపోయింది. మరో మాటలో చెప్పాలంటే విఫలమైంది. అనుకూలంగా ఉన్న అంతర్జాతీయ పరిస్థితులను సైతం సొమ్ము చేసుకోలేకపోయింది. తయారీ రంగంలో పెట్టుబడులను పెంచలేకపోయింది.




వివరాలు 11లో




### ఎన్నో అవరోధాలు

భారత తయారీ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు అనేక అవరోధాలు ఎదురవుతున్నాయని వ్యాపారవేత్తలకు తెలియంది కాదు. కేంద్ర, రాష్ట్ర స్థాయిల్లో భూసేకరణ మొదలు పన్ను నిబంధనల వరకూ అన్నీ అడ్డంకులే. వీటిని పాలకులు సులభంగా తొలగించవచ్చు. మైక్రాన్, యాపిల్ సరఫరాదారుల విషయంలో అదే జరిగింది. అయితే మొత్తంగా చూస్తే పరిశ్రమ ఇప్పటికీ సవాలక్ష నిబంధనలు ఎదుర్కొంటూ వ్యాపారాలు కొనసాగిస్తోంది. పైగా మన దేశంలో నిపుణుల కొరత అధికంగా ఉంది. తయారీ రంగానికి అవసరమైన నిపుణులు మన దేశంలో లేరు. విదేశీ పెట్టుబడిదారులు ఎదుర్కొంటున్న సమస్యలలో ఇది కూడా ఒకటి. విధానపరమైన అవరోధాలను తొలగించి స్వదేశీ, విదేశీ పెట్టుబడిదారులకు సమానావకాశాలు కల్పించినప్పుడే మేక్ ఇన్ ఇండియా విజయవంతం అవుతుంది. అదొక్కటే అడ్డంకన్నట్టు కార్మిక చట్టాలను ఇష్టారాజ్యంగా సవరించేశారు. అయినా పెట్టుబడులు వచ్చింది లేదు. ఇబ్బడి ముబ్బడిగా ఉద్యోగాలొచ్చింది లేదు. వెరసి మేకిన్ ఇండియా నినాదంగా మిగిలింది తప్ప దేశానికి ఒరిగింది ఏమీ లేదు.



సమీక్షా సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి

ఔటర్ రింగ్‌రోడ్డుకు లోపల ఉన్న చెరువుల చుట్టూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, వాటిని పోలీస్ కమాండ్ కంట్రోల్‌రూంకు అనుసంధానం చేయాలని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి అధికారుల్ని ఆదేశించారు. మంగళవారంనాడాయన తన నివాసంలో మూసీ రివర్ ఫ్రంట్, మెట్రోరైల్‌పై సమీక్షా సమావేశం నిర్వహించారు.

## చెరువుల చుట్టూ సీసీ కెమెరాలు

### కమాండ్ కంట్రోల్ రూంకు అనుసంధానం

వివరాలు 3లో

- ఔటర్ లోపలి ఆక్రమణల నమోదు
- అర్హులైన పేదలకు డబుల్ బెడ్‌రూంలు : మూసీ రివర్‌ఫ్రంట్ సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి

## తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం స్ఫూర్తిదాయకం

### సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.వీరయ్య

గచ్చిబౌలి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవ సభ



నవతెలంగాణ-మియాపూర్

భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ నుంచి విముక్తి కోసం జరిగిన ఉద్యమమే.. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటమని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.వీరయ్య అన్నారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా గచ్చిబౌలిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవ సభలో ఆయన పాల్గొన్నారు. సభకు ముందు ఇటీవల మృతిచెందిన సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం.. దేశ చరిత్రలోనే అత్యంత విలువైన పోరాటమని అన్నారు. దేశంలోని పేద ప్రజలకు భూమి కావాలనే నినాదాన్ని పార్లమెంట్ వరకు తీసుకెళ్లిన ఏకైక పోరాటం సాయుధ పోరాటమని గుర్తు చేశారు. ఈ పోరాటంలో కుల, మత ప్రాంతాలకు అతీతంగా ...11లో



## పేదోళ్లను రోడ్డున పడేస్తున్నారు

హైడ్రా పేరుతో హైదరాబాద్ జనాలపై పగబట్టారు
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవేదన
శేరిలింగంపల్లిలో ఉప ఎన్నిక ఖాయమంటూ హెచ్చరిక

వివరాలు 10లో

## రూల్స్ మార్పు ప్రభావాన్ని వివరించండి

### గ్రూప్-1పై ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



గ్రూప్-1 నియామకాల్లో నిబంధనలను సవరించడం వల్ల అభ్యర్థులపై ఎలాంటి ప్రభావం ఉంటుందో చెప్పాలంటూ ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. గత నిబంధనల సమయంలో అభ్యర్థులకు ఎలాంటి ప్రయోజనాలు ఉండేవి, సవరణ తరువాత జరిగిన మార్పులపై పట్టిక రూపంలో ఇవ్వాలని పేర్కొంది. పీహెచ్‌సీ రిజర్వేషన్లకు సంబంధించిన నిబంధనలను సవరిస్తూ 2018, 2019లో జారీ చేసిన జీవోలతో పాటు ఈ ఏడాది జారీ చేసిన జీవో 29లను రద్దు చేయాలంటూ నల్లగొండ జిల్లాకు చెందిన పి.రాంబాబు ఇతరులు వేసిన పిటిషన్లను జస్టిస్ సుజయ్‌పాల్, జస్టిస్ నామవరపు రాజేశ్వరరావుతో కూడిన ధర్మాసనం విచారించింది. గత నిబంధనల ...11లో

## అప్రమత్తంగా ఉండాలి

### మతోన్మాదులకు అవకాశం ఇవ్వొద్దు



యువత సన్మార్గంలో నడిచేలా అవగాహన కల్పించండి
ఆదివాసీ చట్టాలను గౌరవించాలి : మంత్రి సీతక్క
త్వరలో ఆదివాసీ, ముస్లింల మధ్య ఉమ్మడి సమావేశం : షబ్బీర్ అలీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రతి విషయానికీ మతం రంగు పులిమి రాజకీయ లబ్ది పొందే శక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ (సీతక్క) సూచించారు. దుష్టశక్తులు పేట్రేగే అవకాశాలివ్వొద్దన్నారు. అన్ని మతాలు, సామాజిక తరగతులకు చెందిన పెద్దలు యువత సన్మార్గంలో నడిచేలా అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. ఆదివాసీ చట్టాలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని విజ్ఞప్తి చేశారు. జైనూరు ఘటన నేపథ్యంలో స్థానిక ప్రజల మధ్య ఐక్యత పెంచేందుకు త్వరలో ఆదివాసీలు, ముస్లిం పెద్దలతో ఉమ్మడి సమావేశం నిర్వహిస్తామని ప్రకటించారు. జైనూరులోని ఆదివాసీలు, మైనార్టీల మధ్య సయోధ్య కుదుర్చేందుకు తెలంగాణ ప్రభుత్వం వరుస భేటీలు నిర్వహిస్తున్న విషయం విదితమే. రెండు రోజుల క్రితం ఉట్నూర్‌లో ఆదివాసీ సంఘాలతో ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్ చర్చలు జరిపిన విషయం తెలిసిందే. తాజాగా మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మైనార్టీ పెద్దలతో మంత్రి సీతక్క, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్, ఎమ్మెల్సీ దండే విఠల్, మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాలచారి సమావేశమయ్యారు. సమస్య మూలాలతో పాటు పరిష్కార మార్గాలను సూచించాలని కోరగా మైనార్టీ పెద్దలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. వ్యక్తిగత విభేదాలకు మతం రంగు పూస్తూ మతాల మధ్య చిచ్చు పెట్టేందుకు కొన్ని రాజకీయ పక్షాలు ప్రయత్నిస్తున్నాయని ...11లో

# 38 కాలేజీల్లో బీఎఫ్ఎస్ఐ కోర్సు

### దేశంలోనే వినూత్న ప్రయోగానికి ప్రభుత్వం శ్రీకారం | నేడు ప్రారంభించనున్న సీఎం రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఈ ఏడాది డిగ్రీ, ఇంజినీరింగ్‌లో చేరిన విద్యార్థులకు బ్యాంకింగ్, ఫైనాన్సియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్ (బీఎఫ్ఎస్ఐ) రంగంలో ఉద్యోగాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నడుం బిగించింది. రెగ్యులర్ డిగ్రీతోపాటు మినీ డిగ్రీ కోర్సుగా బీఎఫ్ఎస్ఐ ద్వారా విద్యార్థులకు నైపుణ్య శిక్షణను అందించే వినూత్న కార్యక్రమానికి బుధవారం రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టనుంది. అందులో భాగంగా ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డి, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు బుధవారం హైదరాబాద్‌లో ఈ కోర్సును ప్రారంభిస్తారు. ఉన్నత విద్యామండలి గుర్తించిన 18 ఇంజినీరింగ్ కాలేజీలు, 20 డిగ్రీ కాలేజీల్లో చదువుతున్న 10 వేల మంది విద్యార్థులకు ఈ శిక్షణను అందించనుంది. రాష్ట్రవ్యాప్తంగా పట్టణాలతోపాటు గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు మేలు జరిగేలా ఈ కాలేజీలను ఎంపిక చేసింది.

**బీఎఫ్ఎస్ఐ కోర్సుకు ఎంపిక చేసిన కాలేజీలు**

**20 డిగ్రీ కాలేజీలు**



1. పింగళి ప్రభుత్వ మహిళా కాలేజీ, వడ్డేపల్లి, హన్మకొండ 2. ఎస్ఆర్ అండ్ బిజిఎన్ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ, ఖమ్మం, 3. నాగార్జున ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, నల్లగొండ 4. ఆంధ్ర మహిళా సభ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ, హైదరాబాద్ 5. భవన్స్ డిగ్రీ, పిజి కాలేజీ, హైదరాబాద్ 6. ప్రభుత్వ సిటీ కాలేజీ, హైదరాబాద్ 7. ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, సిద్దిపేట 8. ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ, బేగంపేట 9. ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, ఖైరతాబాద్ 10. ఇందిరా ప్రియదర్శిని మహిళా డిగ్రీ కాలేజీ, నాంపల్లి 11. నిజాం కాలేజీ, హైదరాబాద్ 12. ఆర్‌బివిఆర్ఆర్ డిగ్రీ కాలేజీ, హైదరాబాద్ 13. సెయింట్ ఆన్స్ మహిళా డిగ్రీ కాలేజీ, మెహిదీపట్నం 14. సెయింట్ ఫ్రాన్సిస్ మహిళా డిగ్రీ కాలేజీ, హైదరాబాద్ 15. సెయింట్ పియస్ ఎక్స్ మహిళా డిగ్రీ కాలేజీ, నాచారం 16. తారా ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, సంగారెడ్డి 17. ఎంవిఎస్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ, మహబూబ్‌నగర్ ...10లో

# కార్మికులను శ్రమదోపిడీకి గురిచేసే కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేయాలి

- సంఘటితంగా పోరాడితేనే హక్కులు కాపాడుకుంటాం : సంగారెడ్డి క్లస్టర్ స్థాయి దీక్షలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి బి.మల్లేష్




నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, నాన్ పర్మినెంట్ కార్మికులు, ఉద్యోగులను శ్రమ దోపిడీకి గురి చేసే కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి బి.మల్లేష్ డిమాండ్ చేశారు. దేశ వ్యాప్తంగా కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, నాన్ పర్మినెంట్ ఉద్యోగ, కార్మికుల సమస్యలపై చేపట్టిన క్యాంపెయిన్‌లో భాగంగా మంగళవారం సంగారెడ్డి క్లస్టర్ పరిధిలో దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంగారెడ్డి జిల్లాలో 1.80 లక్షల మంది కార్మికులున్నారని, అందులో 1.60 లక్షల మంది వరకు కాంట్రాక్టు కార్మికులేనని తెలిపారు. పర్మినెంట్ కార్మికులు, ఉద్యోగుల్లోనూ ఆఫీస్ సిబ్బందే ఎక్కువ మొత్తంలో ఉన్నారన్నారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, నాన్‌పర్మినెంట్ కార్మికుల్లోనూ అత్యధికులు ఉత్తర భారతదేశం నుంచి వలస వచ్చిన కార్మికులే ఉన్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం పర్మినెంట్ కార్మికుల్ని పెట్టుకుంటే నెలకు రూ.60 వేల జీతం ఇవ్వాల్సి వస్తుందని, వారి స్థానంలో కాంట్రాక్టు కార్మికులకు రూ.12 వేల జీతమిచ్చి పని చేయించుకుంటూ పరిశ్రమల యజమానులు శ్రమ దోపిడీకి పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 1971 కార్మిక చట్టం ప్రకారం కాంట్రాక్టు కార్మికులు నేరుగా ఉత్పత్తిలో పాల్గొన కూడదని, కానీ.. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లలో మాత్రం కాంట్రాక్టు కార్మికులు నేరుగా ఉత్పత్తిలో పాల్గొనే అవకాశం కల్పించబడిందన్నారు. లేబర్ కోడ్‌లు అమల్లోకి వస్తే ఇక నుంచి పర్మినెంట్ అనేది ఉండకుండా పోతుందని వాపోయారు. కాంట్రాక్టు కార్మికుల సంఖ్య పెరిగి పర్మినెంట్ కార్మికుల సంఖ్య తగ్గిపోవడం వల్ల వేతన, ఇతర సదుపాయాల కోసం ఎలాంటి ఒప్పందాలు చేసుకోలేని ప్రమాదకర పరిస్థితులు రాబోతున్నాయన్నారు. 8 గంటల కంటే ఎక్కువ పని గంటలు డ్యూటీ చేస్తే అదనపు వేతనం కట్టిస్తున్న పరిస్థితులు ఉన్నాయని, కానీ నార్త్ ఇండియా నుంచి పెద్ద ఎత్తున వలస కార్మికుల్ని తీసుకొచ్చి 12 గంటల పాటు పనిచేయించుకుంటున్నారని తెలిపారు. లేబర్ కోడ్‌ల్లోనూ 12 గంటల పని విధానం అమలు గురించి పేర్కొనబడిందన్నారు. మరో పక్క ధరలు విపరీతంగా పెరుగుతున్నా కార్మికుల వేతనాలు మాత్రం పెరగట్లేదన్నారు. రాష్ట్రంలో 2014 నుంచి 2024 వరకు కనీస వేతనాల పెంపు కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి జీవోల్ని ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల జీవో ఇచ్చినా కార్మికులకు పైసా వేతనం పెరగకుండా జీవో ఇచ్చి కార్మిక లోకాన్ని మోసం చేసిందన్నారు. లేబర్ కోడ్‌లను అమలు చేయాలని చూస్తున్న కేంద్ర ప్రభుత్వం, కనీస వేతనాలు పెంచని రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాల్ని తిప్పికొట్టేందుకు దేశ వ్యాప్తంగా చేపట్టిన పోరాటంలో కార్మికులు పెద్ద ఎత్తున కదలాలని పిలుపునిచ్చారు. ఈ నెల 28న కలెక్టరేట్ల ముట్టడి, 30న లేబర్ కమిషనర్ కార్యా లయం ఎదుట నిర్వ హించే ధర్నాను జయ ప్రదం చేయాలని కోరారు.

**లేబర్ కోడ్‌ల వల్లే అదనపు పనిభారం**

ఈ దీక్షా కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.సాయిలు, జిల్లా ఉపాధ్యక్షులు బాగారెడ్డి, జిల్లా నాయకులు మల్లేశం, ప్రవీణ్, వెంకట్‌రెడ్డి, దయానంద్, సురేష్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.







## ఇచ్చిన హామీలు అమలు చేయాలి

తెలంగాణ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి సాగర్

- రేపు పాడి రైతుల ధర్నా



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

పాడిరైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని, వారు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి టి. సాగర్ డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారం కోసం గురువారం ఇందిరాపార్కు వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. తెలంగాణ పాలఉత్పత్తిదారుల సంఘం, టీజీ విజయ డెయిరీ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో నిర్వహించే ధర్నాకు పెద్ద ఎత్తున పాడిరైతులు తరలిరావాలని కోరారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఆ సంఘం రాష్ట్ర కార్యాలయంలో ప్రొఫెసర్ అరిబండి ప్రసాదరావు, రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్‌తో కలిసి ఆయన అందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం సాగర్ మాట్లాడుతూ పాడిరైతులకు ఐదు నెలల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఇచ్చిన హామీ ప్రకారం ప్రభుత్వం లీటర్‌కు ఐదు రూపాయలివ్వాలని డిమాండ్ చేశారు. 15రోజుల కొకసారి రైతుల ఖాతాలలో జమచేయాలని కోరారు.

పాడి సంరక్షణ, మందులు, 50 శాతంతో గడ్డి విత్తనాలను ఇవ్వాలన్నారు. పాల టెస్టర్లు, చాప్‌కట్టర్లు, మిల్క్ అనలైజర్లు సరఫరా చేయాలని కోరారు. పశుపోషణ పథకాన్ని అమలు చేస్తూ ప్రభుత్వమే ప్రీమియం చెల్లించాలని డిమాండ్ చేశారు. మొబైల్ వ్యాన్‌ల ద్వారా రైతుల ఇంటి వద్ద పశువైద్య సౌకర్యం అందించాలన్నారు. పాడి రైతుల పిల్లల చదువులకు స్కాలర్ షిప్‌లు ఇవ్వాలని కోరారు. పశుసంవర్ధక శాఖలో ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రూ. 150 కోట్ల పెండింగ్ బిల్లులకు గానూ కేవలం రూ. 50కోట్లు విడుదల చేయడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు.

## నాణ్యతే మా బ్రాండ్.. రైతులే మా అంబాసిడర్లు

**విజయ డెయిరీ చైర్మెన్ గుత్తా అమిత్ రెడ్డి**

- పాడి రైతుల అభ్యున్నతికి కృషి
- ప్రభుత్వ సంస్థలకు పాలు, ఆలయాలకు నెయ్యి సరఫరా
- రూ.50 కోట్లు విడుదల చేసిన సీఎంకు ధన్యవాదాలు



నవతెలంగాణ-ఓయూ

నాణ్యత, తమకున్న పాడి రైతులే తమకు బ్రాండ్ అని రాష్ట్ర పాడి పరిశ్రమాభివృద్ధి సమాఖ్య (విజయ డెయిరీ) చైర్మెన్ గుత్తా అమిత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్ లాలాపేట్‌లోని విజయ డెయిరీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో నిర్వహించిన చిట్ చాట్‌లో మాట్లాడారు. తన కుటుంబ నైపథ్యం డెయిరీకి సంబంధం ఉందని, రానున్న రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వ సహకారాన్ని తీసుకొని డెయిరీని అభివృద్ధి చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు చెప్పారు. ర్యావిర్యాలలో నిర్మాణం చేసిన మేఘ డెయిరీలో ప్రస్తుతానికి ట్రయల్స్ నడుస్తున్నాయని, త్వరలోనే పూర్తిస్థాయిలో దాన్ని అందుబాటులో తీసుకొస్తామని అన్నారు. డెయిరీలో ఖర్చులు తగ్గించుకునేందుకు చర్యలు చేపట్టామని, అదే సమయంలో నాణ్యత విషయంలో రాజీపడ బోమన్నారు. ప్రస్తుతం 50 ఏండ్ల నాటి టెక్నాలజీని జోడించి నిర్మించిన లాలాపేట్ విజయ డెయిరీని కొంత మేరకు నూతన టెక్నాలజీని జోడించి మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని చెప్పారు. మార్కెటింగ్‌లో ఇంకా ముందుకు పోవాల్సిన అవసరం ఉందని, దానికి అనుగుణంగా కొన్ని ప్రణాళికలు తయారు చేస్తున్నట్టు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే జీఓ నెంబర్ 45ను విడుదల చేసిందని, దాని ద్వారా పలు ప్రభుత్వ సంస్థలకు పాలు సరఫరా చేస్తూ ఇక తెలంగాణలో పలు ప్రముఖ దేవాలయాలకు నెయ్యిని సరఫరా చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వ సంస్థలు కూడా విజయ పాలు కొనుగోలు చేసి డెయిరీని, పాల రైతులను ప్రోత్సహించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన రూ.50 కోట్లతో జులై, ఆగస్టు నెలల పాల బిల్లులు ఇచ్చామని, మిగతా బిల్లులు కూడా త్వరలోనే ఇచ్చేందుకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. రాష్ట్రంలో పలు ప్రయివేటు డెయిరీల నిర్వహణ, వాటి గురించి పలు అంశాలపై ప్రస్తావించారు. పోటీ ప్రపంచంలో ప్రయివేటు డెయిరీల పోటీని తట్టుకుంటూ ప్రభుత్వ సహకారాన్ని తీసుకుంటూ ముందుకు వెళ్తామన్నారు. పాల కొరతను అధిగమించి ఉత్పత్తిని పెంచేందుకు 2022 ఫిబ్రవరిలో, 2023 నవంబర్‌లో మూడు సార్లు పాల సేకరణ ధరను పెంచినట్టు చెప్పారు. దేశంలో అత్యధిక ధరను చెల్లిస్తున్నది విజయ డెయిరీనే అని అన్నారు.



## మొగిలయ్యకు ఇంటి స్థల పత్రాలందించిన సీఎం



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్


ప్రముఖ కిన్నెర వాయిద్యకారుడు పద్మశ్రీ దర్శనం మొగిలయ్యకు హైదరాబాద్‌లోని హయత్‌నగర్‌లో 600 చదరపు గజాల ఇంటి స్థలాన్ని ప్రభుత్వం కేటాయించింది. సంబంధిత ధృవపత్రాలను అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం మొగిలయ్యకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన సంతోషాన్ని వ్యక్తం చేస్తూ సీఎంకు ధన్యవాదాలు తెలిపారు.

## ఎంపీ పదవికి ఆర్ కృష్ణయ్య రాజీనామా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వైసీపీ రాజ్యసభ సభ్యులు, బీసీ నేత ఆర్.కృష్ణయ్య తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఆయన రాజీనామాను ఆమోదిస్తూ రాజ్యసభ సెక్రటేరియట్ నోటిఫికేషన్ జారీ చేసింది. కాగా కృష్ణయ్య బీజేపీలో చేరనున్నట్టు తెలుస్తోంది. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయం చవిచూసిన నేపథ్యంలో ఆ పార్టీకి చెందిన ముగ్గురు సభ్యులు రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. బీసీ ఉద్యమాన్ని బలోపేతం చేసేందుకే రాజీనామా చేస్తున్నట్టు ఆయన మీడియాకు తెలిపారు. వందకు పైగా బీసీ సంఘాలతో చర్చించాకే ఈ నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించారు.

## బీఆర్‌కే ఛానల్ అధినేత ఇంట్లో ఐటీ దాడులు



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

హైదరాబాద్‌లో మరోసారి ఐటీ అధికారుల సోదాలు కలకలం రేపాయి. మొత్తం 8 బృందాలు బషీర్‌బాగ్‌లోని స్టార్ ఫైనాన్స్ కంపెనీతో పాటు, కూకట్‌పల్లి రెయిన్‌బో విస్టా అపార్ట్‌మెంట్లలోని బీఆర్‌కె ఛానల్ అధినేత బొల్లా రామకృష్ణ నివాసంలో మంగళవారం తెల్లవారుజాము నుంచి సోదాలు నిర్వహించారు. బొల్లా రామకృష్ణ నివాసం, కార్యాలయాలు, బంధువుల ఇండ్లను గుర్తించి ఈ సోదాలను నిర్వహించినట్టు తెలిసింది. ఇటీవల 'సీఎం పెళ్ళాం' మూవీకి బొల్లా రామకృష్ణ ప్రొడ్యూసర్‌గా వ్యవహరించినట్టు అధికారులు తెలిపారు. ఆదాయానికి మించిన ఆస్తులు ఉన్నట్టు ఫిర్యాదులు అందడంతో సోదాలు నిర్వహించి కీలకమైన పత్రాలు, ఫైళ్లు, దస్తాలు, నగదును ఐటీ అధికారులు స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం.

## నేడు, రేపు భారీ వర్షాలు

- పలు జిల్లాలకు ఎల్లో హెచ్చరిక
- మంగళవారం కురిసిన భారీ వర్షం



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో బుధ, గురు వారాల్లో పలు జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రధాన అధికారి డాక్టర్ కె.నాగరత్న హెచ్చరించారు. 25వ తేదీకి సంబంధించి ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, మెదక్, కామారెడ్డి జిల్లాలకు, 26న ఆదిలాబాద్, కొమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాలకు ఎల్లో హెచ్చరిక జారీ చేశారు. అదే సమయంలో రాష్ట్రంలోని మిగతా జిల్లాల్లోనూ గంటకు 30 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో మోస్తరు వానలు అక్కడక్కడా పడే అవకాశముందని పేర్కొన్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లో వచ్చే 48 గంటల పాటు ఆకాశం మేఘావృతమై ఉంటుందని తెలిపారు. తేలికపాటి నుంచి మోస్తరు వర్షం పలుచోట్ల కురిసే అవకాశముందని పేర్కొన్నారు. మంగళవారం ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు 500కి పైగా ప్రాంతాల్లో వర్షపాతం నమోదైంది. జనగామ, నల్లగొండ, రంగారెడ్డి, యాదాద్రి భువనగిరి, భద్రాద్రి కొత్తగూడెం, సిద్దిపేట, మహబూబ్‌నగర్, మేడ్చల్ మల్కాజిగిరి, రాజన్నసిరిసిల్ల, వికారాబాద్ జిల్లాల్లో పలుచోట్ల భారీ వర్షం కురిసింది. జనగామ జిల్లా దేవరుప్పలలో అత్యధికంగా 11.4 సెంమీటర్ల వాన పడింది.



# ప్రధాన నిందితుడు మైనరట!

ఐదో తరగతి మార్కుల లిస్టు చూసి నిర్ధారించారట

## అయోధ్య సామూహిక లైంగికదాడి కేసులో కొత్త ట్విస్ట్

### కేసును నీరుగార్చేందుకు ఖాకీల ప్రయత్నం

### బీజేపీ నాయకుడి కుమారుడు అయినందునే...

**అయోధ్య :** ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య జిల్లా సోహావల్ తాలూకా లో గత నెల ఓ దళిత యువతిపై జరిగిన సామూహిక లైంగికదాడి ఘటన నుంచి ఆ కుటుంబం ఇప్పటికీ తేరుకోలేపోతోంది. తాము సర్వస్వం కోల్పోయామని యువతి తల్లి రోదిస్తోంది. కుటుంబ సభ్యులెవ్వరూ ఇంటి నుంచి బయటికి రావడం లేదు. తప్పనిసరి పరిస్థితుల్లో పాఠశాలకు వెళ్లిన చిన్న కుమార్తెకు వేధింపులు తప్పడం లేదు. జరిగిన దారుణం నుంచి ఆ కుటుంబం ఇప్పట్లో తేరుకునే పరిస్థితులు కన్పించడం లేదు. గత నెల 16-25 తేదీల మధ్య దళిత యువతిని అతిథి గృహంలో, గ్యారేజీలో నిర్బంధించి ఆమెపై పలుమార్లు సామూహిక లైంగికదాడి జరిపిన ఉదంతం సంచలనం రేపింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు ఆమె స్నేహితుడు సహా ఐదుగురిని అరెస్ట్ చేశారు. ప్రధాన నిందితుడైన బాధిత యువతి స్నేహితుడు స్థానిక బీజేపీ నేత కుమారుడు. నాలుగేండ్ల నుంచి ఆమెకు తెలుసు. అయితే ఇక్కడ ట్విస్ట్ ఏమిటంటే అయోధ్య పోలీసులు అతనిని బాల నేరస్థుడిగా పేర్కొంటూ కేసు పెట్టారు.

వివాహం చేసుకుంటానని నమ్మించి అతను తనతో శారీరక సంబంధం ఏర్పరచుకున్నాడని బాధిత యువతి తెలిపింది. యువతి ఫిర్యాదును స్వీకరించేందుకు తొలుత పోలీసులు నిరాకరించారు. ప్రధాన నిందితుడు బాల నేరస్థుడుకాదని ఆమె చెబుతున్న మాటలను వారు నమ్మడంలేదు. పైగా అతనిపై నమోదు చేసిన అభియోగాలు ప్రశ్నార్థకంగా ఉన్నాయి. మొత్తం తొమ్మిది మంది నిందితుల్లో ముగ్గురిపై మాత్రమే సామూహిక అత్యాచారం కేసు నమోదు చేశారు. మరో ముగ్గురిపై లైంగిక వేధింపుల కేసు పెట్టారు. ప్రధాన నిందితుడిని బాల నేరస్థుడిగా ఎందుకు పరిగణించారని డీఎస్పీ శైలేంద్ర సింగ్‌ను ప్రశ్నించగా అతని ఐదోతరగతి మార్కుల జాబితా ఆధారంగా ఆ నిర్ధారణకు వచ్చామని బదులిచ్చారు. నేరం రుజువైతే బాల నేరస్థుడికి మూడేండ్లకు మించి జైలు శిక్ష పడదు.

సీనియర్ అధికారులను కలిసి, పరిస్థితిని వివరించిన తర్వాతే స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారని బాధిత యువతి కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రధాన నిందితుడి కుటుంబ సభ్యులు అతని వయసును తక్కువగా చెప్పారని బాధితురాలి తల్లి తెలిపారు. 'అతను నాలుగేండ్లుగా నా కుమార్తెకు తెలుసు. నా కుమార్తె 12వ తరగతి చదువుకునేటప్పుడు అతను కలిశాడు. ఆమెకు 20 సంవత్సరాల వయసు ఉంటే అతనికి పదహారున్నర సంవత్సరాలు ఎలా ఉంటాయి? అతని తండ్రి బీజేపీ నాయకుడు. అందుకే ఆ పార్టీ వారెవ్వరూ మా ఇంటికి రావడం లేదు. మిగిలిన పార్టీల వారందరూ వచ్చి సాయం అందిస్తామని చెబుతుంటే బీజేపీ నుంచి ఎవరూ రాలేదు' అని తెలిపారు.

ప్రధాన నిందితుడి తండ్రి అయోధ్య బీజేపీ విభాగం సమావేశాలకు హాజరయ్యేవాడని ఆయన ఫేస్‌బుక్ ప్రొఫైల్ చెబుతోంది. అయోధ్య ఎంపీ లల్లూ సింగ్, మాజీ ఎమ్మెల్యే వేద్ ప్రకాష్ గుప్తాతో అతను దిగిన ఫొటోలు కూడా ఉన్నాయి. అయితే వాటిని ఆ తర్వాత తొలగించారు.

# జమ్మూకాశ్మీర్‌పై నిరుద్యోగపడగ

**శ్రీనగర్ :** జమ్మూకాశ్మీర్‌లో పరిశ్రమలు లేకపోవడంతో వృత్తి నిపుణులు, పట్టభద్రులు, పోస్ట్ గ్రాడ్యుయేట్లు ఎక్కువగా ప్రభుత్వో ద్యోగాలపై ఆధారపడుతున్నారు. ఫలితంగా యువతలో నిరుద్యోగం ప్రబలుతోంది. పెద్దగా చదువు లేని వారు ప్రభుత్వం కల్పిస్తున్న ఉపాధి హామీతో పొట్ట పోసుకుంటున్నారు. కర్నాటకలోని రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్‌లో 2010లోనే బీడీఎస్ పూర్తి చేసిన రెయాజ్ ఖాన్ ఇప్పటికీ ఉద్యోగం సంపాదించలేకపోయారు. గత 14 సంవత్సరాలలో ప్రభుత్వం రెండు సార్లు మాత్రమే డెంటల్ సర్జన్ల నియామక ప్రక్రియ నిర్వహించిందని ఆయన గుర్తు చేశారు.



డిగ్రీలు ఉన్నా దినసరి కూలీలుగా జీవనం


రోజుకు రూ.300 కూడా గగనమే..

జమ్మూకాశ్మీర్‌లో ప్రతి ఏటా 226 మంది డెంటల్ సర్జన్లు విద్యాభ్యాసం పూర్తి చేసుకుంటున్నారు. కాశ్మీర్ వెలుపల దాదాపు అంతే సంఖ్యలో బీడీఎస్ ఉత్తీర్ణులవుతున్నారు. వైద్య నిపుణులు, ఇంజినీర్లు, పోస్ట్ గ్రాడ్యుయేట్లకు జమ్మూకాశ్మీర్‌లో ఉద్యోగాలు దొరకడం కష్టమేనని అధికారిక గణాంకాలే చెబుతున్నాయి. 2023-24 తొలి త్రైమాసికంలోనే 3.52 లక్షల మంది యువత ఉపాధి కల్పన విభాగంలో పేర్లు నమోదు చేసుకున్నారు. వీరిలో 1.09 లక్షల మంది పట్టభద్రులు, పోస్ట్ గ్రాడ్యుయేట్లు. నిరుద్యోగులలో మూడో వంతు వీరే ఉండడం గమనార్హం.

గత సంవత్సరం అక్టోబర్-డిసెంబర్ మధ్యకాలంలో 99,322 మంది గ్రాడ్యుయేట్లు, పోస్ట్ గ్రాడ్యుయేట్లు తమ పేర్లు నమోదు చేసుకున్నారు. అయితే అధికారిక, అనధికారిక గణాంకాల మధ్య చాలా వ్యత్యాసం కన్పిస్తోంది. జమ్మూకాశ్మీర్‌లో నిరుద్యోగ రేటు అత్యధికంగా 23.1 శాతంగా ఉన్నదని సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ గత ఏడాది ఏప్రిల్‌లో తెలిపింది. అయితే గత సంవత్సరపు జమ్మూకాశ్మీర్ ఆర్థిక సర్వే మాత్రం నిరుద్యోగం తగ్గిందని చెబుతోంది.

జమ్మూకాశ్మీర్‌లో తయారీ యూనిట్లు లేవు. ప్రయివేటు రంగం కేవలం వ్యవసాయం, ఆతిథ్యం, ఆరోగ్య రంగాలకు సేవలు అందించడానికే పరిమితం అయింది. పరీక్షా పత్రాల లీకేజీలు, ముడుపుల ఆరోపణల కారణంగా జమ్మూకాశ్మీర్‌లో నియామక ప్రక్రియలు ఆలస్యమవుతున్నాయి. 2022లో 1,200 ఎస్ఐ పోస్టుల భర్తీ కోసం పరీక్ష నిర్వహించగా 97,793 మంది హాజరయ్యారు. అయితే ఆరోపణల కారణంగా ఆ పరీక్ష రద్దయింది. తిరిగి నియామక ప్రక్రియ చేపట్టాలని లెఫ్టినెంట్ గవర్నర్ తీసుకున్న నిర్ణయం ఎంపికైన అభ్యర్థుల పాలిట శాపంగా మారింది. రాష్ట్రంలో స్టార్టప్‌ల నమోదు కూడా పేలవంగానే ఉంది. కేవలం 835 సంస్థలు మాత్రమే నమోదయ్యాయి. జమ్మూకాశ్మీర్‌లో 60 వేలకు పైగా ప్రభుత్వ దినసరి కార్మికులు పనిచేస్తున్నారు.

వీరికి రోజుకు రూ.300 వేతనం లభిస్తోంది. వీరంతా గత పదిహేను సంవత్సరాలుగా కాంట్రాక్ట్ పద్ధతి పైనే పని చేస్తున్నారు. విద్యుత్, ప్రజారోగ్యం, ఇంజినీరింగ్ వంటి ప్రభుత్వ విభాగాలలో సేవలు అందిస్తున్నారు. వందలాది మంది కార్మికులు గత 20 సంవత్సరాలుగా వన్యప్రాణుల విభాగంలో పనిచేస్తున్నా వారిని క్యాజువల్ కార్మికులుగా కూడా గుర్తించడం లేదు. వారిని సీజనల్ వర్కర్లుగా పిలుస్తున్నారు.




- పీహెచ్‌డీలు చేసినా ఉద్యోగాల్లేవ్..
- రోడ్లపై డ్రైఫ్రూట్స్ వెండర్, చిన్న చితకా పనులతో యువత జీవనం..
- జమ్మూకాశ్మీర్ ఎన్నికలపై నిరుద్యోగ ప్రభావం

### మ్యానిఫెస్టోల్లో కానరాని ఉపాధి అంశం

జమ్మూకాశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల తొలిదశలో భారీ ఓటింగ్ జరగడంతో అట్టహాసంగా ప్రారంభమైంది. 24 స్థానాల్లో 61 శాతం ఓటింగ్ జరిగింది. పదేండ్ల తర్వాత జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల్లో తమ ప్రభుత్వాన్ని ఎన్నుకునేందుకు జమ్మూ కాశ్మీర్ ప్రజల్లో ఉత్సాహం కనిపిస్తోంది. అన్ని రాజకీయ పార్టీలు అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి హామీలు గుమ్మరిస్తూ మ్యానిఫెస్టోలను విడుదల చేశాయి, అందులో రోడ్లు, విద్యుత్, నీరు నుంచి ఆర్టికల్ 370 వరకు వాగ్దానాలు చేశాయి. కానీ ప్రతి విజన్ డాక్యుమెంట్‌లో లేనిది నిరుద్యోగ సమస్యకు పరిష్కారమే.

### ప్రమాదకరస్థాయికి నిరుద్యోగం

జమ్మూ కాశ్మీర్‌లో నిరుద్యోగం ప్రమాదకర స్థాయికి చేరుకుంది. ఇక్కడ ఉన్నత చదువులు చదివిన యువతకు ఉపాధి కరువైంది. ప్రభుత్వ , ప్రయివేట్ రంగాలలో పరిమిత అవకాశాలే ఉన్నాయి. ఈ కారణంగా వేలాది మంది యువత నిరాశాజనక పరిస్థితిలో ఉన్నారు.దక్షిణ కాశ్మీర్‌లోని షోపియాన్ ప్రాంతం నుంచి ఇదే విధమైన నిరాశ కథనమిది. ఇక్కడ నివసించే డాక్టర్ మంజూర్ ఉల్ హసన్ పొలిటికల్ సైన్స్‌లో పీహెచ్‌డీ స్కాలర్ పట్టా తీసుకున్నాడు. కానీ అతను తన కుటుంబాన్ని పోషించుకోవడానికి బండిపై డ్రైఫ్రూట్స్ అమ్ముకోవాల్సి వస్తుంది. ఉద్యోగం కోసం అనేక ప్రయత్నాలు చేశాడు. ప్రభుత్వ శాఖలో 13 ఏండ్లుగా కాంట్రాక్టుపై పనిచేసినా రెగ్యులరైజ్ కాకపోవడంతో ఉద్యోగంలోనుంచి తీసేశారని హసన్ వాపోయారు. మంజూర్ కథ తనలాంటి వేలాది మంది నిరుద్యోగుల ఆవేదన ఇది. ఉన్నత చదువులు చదివినా ఎక్కడికీ వెళ్లలేక కుటుంబాన్ని పోషించుకోవడానికి చిన్న చిన్న ఉద్యోగాలు చేయవలసి వస్తుంది అని మంజూర్ కథనం వైరల్‌గా మారింది . నిరుద్యోగ సమస్య ఓటరు నాడిని తాకు తుంది.ఆర్టికల్ 370ని తొలగించాక.. ఇప్పుడు లోయలో పెట్టుబడులు పెరుగుతాయని చాలా వాదనలు జరిగాయి. ప్రయివేటు, ప్రభుత్వ రంగాల్లో ఉద్యోగాలు పెరుగుతాయి. చాలా కంపెనీలు వస్తాయి, కానీ గ్రౌండ్ పరిస్థితి భిన్నంగా సూచిస్తోంది.



# వీర తెలంగాణ వారసులు కమ్యూనిస్టులే

**ఎర్ర జెండా సాగించిన పోరు వల్లే నిజాం పీడ వదిలింది**

- సాయుధ పోరుకు మతం రంగు పులమడం దుర్మార్గం
- జోగిపేట గడ్డపైనే తొలి ఆంధ్ర మహాసభ
- అమరుల త్యాగాలను ముందుకు తీసుకెళ్లేందుకే 'శౌర్యయాత్ర'
- స్ఫూర్తినింపిన 'వీర తెలంగాణ వీధి నాటిక'

**నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి**

భూమి కోసం.. భుక్తి కోసం.. వెట్టి చాకిరి విముక్తి కోసం.. సాగిన వీర తెలంగాణ విప్లవ సాయుధ రైతాంగ పోరాటానికి కమ్యూనిస్టులు తప్ప మరెవ్వరూ వారసులు కాలేరని, ఎర్ర జెండా సాగించిన పోరాటం వల్లనే నిరంకుశ నిజాం ప్రభువు పీడ విరగడైందని పలువురు వక్తలు తెలిపారు. వీర తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా ప్రజా నాట్యమండలి ఆధ్వర్యంలో చేపట్టిన "శౌర్య యాత్ర" మంగళవారం సంగారెడ్డి జిల్లాలోని జోగిపేట, సంగారెడ్డి పట్టణాలకు చేరుకుంది. 1930లో తొలి ఆంధ్రమహాసభ జరిగిన జోగిపేట గడ్డలో శౌర్యయాత్ర కొనసాగింది. జోగిపేటలోని క్లాక్‌టవర్, సంగారెడ్డి పట్టణంలోని అంబేద్కర్ భవన్‌లో నిర్వహించిన శౌర్యయాత్ర సభల్లో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.సాయిలు మాట్లాడారు. జోగిపేటలో జరిగిన తొలి ఆంధ్రమహాసభ స్ఫూర్తితో తెలంగాణ పరగణంతా పోరాట క్షేత్రాలుగా మారాయన్నారు. నిజాం నిరంశ పాలనలో ప్రజల్ని బానిసలుగా భావించి వెట్టి చేయించారన్నారు. సకల వృత్తిదారులు, శ్రమజీవులంతా కూడా దొరలు, దేశ్‌ముఖ్‌లు, భూస్వాముల ఆగడాలతో చితికిపోయే పరిస్థితుల్లో కమ్యూనిస్టులు సంఘం పెట్టి పోరాడాల్సి వచ్చిందని తెలిపారు. విస్నూరు రామచంద్రారెడ్డి సాగించిన దురాఘతాలను పాలకుర్తిలో ఐలమ్మ, కడవెండిలో దొడ్డి కొమరయ్య ప్రతిఘటించి తిరగబడి పోరాటం చేశారని గుర్తు చేశారు. దొడ్డి కొమరయ్య బలిదానంతో తెలంగాణ అంతటా సామాన్యులే సాయుధులై బంధూకులు, బడిసెలు, ఒడిసేలలు చేతబట్టి దొరలకు వ్యతిరేకంగా తిరుగుబాటు పోరాటం సాగించిన ఫలితంగా నిజాం ప్రభు లొంగిపోయాడన్నారు. ఎర్ర జెండా నాయకత్వంలో వేలాది గ్రామాలు విముక్తిని సాధించడమే కాకుండా లక్షలాది ఎకరాల భూముల్ని భూమిలేని పేదలకు పంపిణీ చేయబడిందని చెప్పారు. రాజరిక నిజాం నిరంకుశ పాలన పోయినప్పటికీ ప్రజాస్వామ్య వ్యవస్థలో నయా నిజాంలు మనల్ని పాలిస్తున్నారన్నారు. మతోన్మాదంతో బీజేపీ వీర తెలంగాణ సాయుధ పోరాటానికి మతం రంగు పులమడం దుర్మార్గమైన చర్య అని తెలిపారు. నిజాంకు వ్యతిరేకంగా బందగీ, సోయబుల్లాఖాన్ లాంటి మైనార్టీలు సైతం పోరాడి ప్రాణాలర్పించిన చరిత్రను బీజేపీ విస్మరిస్తుందన్నారు. తెలంగాణ సాయుధ పోరాట అమరులు అందించిన పోరాట స్ఫూర్తితో ప్రజా వ్యతిరేక విధానాలు అనుసరిస్తున్న నేటి పాలకులకు వ్యతిరేకంగా సంఘటితంగా పోరాడాల్సిన అవసరముందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అతిమేల మాణిక్యం, జిల్లా కమిటీ సభ్యులు విద్యాసాగర్, ఎం.యాదగిరి, పీఎస్ఎం రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్, ఉపాధ్యక్షులు ఏర్పుల వెంకన్న, రాష్ట్ర నాయకులు వినోద్, గంటెపాక శివ, చంద్రమౌళి నాగభూషణం, ఆంజనేయులు, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి అశోక్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

### స్ఫూర్తిని నింపిన వీర తెలంగాణ వీధి నాటిక

శౌర్యయాత్ర సందర్భంగా జోగిపేట, సంగారెడ్డిలో పీఎస్ఎం కళా బృందం ప్రదర్శించిన 'వీర తెలంగాణ వీధి నాటిక' ఎంతో స్ఫూర్తి నింపింది. నిజాం కాలంలో సాగిన నిరంకుశ పాలన, పన్నుల భారాలు, వెట్టి చాకిరి, అత్యాచారాలు, హత్యలకు సంబంధించిన సంఘటనలను కండ్లకు కట్టినట్టుగా కళా రూపంలో ప్రదర్శించారు. ఐలమ్మ చాటిన తెగువ, దొడ్డి కొమరయ్య బలిదానం వంటి సన్నివేశాలు సభికుల్ని ఉత్తేజితుల్ని చేశాయి. వెట్టిని భరించలేక తెగింపుతో సంఘంగా ఏర్పడిన సామాన్యులే తుపాకులు బట్టి తిరగబడిన తెగువ, "బండెనక బండి కట్టి పదహారు బండ్లు కట్టి ఏ బండ్లో పోతవ్ కొడుకో నైజాం సర్కరోడా.." అనే పాట, సన్నివేశాలు పోరాట చైతన్యాన్ని తెలియజేశాయి. నాటి పోరాట ఘట్టాలను ఆటా-పాటా-మాట రూపంలో ప్రదర్శించారు.



# లండన్‌లో ఏచూరికి ఘన నివాళి



**నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో**

మార్క్సిస్ట్ నేత సీతారాం ఏచూరికి లండన్‌లో ఘన నివాళి అర్పించారు. ఎస్ఎఫ్ఐ యునైటెడ్ కింగ్‌డమ్ ఆధ్వర్యంలో లండన్‌లోని మార్క్స్ మెమోరియల్ లైబ్రరీలో మంగళవారం కామ్రేడ్ సీతారాం ఏచూరిని స్మరించుకుంటూ సంతాప సభ జరిగింది. ఎస్ఎఫ్ఐ మాజీ అఖిల భారత అధ్యక్షుడు కామ్రేడ్ సీతారాం ఏచూరి జీవితం, వారసత్వాన్ని కొనసాగిస్తామని, అదే ఆ మహానేతకు మనమిచ్చిన ఘనమైన నివాళి అని నేతలు పేర్కొన్నారు. ఈ సభలో ఎస్ఎఫ్ఐ ప్రధాన కార్యదర్శి మయూఖ్ బిస్వాస్, ఇండియన్ వర్కర్స్ అసోసియేషన్ (జీబి) వైస్ ప్రెసిడెంట్ హర్సేవ్ బెయిన్స్, నేషనల్ యూనియన్ ఆఫ్ రైల్, మారిటైమ్ అండ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ నేషనల్ ప్రెసిడెంట్ అలెక్స్ గోర్డాన్, క్యూబా ఎంబసి నుంచి ఎకనామిక్ కౌన్సెలర్ కామ్రేడ్ మార్టా కాస్టిల్లో ప్రసంగించారు. ఎస్ఎఫ్ఐ యుకే సెక్రెటరీ నిఖిల్ మాథ్యూ, యంగ్ కమ్యూనిస్ట్ లీగ్ ఆఫ్ బ్రిటన్ లండన్ సెక్రెటరీ బెన్ వుడ్‌వర్డ్, కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ బ్రిటన్ లండన్ సెక్రెటరీ రాబిన్ టాల్బోట్, సోషలిస్ట్ చైనా ఫ్రెండ్స్ కో-డైరెక్టర్ కార్లోస్ మార్టినెజ్ తదితరులు పాల్గొన్నారు.

సంతాప సభ అనంతరం ఎస్ఎఫ్ఐ, వైసిఎల్ మధ్య ద్వైపాక్షిక చర్చ జరిగింది. రెండు సంస్థల మధ్య అంతర్జాతీయ సంఘీభావ తక్షణ ఆవశ్యకతపై మార్క్స్ మెమోరియల్ లైబ్రరీలో వైసిఎల్ ఏర్పాటు చేసింది. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ ప్రధాన కార్యదర్శి మయూఖ్ బిశ్వాస్ ప్రసంగించారు, విద్య కేంద్రీకరణ, కాషాయికరణకు వ్యతిరేకంగా మిలిటెంట్ ఆందోళనలను నిర్వహించిన ప్రగతిశీల భారతీయ విద్యార్థి ఉద్యమం అనుభవం గురించి వివరించారు.

# చెరువుల చుట్టూ సీసీ కెమెరాలు

### కమాండ్ కంట్రోల్ రూంకు అనుసంధానం

- ఔటర్ లోపలి ఆక్రమణల నమోదు
- అర్హులైన పేదలకు డబుల్ బెడ్‌రూంలు : మూసీ రివర్‌ఫ్రంట్ సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి

**నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో**

ఔటర్ రింగ్‌రోడ్డుకు లోపల ఉన్న చెరువుల చుట్టూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, వాటిని పోలీస్ కమాండ్ కంట్రోల్‌రూంకు అనుసంధానం చేయాలని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి అధికారుల్ని ఆదేశించారు. మంగళవారంనాడాయన తన నివాసంలో మూసీ రివర్ ఫ్రంట్, మెట్రోరైల్‌పై సమీక్షా సమావేశం నిర్వహించారు. మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిశోర్, మెట్రోరైల్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్వీఎస్ రెడ్డి, సలహాదారు శ్రీనివాసరాజు, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్‌తో పాటు రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న చెరువులు, కుంటలు, నాలాలు, మూసీ పరివాహక ప్రాంతాలను గుర్తించి ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లను గుర్తించాలని చెప్పారు. ప్రతి చెరువు, నాలాల ఆక్రమణల వివరాలు సేకరించి, దానిపై సాధ్యమైనంత త్వరగా పూర్తి స్థాయి నివేదిక ఇవ్వాలని కోరారు. ఆక్రమణల గుర్తింపు సందర్భంగానే అర్హులైన పేదలకు నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అలాంటి వారికి డబుల్ బెడ్‌రూం ఇండ్లు కేటాయించాలని చెప్పారు. పేదల జోలికి మాత్రం వెళ్లొద్దని అధికారుల్ని ఆదేశించారు. ఎయిర్‌పోర్టు నుంచి ఫ్యూచర్ సిటీకి మెట్రోరైల్ మార్గంపై పూర్తి స్థాయి నివేదికను రూపొందించాలని కోరారు. ఓల్డ్‌సిటీ మెట్రో విస్తరణ పనులను వేగవంతం చేయాలన్నారు. మెట్రో మార్గాలకు భూసేకరణ, ఇతర అడ్డంకులు ఏమైనా ఉంటే వాటిపై అధికారులు ప్రత్యేకంగా దృష్టిపెట్టి, పరిష్కరించాలని చెప్పారు. ఎల్బీ నగర్ నుంచి హయత్‌నగర్, ఎమ్‌జీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు మెట్రో విస్తరణ అంశాలను ఈ సందర్భంగా అధికారులు సీఎంకు వివరించారు. దసరాలోపు మెట్రో విస్తరణ రూట్‌కు సంబంధించి డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్టు (డీపీఆర్) సిద్ధం చేసి కేంద్రానికి సమర్పించాలని ఆదేశించారు.

# నేడు జమ్మూకాశ్మీర్ రెండో దశ ఎన్నికలు

### బరిలో ఒమర్‌సహా పలువురు ప్రముఖులు



**రాజౌరి :** జమ్మూకాశ్మీర్ అసెంబ్లీ ఎన్నిక రెండో దశ పోలింగ్ బుధవారం జరగనుంది. ఈ నెల 18న మొదటిదశ పోలింగ్ జరగ్గా, అక్టోబర్ 1న మూడో దశ పోలింగ్ జరగనుంది. ఆరు జిల్లాల్లో 26 అసెంబ్లీ స్థానాలకు బుధవారం పోలింగ్ ప్రారంభం కానుంది. ఎన్నికలు జరిగే ప్రాంతాలకు భద్రతా దళాలు మోహరించి కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశాయి. కంగన్ (ఎస్టీ), గందర్‌బల్, హజ్రత్‌బాల్, ఖన్యార్, హబ్బకదల్, లాల్ చౌక్, చన్నపోరా, జదిబాల్, ఈద్గా, సెంట్రల్ షాల్టెంగ్, బుద్గామ్, బీర్వా, ఖాన్ సాహిబ్, చ్రార్-ఇ-షరీఫ్, చదూరా, గులాబ్‌గఢ్ (ఎస్టి) వంటి కీలక స్థానాలకు బుధవారం ఎన్నికలు జరగనున్నాయి.

రెండో దశలో పలువురు ప్రముఖులు పోటీ చేస్తున్న స్థానాలు కూడా ఉన్నాయి. జమ్మూ కాశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఒమర్ అబ్దుల్లా పోటీ చేస్తున్న రెండు స్థానాలు బుద్గామ్, గందర్‌బల్ స్థానాలకు బుధవారం ఎన్నికలు జరగనున్నాయి. జమ్మూకాశ్మీర్ బీజేపీ చీఫ్ రవీందర్ రైనా బరిలో నిలిచిన నౌషెరా స్థానానికి, ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు తారిఖ్ హమీద్ కర్రా పోటీ చేస్తున్న సెంట్రల్ - షాల్ టెంగ్ స్థానానికి బుధవారం పోలింగ్ జరగనుంది.


# అక్టోబర్ 9న సింగరేణి కార్మికులకు బోనస్ చెల్లింపు

### కాంట్రాక్టు కార్మికులకు చెల్లింపుపై విధివిధానాలు

- దానితోపాటే పండుగ అడ్వాన్స్ రూ.25వేలు
- అధికారులకు సీఎమ్‌డీ ఎన్ బలరాం ఆదేశాలు

**నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో**

రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి కార్మికులకు ప్రకటించిన 33 శాతం లాభాల వాటా బోనస్‌ను అక్టోబర్ 9వ తేదీ చెల్లించేలా ఏర్పాట్లు చేయాలని ఆ సంస్థ సీఎమ్‌డీ ఎన్ బలరాం అధికారుల్ని ఆదేశించారు. మంగళవారంనాడాయన అమెరికా నుంచి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. సంస్థ డైరెక్టర్లు, అన్ని ఏరియాలు, కార్పొరేట్ కార్యాలయం జనరల్ మేనేజర్లు దీనిలో పాల్గొన్నారు. ప్రస్తుతం ఆయన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలిసి అమెరికా, జపాన్ పర్యటనలో ఉన్న విషయం తెలిసిందే. సింగరేణి సంస్థ 2023-24 ఆర్థిక సంవత్సరంలో సాధించిన నికర లాభాల్లో రూ.796 కోట్లను (33 శాతం) లాభాలవాటా బోనస్‌గా ప్రకటించింది. సంస్థలో పనిచేస్తున్న దాదాపు 42 వేల మంది అధికారులు, కార్మికులకు ఈ లాభాల వాటాను పంపిణీ చేయనున్నారు. గత ఆర్థిక సంవత్సరంలో తాము పనిచేసిన పని దినాల సంఖ్యను పరిగణనలోకి తీసుకొని లాభాల వాటా బోనస్ చెల్లిస్తారు. సగటున ఒక్కొక్కరు దాదాపు రూ. లక్షా తొంబై వేలు చొప్పున లాభాల వాటా బోనస్‌ను పొందే అవకాశం ఉంది. అయితే సంస్థలో పనిచేస్తున్న దాదాపు



25వేల మంది కాంట్రాక్టు ఉద్యోగులకు కూడా తొలిసారిగా ఈ బోనస్ చెల్లించాలని నిర్ణయించారు. దీనికి సంబంధించిన విధివిధానాలపై కసరత్తు చేయాలని ఈ సందర్భంగా సీఎమ్‌డీ అధికారుల్ని ఆదేశించారు. ఆర్థిక సంవత్సరంలో వివిధ కాంట్రాక్టర్ల వద్ద పనిచేసిన వారి వివరాలు, పూర్తిగా సేకరించి, దసరా పండుగకు ముందే వారికి కూడా బోనస్ చెల్లింపు జరిగేలా చూడాలని స్పష్టం చేశారు. అలాగే ఈ నెల జీతంతోనే పండుగ అడ్వాన్సుగా ఒక్కొక్కరికి రూ.25 వేలు చొప్పున చెల్లించాలని చెప్పారు. దీనికోసం సంస్థ రూ.95 కోట్లను కేటాయించిందన్నారు. సెప్టెంబరు నెల జీతాలతోపాటే పండుగ అడ్వాన్స్ సొమ్మును కూడా ఉద్యోగుల ఖాతాల్లో జమ చేయాలన్నారు.

# కాలేజీల్లో ఎన్ఆర్ఐ కోటా పెద్ద మోసం

సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

### పంజాబ్ ప్రభుత్వ అప్పీల్ కొట్టివేత




**న్యూఢిల్లీ :** కాలేజీల్లో ఎన్ఆర్ఐ కోటా కింద అడ్మిషన్లు అనేది పెద్ద మోసమని, దీన్ని వెంటనే ఆపాల్సి వుందని సుప్రీం కోర్టు మంగళవారం వ్యాఖ్యానించింది. పంజాబ్ రాష్ట్రంలో అండర్‌గ్రాడ్యుయేట్ మెడికల్, డెంటల్ కోర్సుల్లో అడ్మిషన్లకు ఎన్ఆర్ఐ కోటా నిర్వచనం పరిధిని విస్తరించాలని పంజాబ్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని కొట్టివేస్తూ హైకోర్టు తీర్పు ఇచ్చింది. దానిపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టులో అప్పీల్ చేసింది. ఆ అప్పీల్‌ను మంగళవారం సుప్రీం కోర్టు కొట్టివేసింది.

రాష్ట్రంలోని మెడికల్ కాలేజీల్లో ప్రవేశాల కోసం ఎన్ఆర్ఐల అంకుల్స్, ఆంటీలు, కజిన్లతో సహా దూరపు బంధువులందరినీ 15శాతం ఎన్ఆర్ఐ కోటా కిందకు చేరుస్తూ ఆగస్టు 20న ఆప్ ప్రభుత్వం తీసుకున్న చర్యను పంజాబ్, హర్యానా హైకోర్టు సెప్టెంబరు 10న కొట్టివేసింది. 'ఇది డబ్బు సృష్టించే యంత్రం తప్ప మరొకటి కాదు.' అని ప్రధాన న్యాయమూర్తి డి.వై. చంద్రచూడ్, జస్టిస్ జె.బి.పార్థివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన బెంచ్ వ్యాఖ్యానించింది.

"అన్ని పిటిషన్లను కొట్టివేయాలి. ఈ ఎన్ఆర్ఐ బిజినెస్ అంతా మోసం తప్ప మరొకటి కాదు. దీనికి వెంటనే ఫుల్‌స్టాప్ పెట్టాలి. ఇకపై చట్టానికి ప్రాధాన్యతనివ్వాలి." అని బెంచ్ స్పష్టం చేసింది. హైకోర్టు ఇచ్చిన తీర్పు సరైనదని పేర్కొంది. మూడు రెట్లు ఎక్కువ మార్కులు వచ్చిన అభ్యర్థులకు వీరి వల్ల కాలేజీల్లో అడ్మిషన్లు దొరకవని పేర్కొంది. విదేశాల్లో స్థిరపడిన వారి బంధువులనే ఒకే ఒక కారణంతో మెరిట్ అభ్యర్థులను పక్కకు తోసి వారికి ప్రవేశాలు కల్పించడాన్ని ఇక ఎంత మాత్రమూ అనుమతించరాదని చంద్రచూడ్ స్పష్టం చేశారు. ఈ ఎన్ఆర్ఐ కోటా వ్యాపారాన్ని తక్షణమే నిలుపుచేయాలన్నారు.

పంజాబ్ ప్రభుత్వం తరపున వాదనలు వినిపిస్తున్న సీనియర్‌న్యాయవాది షాదాన్ ఫరాసత్ మాట్లాడుతూ హిమాచల్ ప్రదేశ్, ఉత్తరప్రదేశ్ వంటి ఇతర రాష్ట్రాలు కూడా ఎన్ఆర్ఐ కోటా నిర్వచనానికి విస్తృత భాష్యం చెబుతున్నాయని అన్నారు. పైగా 15శాతం ఎన్ఆర్ఐ కోటాను ఎలా మంజూరు చేయాలో నిర్ణయించే అధికారం రాష్ట్రాలకు వుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ ఈఅంశాన్ని పరిగణనలోకి తీసుకోవాలని బెంచ్ సూచించింది.

నవతెలంగాణ

సన్నిహితులు అవడం ఆరంభం, సన్నిహితులుగా ఉండడం అభివృద్ధి, కలిసి పనిచెయ్యడం విజయం - హెన్రీ ఫోర్డ్



సంపాదకీయం

# అడవి ఆర్తనాదం



పచ్చని పైరుని తలపించే స్వచ్ఛమైన వికారాబాద్ అడవి ఆపదలో పడింది. ఆదుకోమంటూ ఆర్తనాదం చేస్తోంది. మూడు వేల ఎకరాల దామగుండం రిజర్వు ఫారెస్టులో 900 ఎకరాల భూమిని కేంద్ర నేవీ నిర్మించే రాడార్ కేంద్రం కోసం గత ప్రభుత్వాలు కేటాయించాయి. దీని కోసం 12 లక్షల పచ్చని చెట్లను నరికేసేందుకు నేవీ వారు సిద్ధమయ్యారు. సహజసిద్ధ అడవిని నరికేసి పర్యావరణాన్ని సర్వనాశనం చేసేందుకు పక్కా ప్రణాళిక రూపొందించారు. అభివృద్ధి పేరిట వినాశనం మొదలుపెట్టారు. అడవిలోకి నరమానవులెవరూ ప్రవేశించకుండా కంచెల నిర్మాణమూ ప్రారంభించారు.

వికారాబాద్ జిల్లా పూడూరు మండలం దామగుండం అడవిని హైదరాబాద్ మహానగరానికి స్వచ్ఛమైన ప్రాణ వాయువు అందించే

> **ఒకపక్క మూసీ ప్రక్షాళన చేస్తామంటున్నారు. మరోపక్క సహజ సందపను నాశనం చేస్తూ మూసీని కనుమరుగు చేయబోతున్నారు. ఇలాంటి వినాశనకర చర్యల వల్ల హైదరాబాద్ పక్ర్పతి వైపరీత్యాల నుంచి ఎలా తప్పించుకోగలదు? వాస్తవానికి రివర్ కేచ్‌మెంట్ ఏరియాలో ఇలాంటి డెవలప్మెంట్ ప్రాజెక్టులు చేపట్టడం హైడ్రా చట్టానికి కూడా విరుద్ధం. అలాంటిది ఇంతటి విధ్వంసానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకోవడం అత్యంత విషాదం.**

నేచురల్ ఆక్సిజన్ సిలిండర్‌గా చెప్పుకుంటాం. అటువంటి అడవిని ధ్వంసం చేసేందుకు ప్రభుత్వాలు సిద్ధమయ్యాయి. అక్కడ నేవీ అధికారులు, సిబ్బంది ఉండేందుకు టౌన్ షిప్ కట్టబోతున్నారు. పచ్చని అడవి స్థానంలో 2027 నాటికి స్కూళ్లు, హాస్పిటల్స్, మార్కెట్, బ్యాంకు, పెద్ద రోడ్లు పూర్తవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే ఇక్కడ నరికేయబోయే చెట్లకు బదులుగా దేశంలో ఏదో ఒక చోట ఇంకో 12 లక్షల చెట్లు నాటుతామని నేవీ అధికారులు పబ్లిక్ నోటీసు ఇచ్చారు. ఎన్ని చెట్లు నాటినా ఇంత పెద్ద సహజమైన, ఔషధ మొక్కల అడవిని తిరిగి నిర్మించగలరా అనేది ఓ శేష ప్రశ్న.

ఇప్పటికే అడవుల నరికివేతకు అధికారికంగా పర్మిషన్ ఇచ్చిన రాష్ట్రాల్లో తెలంగాణ దేశంలో మొదటి స్థానంలో ఉంది. 2014 అంటే, రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి కేవలం ఐదేండ్లలో తెలంగాణలో అధికారికంగా 12,12,753 చెట్ల నరికివేతకు అనుమతి ఇచ్చినట్లు 2020లో ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్, తెలంగాణ (పీసీసీఎఫ్) స్వయంగా హైకోర్టుకు చెప్పింది. ఇప్పుడు ఒకే అడవిలో 12 లక్షల చెట్లతో పాటు, 150 ఎకరాల్లో లక్షలాదిగా ఉన్న ఔషధ మొక్కల్ని సైతం సర్వనాశనం చేయబోతున్నారు. భవిష్యత్‌లో రాడర్ నుండి వెలువడే రేడియేషన్లతో పక్షులు, వన్యప్రాణులు కనుమరుగయ్యే ప్రమాదమూ ఉంది.

అన్నింటికీమించి ఈ రాడార్ కేంద్రం మూసీ నదికి మరణశాసనం కాబోతోంది. దీనిపై పర్యావరణవేత్తలు తీవ్ర ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. వీరి ఆందోళనలో నిజముంది. ఎందుకంటే మూసీ పుట్టింది ఈ వికారాబాద్ అడవుల్లోనే. నది పుట్టిన చోట ఇటువంటి ప్రాజెక్ట్ నిర్మిస్తే భవిష్యత్తులో మూసీ ఎండిపోయే ప్రమాదం ఉంది. ఒకపక్క మూసీ ప్రక్షాళన చేస్తామంటున్నారు. మరోపక్క సహజ సందపను నాశనం చేస్తూ మూసీని కనుమరుగు చేయబోతున్నారు. ఇలాంటి వినాశనకర చర్యల వల్ల హైదరాబాద్ పకృతి వైపరీత్యాల నుంచి ఎలా తప్పించుకోగలదు? వాస్తవానికి రివర్ కేచ్ మెంట్ ఏరియాలో ఇలాంటి డెవలప్మెంట్ ప్రాజెక్టులు చేపట్టడం హైడ్రా చట్టానికి కూడా విరుద్ధం. అలాంటిది ఇంతటి విధ్వంసానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకోవడం అత్యంత విషాదం.

అలాగే తెలంగాణలో ఉన్న అతిపెద్ద నేచురల్ ఫారెస్ట్ ఈ దామగుండం అడవులు. నల్లమలలో కూడా ఐదు శాతం మాత్రమే న్యాచురల్ ఫారెస్ట్ ఉంది. హైదరాబాద్‌కు 80 కిలోమీటర్ల దూరంలో ఇంత అద్భుతమైన నేచురల్ ఫారెస్ట్ ఉండటం రాజధాని నగరానికి అతిపెద్ద సంపద. అంతే కాదు ఈ అడవి చుట్టూ ఉన్న 20 గ్రామాల్లో ఉన్న 60 వేల మందికి ఈ అడవే అమ్మతల్లి. రైతులు తమ పశువులు మేపుకోవడానికి ఈ అడవే ఆధారం. పచ్చటి పొలాలన్నీ రియల్ ఎస్టేట్‌లా మారిపోతున్న నేటి పరిస్థితుల్లో ఈ అడవే వాళ్లకు నెలవు. అటువంటి అడవిని నరికి వారి పొట్టకొట్టబోతున్నారు. రాడార్ కేంద్రం కోసం ఈపాటికే అడవి చుట్టూ భారీ ప్రహరీ కట్టడం మొదలుపెట్టారు. దీంతో స్థానికులెవరినీ ఇక అడవిలోకి పోనివ్వరు. అలాగే ఇదే అడవిలో 500 ఏండ్ల చరిత్ర ఉన్న పురాతన శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంతో పాటు ఏడాది మొత్తం నీటి ఊటలూరే సహజమైన గుండం కూడా ఉంది. ఇవన్నీ అడవితో పాటే కనుమరుగుకానున్నాయనే భావనే గుండెలను పిండేస్తున్నది.

ఇప్పటికే పెరిగిపోతున్న కాలుష్యం వల్ల నగర ప్రజలు విష జ్వరాల బారిన పడుతున్నారు. ఇక జనావాసానికి సమీపంలో రాడార్ కేంద్రం నిర్మిస్తే అనతి కాలంలోనే స్థానిక జనజీవనం అస్తవ్యస్తమయ్యే ప్రమాదం ఉంది. ఇది వదిలే రేడియేషన్స్ వల్ల హైదరాబాద్‌లో మన తర్వాతి తరానికి స్వచ్ఛమైన గాలి అందకుండా పోతుంది. ప్రకృతి విపత్తులకు హైదరాబాద్ కేంద్రంగా మారే అవకాశమూ ఉంది. ప్రజలపై మరిన్ని రోగాలు దాడి చేసే ప్రమాదమూ ఉంది. ఢిల్లీలోవలె మన హైదరాబాద్‌లో కూడా మాస్క్ లేకుండా బయటకి రాలేని స్థితి వచ్చినా ఆశ్చర్యపోవల్సింది లేదు. ఇంతటి విధ్వంసాన్ని సృష్టించబోయే ఈ అభివృద్ధి అవసరమా? జరగబోయే ఈ వినాశనానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి. రాడార్ కేంద్ర నిర్మాణంపై పునరాలోచించాలి. పర్యావరణానికి, ప్రజలకు హానిలేని ప్రదేశాన్ని దీని కోసం కేటాయించాలి. లేదంటే ఈ మహా విధ్వంసాన్ని ఆపేందుకు ప్రజలు మరో చిప్కో ఉద్యమానికి సన్నద్ధమవ్వడం ఖాయం.

---

## ఫార్మసిస్టులకు గుర్తింపేది?



భూమండలంలో మనిషి జీవితకాలంలో ఏదో ఒక సమయంలో రోగాల బారినపడటం వాస్తవం. ఆ జబ్బు నయం చేసేందుకు కావాల్సింది ప్రధానంగా ఔషదం. ఆ ఔషదాల తయారీలో కీలకంగా వ్యవహరించేవారే ఫార్మసిస్టు.కోవిడ్-19 బారిన పడి ప్రపంచంలోని కోట్లాది ప్రజలు తమ ప్రాణాలను అరచేతుల్లో పెట్టుకొని భయ భ్రాంతులకు లోనై లక్షలాది ప్రజలు ప్రాణాలు కోల్పోయిన విషాద ఘటనల నుంచి కుటుంబాలు నేటికీ తేరుకోనేలేదు. మానవ సమాజాన్ని అల్లకల్లోలం చేసిన ఈ మహమ్మారిని రూపుమాపేందుకు కృషిచేసిన వారిలో నిపుణులు "ఫార్మసిస్టులు". వ్యాక్సిన్స్ తయారు కావడానికి అహర్నిశలు కృషి చేసి కోట్లాదిమంది ప్రజల ప్రాణాలని కాపాడిన ఘనత వారికే దక్కుతుంది. వారి సేవలను గుర్తు చేసుకుంటూ ప్రపంచ ఆరోగ్య సంస్థ భాగస్వామియైన ఇంటర్నేషనల్ ఫార్మసూటికల్ ఫెడరేషన్ (ఎఫ్ఐపి)వ్యవస్థపాక దినోత్సవాన్ని 25 సెప్టెంబర్, 2009 నుండి ప్రపంచ ఫార్మసిస్ట్ దినోత్సవంగా జరుపుకుంటున్నాము.

ప్రపంచవ్యాప్తంగా రోజురోజుకూ పెరిగిపోతున్న కొత్త కొత్త రోగాలకు దానికి తగ్గట్టుగా వైరస్లను దృష్టిలో పెట్టుకొని కొత్త ఔషధాలు తయారు చేయడం, నివారణ మార్గాలను కనుగొనడంలో ఫార్మసిస్ట్స్ పాత్ర కీలకమైనది. పేషెంట్లకు సరైన మోతాదులో ట్రీట్మెంట్ ఎలా ఇవ్వాలో తెలిసినటువంటి వైద్య ప్రయోక్త. ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా 1948సంవత్సరంలో పార్లమెంటులో చట్టం చేయబడింది. ఫార్మసిస్టుల పర్యవేక్షణలోనే మెడిసిన్ పంపిణీ చేయాలని పేర్కొంది. ఔషధ తయారీ వాటి నాణ్యత ప్రమాణాలను పర్యవేక్షించుట, వ్యాధిగ్రస్తులకు మంచి మందులు వినియోగం, తగు సూచనలు, సలహాలు ఇవ్వడం, వాటి దుష్ఫలితాల పట్ల అవగాహన కల్పించడంలో ఫార్మసిస్టుల పాత్ర వెలకట్ట లేనిది.కానీ ఫార్మసిస్టులకు మన దేశంలోని పాలకవర్గాలు సరైన గుర్తింపు ఇవ్వడం లేదు. దీంతో వారి సేవల్ని ప్రజలు నియోగించుకోలేకపోతున్నారు. ఫలితంగా రోగులకు సరైన పద్ధతిలో, మోతాదులో వైద్యమందకపోవడంతో ప్రతి ఏటా లక్షలాది మంది ప్రాణాలు పోతున్నాయి. ఫార్మసిస్టు రోగికి డాక్టర్‌కు మధ్య వారధి లాంటి వాడు. వ్యాధిని గుర్తించి తగిన మందులు సూచించేవాడు వైద్యుడైతే ఔషధ ఎంపిక, మోతాదు వినియోగం సమస్తం అవగాహన కల్పించేది ఫార్మసిస్ట్ మాత్రమే. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో అత్యవసర పరిస్థితుల్లో డాక్టర్ లేనప్పుడు పేషెంట్‌కు ట్రీట్మెంట్ చేసేది ఫార్మసిస్టే. కేంద్ర ఆరోగ్య శాఖ జాతీయ ఆరోగ్య విధానం-2017 ఫార్మసిస్టుల విశిష్టతను గుర్తించింది. అజిత్ ప్రసాద్ జైన్ అధ్యక్షతన ఏర్పాటైన స్టడీ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ కమిటీ చిన్నపాటి వైద్యశాలలో కూడా ముగ్గురు ఫార్మసిస్టులు ఉండాలని 1966 సంవత్సరంలోనే సిఫారసు చేసింది.

ఫార్మసిస్టు డ్రగ్ ఎక్స్పర్ట్, అభివృద్ధి చెందిన దేశాలైన జర్మనీ, ఫ్రాన్స్,ఇటలీ, బ్రిటన్, అమెరికా, యూరోపియన్ దేశాలు, సౌదీ అరేబియా దేశాల్లో ఫార్మసిస్టులకు పెద్దపీట వేస్తున్నారు. ఆయా దేశాల వైద్యులు పరీక్షల అనంతరం వ్యాధిని గుర్తించి ఆ వ్యాధికి ఫలానా మందు అని నిర్ధారణ చేస్తారు.ఆ వ్యాధికి ఏ ఔషధం సరిపోతుందో, అది ఏ సమయంలో ఎంత మోతాదులో, ఏ విధంగా వినియోగించాలో రోగికి ఫార్మసిస్ట్ మాత్రమే సూచిస్తాడు. కొన్ని యూరప్ దేశాల్లో రోగి వ్యాధిని గుర్తించి ఔషధాన్ని సిఫారసు చేసే అధికారం ఫార్మసిస్టు మాత్రమే ఉంది. తెలంగాణ రాష్ట్రంలో వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న ఫార్మసిస్టులకు సరైన గుర్తింపు దక్కడం లేదు. అతి తక్కువ వేతనాలిచ్చి ఫార్మసిస్ట్‌తో పని చేయించుకోవడం, ఫార్మసిస్ట్‌కు సరైన ప్రమోషన్స్ లేకపోవడం వల్ల వారు ఆవేదనలో ఉన్నారు. పనిభారంతోనే విధులు నిర్వహిస్తున్నారు. 1985 సంవత్సరంలో జనాభా ప్రాతిపదికన ఫార్మసిస్టుల నియామకం చేస్తే మళ్లీ ఇంతవరకు దాన్ని విస్తరించలేదు. నాటి నుంచి నేటివరకు అన్ని రంగాల్లో మార్పులు రావడంతో పాటు జనాభా కూడా పెరిగింది. గత 30ఏండ్ల క్రితం ఉన్నట్టుగానే ఇప్పటివరకు ఒక్క ఫార్మసిస్టు చేతనే పని చేయించుకోవడం వారి శ్రమకు సరైన గుర్తింపునివ్వకపోవడమే అవుతుంది.

ఫార్మసిస్టులకు గత 35సంవత్సరాలుగా ప్రతీ పి.ఆర్.సిలో కూడా వేతనాలు తగ్గుతూ వస్తున్నవి. ఫార్మసిస్టు బ్రాంచ్ వన్ మెడికల్ పరిధిలోకి వస్తారు. కానీ ప్రభుత్వాలు పారామెడికల్ కింద చూస్తున్నాయి. ఫార్మసిస్టులకు రాష్ట్రస్థాయిలో సపరేటు డైరెక్టర్ ఏర్పాటు చేయాలి. ఇన్ సర్వీసు ఫార్మసిస్టులకు డ్రగ్ ఇన్‌స్పెక్టర్, డ్రగ్ అనలిస్ట్, డైటీషియన్ పోస్టులలో 30శాతం కోటా కేటాయించాలి. ఆర్‌బిఎస్‌కే, 104, యూ పిహెచ్‌సి, ఎన్‌హెచ్ఎం, ఇతర అన్ని స్కీమ్‌లు, ఇతర ఏజెన్సీల ద్వారా పనిచేస్తున్న ఫార్మసిస్టులు అందరికీ సుప్రీంకోర్టు ఆదేశానుసారం సమాన పనికి సమాన వేతనమివ్వాలి. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్‌లో పనిచేస్తున్న ఫార్మసిస్టులందరినీ వెంటనే రెగ్యులర్ చేయాలి. ప్రతి జిల్లా కార్యాలయంలో ఫార్మసీ సూపర్‌వైజర్ పోస్ట్, ఫార్మసిస్ట్ గ్రేడ్-2 పోస్టులు వెంటనే మంజూరు చేయాలి. అన్ని బస్తీ, పల్లె దవాఖానాలలో ఫార్మసిస్టులను నియమించి ఆరోగ్య భారతానికి పాలకులు కృషి చేయాలి.

నేడు "ప్రపంచ ఫార్మసిస్ట్ దినోత్సవం"

**- బత్తిని సుదర్శన్ గౌడ్, 9849086033**

---

# శ్రీలంకలో కమ్యూనిస్టు ప్రభుత్వం - ముందున్న సవాళ్లు!



**ఎం కోటేశ్వరరావు**
8331013288

శ్రీలంక నూతన అధ్యక్షుడిగా అనుర కుమార దిశన్నాయకే సోమవారం నాడు ప్రమాణస్వీకారం చేశారు. 1948లో బ్రిటన్ నుంచి స్వాతంత్ర్యం పొందిన లంకలో ఒక కమ్యూనిస్టు పాలనాబాధ్యతలు చేపట్టడం చరిత్రలో మరో అధ్యాయ ప్రారంభం. ఐదేండ్ల క్రితం నేషనల్ పీపుల్స్ పవర్(ఎన్‌పిపి) అభ్యర్థిగా కేవలం 3.16శాతం ఓట్లు తెచ్చుకున్న వామపక్ష నేత 42.3శాతం ఓట్లతో ప్రథమ స్థానంలో నిలవటం, రెండవ ప్రాధాన్యతా ఓట్లలెక్కింపులో 55.89శాతం ఓట్లతో విజయం సాధించటం చిన్న విషయమేమీ కాదు. సోవియట్ యూనియన్, తూర్పు ఐరోపా సోషలిస్టు రాజ్యాల పతనం తరువాత ప్రపంచంలో కమ్యూనిస్టులకు ఎదురుగాలి వీచిందన్నది వాస్తవం. కమ్యూనిస్టులపై ప్రచ్ఛన్న యుద్ధంలో విజేతలం తామే అని ప్రకటించుకున్న వారి కలలు కల్లలే అని తరువాత జరుగుతున్న పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. వాటిలో తాజాగా శ్రీలంక చరిత్రకెక్కింది. అనేక దేశాలలో కమ్యూనిస్టు పార్టీలు పేర్లు మార్చుకున్నాయి, కొన్ని చోట్ల దుకాణాలను మూసివేసి వేరే పార్టీల్లో చేరిపోయారు. వీటన్నింటిని చూసి అనేక మంది ఇంకేముంది కమ్యూనిస్టులు, వామపక్ష శక్తులపని అయిపోయింది, తిరిగి కోలుకునే అవకాశం లేదంటూ నిస్తేజంగా ఉన్న వారిని శ్రీలంకలో అరుణోదయం మేల్కొలిపింది.

తాజా ఎన్నికలలో ఎన్‌పిపి అభ్యర్థి తొలిరౌండ్‌లో 42.3శాతం ఓట్లతో ప్రథమ స్థానంలో, ప్రస్తుత ప్రతిపక్ష పార్టీ ఎస్ఎల్‌బి అభ్యర్థి సాజిత్ ప్రేమదాస 32.76శాతం, ప్రస్తుత అధ్యక్షుడు రానిల్ విక్రమ సింఘే 17.27శాతం ఓట్లతో మూడవ స్థానంలో ఉన్నారు. మిగిలిన ఓట్లను 35 మంది ఇతర అభ్యర్థులు తెచ్చుకున్నారు. అక్కడి విధానం ప్రకారం ప్రతి ఓటరూ ముగ్గురికి ప్రాధాన్యతా క్రమంలో ఓటు వేయవచ్చు. సగానికిపైగా ఓట్లు తెచ్చుకున్నవారినే విజేతగా ప్రకటిస్తారు. అలా రాని పక్షంలో మొదటి ఇద్దరిని మినహాయించి మిగిలిన వారిని పోటీ నుంచి తొలగిస్తారు. వారికి వచ్చిన ఓట్లలో రెండవ ప్రాధాన్యతా ఓట్లు ఎవరికి వేశారో వారికి కలిపి 50శాతంపైగా తెచ్చుకున్నవారిని విజేతగా నిర్ధారిస్తారు. ఆ ప్రకారం వామపక్ష నేతకు 55.89 శాతం రావటంతో ఎన్నికైనట్లు ప్రకటించారు. శ్రీలంక నూతన రాజ్యాంగం ప్రకారం 1982 తరువాత జరిగిన ఎన్నికలన్నింటిలో గెలిచిన వారందరూ మొదటి రౌండులోనే గెలిచారు. తొలిసారిగా ఈ దఫా రెండవ ప్రాధాన్యత ఓటును పరిగణనలోకి తీసుకొని విజేతను నిర్ణయించారు.

ప్రపంచం నిరంతరం మారుతూ ఉంటున్నపుడు ప్రతిదీ మార్పుకు గురవుతుందన్నది నమ్మకం కాదు, ఒక శాస్త్రీయ భౌతిక వాస్తవం. ఎక్కడైతే కమ్యూనిజం విఫలమైందని విజయగీతాలాపన చేశారో అదే అమెరికాలో, ఇతర అలాంటి దేశాల్లో ఇప్పుడు పెట్టుబడిదారీ విధానం విఫలమైందని వినిపిస్తోంది. అందుకే ప్రత్యామ్నాయంగా సోషలిజం గురించి ఆసక్తి వ్యక్తమౌతున్నది. కమ్యూనిజం అంటేనే ఏదో జబ్బు మాదిరిగా చూసిన అమెరికాలో ఇప్పుడు కోట్లాది మంది యువత 'మేం సోషలిస్టులం' అని సగర్వంగా చెప్పుకొనే పరిస్థితి ఉంది. అనేక భావజాలాలు కలిగిన వారందరికీ అవకాశం ఇచ్చిన జనం తగిన సమయం వచ్చినపుడు వామపక్ష శక్తులకు మాత్రం ఎందుకివ్వరు? అంటూ అనేక మంది తగిలిన ఎదురుదెబ్బలను తట్టుకొని అరుణపతాకను అలాగే సమున్నతంగా ఎగరేస్తూ అచంచెల విశ్వాసంతో అనేక మంది ఉన్నారు. అలాంటి వామపక్ష శక్తులు లంకలో జన సమ్మతిని పొందాయి. అనేక రకాలుగా విష ప్రచారం చేస్తున్నప్పటికీ లాటిన్ అమెరికా దేశాల్లో అనేక చోట్ల వామపక్ష శక్తుల మీద జనం విశ్వాసం ఉంచారు. దక్షిణాఫ్రికా అధికార కూటమిలో కమ్యూనిస్టులు ఒక ప్రముఖ పాత్ర పోషిస్తున్నారు. నేపాల్‌లో తిరుగులేని శక్తిగా వామపక్షాల ఉన్నాయి. ఇప్పుడు వాటి సరసన శ్రీలంక చేరింది. దాని గురించి



ఇరుగుపొరుగు దేశాలన్నింటా ముఖ్యంగా మనదేశంలో దీని గురించి చర్చ జరగటం అనివార్యం.

తప్పుడు విధానాలు అనుసరించి శ్రీలంకను దివాలా తీయించిన పాలకులను రెండేండ్ల క్రితం లంకేయులు తరిమికొట్టారు. ఆ పరిణామాల గురించి ఎంతో చర్చ జరిగింది. అలాంటి చోట కమ్యూనిస్టులను ఎలా ఎన్నుకున్నారబ్బా అని అదేమాదిరి జనం ఇప్పుడు ఆలోచిస్తారు. అలాంటి మధనం మనదేశంతో సహా ప్రజావ్యతిరేక విధానాలను అనుసరిస్తున్న ప్రతిదేశ పాలకుల్లో వణుకు పుట్టించటం అనివార్యం. మార్క్సిజం-లెనినిజం ఒక శాస్త్రీయ సిద్ధాంతం. దాన్ని అన్ని చోట్లా రూళ్ల కర్రలా ఒకే మాదిరి వర్తింపచేయాలని చూసిన కొన్ని పార్టీలకు ఎదురుదెబ్బలు తగిలాయి. ప్రతిదేశ విప్లవం తనదైన పద్ధతిలో ఉంటుంది తప్ప ఏదో ఒకనమూనాలో జరగదు. చైనా మార్గంలోనో రష్యా మాదిరో వస్తుందని భావించిన వారు దుందుడుకు, మితవాద చర్యలకు పాల్పడటంతో అనేక చోట్ల ఉద్యమం దెబ్బతిన్నది. అలాంటి దేశాలలో శ్రీలంక ఒకటి. యూనిఫాం అంటే ఏకరూపం ఉండాలి తప్ప అందరికీ ఒకే కొలతలని కాదు. అలాగే మార్క్సిస్టు శాస్త్రీయ సిద్ధాంతాన్ని కమ్యూనిస్టు పార్టీలు తమ దేశాలు, పరిస్థితులకు అన్వయించు కోవాల్సి ఉంది. ఆ అవగాహనపై వచ్చిన తేడాలే పలు కమ్యూ నిస్టు, వామపక్ష పార్టీల ఏర్పాటుకు దారితీశాయి. అలాంటిదే శ్రీలంకలో జనతా విముక్తి పెరుమన(సంఘటన). దానితో పాటు మరో 27 వామపక్ష పార్టీలు, సంస్థలు, ప్రజాసంఘాలు కలసి నేషనల్ పీపుల్స్ పవర్ (ఎన్‌పిపి) పేరుతో ఒక కూటమిగా పోటీ చేశాయి.

ఏడున్నర దశాబ్దాలుగా వివిధ పార్టీలను చూసిన జనం వాటి మీద విశ్వాసం కోల్పోయి వామపక్ష అభ్యర్థికి ఓట్లు వేశారు. గతంలో తుపాకి చేతపట్టి విప్లవాన్ని తీసుకువచ్చేందుకు రెండుసార్లు జనతా విముక్తి పెరుమున విఫలయత్నం చేసింది. ఇప్పుడు బాలట్‌ద్వారా అధికారాన్ని పొందింది. తాజా విజయం దాని చరిత్రలో ఒక ప్రధాన మలుపు. శ్రీలంకలో కమ్యూనిస్టు ఉద్యమ తీరుతెన్నులను క్లుప్తంగా చెప్పాలంటే.. బ్రిటీష్ పాలనా కాలంలో 1935లో తొలి వామపక్ష లంక సమ సమాజ పార్టీ(ఎల్ఎస్ఎస్‌పి) ఏర్పడింది. 1943లో దీని నుంచి విడివడిన వారు శ్రీలంక కమ్యూనిస్టు పార్టీ(సిపిఎస్ఎల్)గా ఏర్పడ్డారు. అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో వచ్చిన సైద్ధాంతిక సమస్యల కారణంగా 1960దశకంలో సోవియట్, చైనా మార్గాలను అనుసరించే పార్టీలుగా విడిపోయాయి. సోవియట్‌ను అనుసరించే పార్టీ, ఎల్ఎస్ఎస్‌పి రెండూ 1964లో సిరిమావో బండారు నాయకే మంత్రివర్గంలో చేరాయి. తరువాత వాటి బలం క్రమంగా క్షీణించింది.చైనా మార్గాన్ని అనుసరిస్తున్నట్లు చెప్పుకున్న పార్టీలో తరువాత సైద్ధాంతిక విబేధాలు తలెత్తటంతో కొంత మంది కొత్త పార్టీ ఏర్పాటుకు పూనుకున్నారు. ఆక్రమంలో ఉద్భవించిందే జనతా విముక్తి పెరుమన(జెవిపి). అది పార్టీ రూపం సంతరించుకోక ముందే (మన దేశంలో నక్సల్స్ మాదిరి) విద్యార్థులు, కార్మికులు, ఇతర తరగతుల్లో పనిచేయటం ప్రారంభించింది. 1970 మే నెలలో లంక ఫ్రీడమ్ పార్టీ అధికారంలోకి వచ్చింది, దానిలో కమ్యూనిస్టు పార్టీ భాగస్వామిగా ఉంది. అదే నెల 12న తరువాత కాలంలో జెవిపి నేతగా ఎన్నికైన రోహన్ విజెవీర అరెస్టయ్యాడు. వీరి కార్యకలాపాలను నాటి ప్రభుత్వం చేగువేరా ఉద్యమంగా వర్ణించి అణచివేసేందుకు పూనుకుంది. జూలై 9న విజెవీర విడుదలయ్యాడు. ఆగస్టు పదిన కొలంబోలో నిర్వహించిన తొలి ప్రదర్శన సభలో జెవిపి ఏర్పాటును ప్రకటించారు.

6 మార్చి1971లో అధికారంలో ఉన్న పార్టీల కొందరు మద్దతుదారులు వియత్నాంలో అమెరికా జరుపుతున్న యుద్ధానికి వ్యతిరేకంగా అమెరికా రాయబార కార్యాలయం ముందు ప్రదర్శన నిర్వహించారు. ఆ సందర్భంగా ప్రదర్శకులలో ఒకడు రాయబార కార్యాలయ ప్రాంగణంలోకి ఒక పెట్రోలు బాంబు విసిరాడు. వెంటనే దేశంలో అత్యవసర పరిస్థితి విధించారు. ఈ ఉదంతం వెనుక జెవిపి ఉందంటూ ఆ పార్టీ నేత విజెవీరను పదమూడో తేదీన అరెస్టు చేశారు. తరువాత మరో ఐదువందల మందిని అరెస్టు చేసి వివిధ జైళ్లలో నిర్బంధించారు. ఏప్రిల్ ఒకటవ తేదీన జెవిపి నాయకత్వం సమావేశమై ఆత్మరక్షణ కోసం ఆయుధాలు పట్టాలని నిర్ణయించింది. ఏప్రిల్ ఐదున దాదాపు వంద పోలీస్‌స్టేషన్ల మీద దాడులు చేసింది. అయితే ఒక నెలలోనే ప్రభుత్వం తిరుగుబాటును అణచివేసింది. దాదాపు పదివేల మంది జెవిపి సభ్యులు, మద్దతుదార్లను చంపివేసినట్లు తేలింది. మరో ఇరవైవేల మందిని అరెస్టు చేసింది. అణచివేత చర్యలకు 14దేశాలు మద్దతు తెలిపాయని, భారత్ తన వైమానికదళ పైలట్లు, మిగ్ విమానాలను పంపినట్లు జెవిపి ప్రకటించింది. నిషేధాన్ని ఎత్తివేసిన తరువాత 1976లో చట్టబద్ద రాజకీయ పార్టీగా బహిరంగ కార్యకలాపాలను ప్రారంభించింది.1978లో తొలి జాతీయ మహాసభ నిర్వహించింది.తరువాత ఎన్నికల్లో పాల్గొన్నది.1987లో శ్రీలంక-భారత్ మధ్య కుదిరిన ఒప్పందాన్ని జెవిపి వ్యతిరేకించింది.లంక సార్వభౌమత్వాన్ని రక్షించాలంటూ మరోసారి పెద్ద ఎత్తున సాయుధ పోరాటానికి దిగింది.ఈ పోరులో

> **తప్పుడు విధానాలు అనుసరించి శ్రీలంకను దివాలా తీయించిన పాలకులను రెండేండ్ల క్రితం లంకేయులు తరిమికొట్టారు. ఆ పరిణామాల గురించి ఎంతో చర్చ జరిగింది. అలాంటి చోట కమ్యూనిస్టులను ఎలా ఎన్నుకున్నారబ్బా అని అదేమాదిరి జనం ఇప్పుడు ఆలోచిస్తారు. అలాంటి మధనం మనదేశంతో సహా ప్రజావ్యతిరేక విధానాలను అనుసరిస్తున్న ప్రతిదేశ పాలకుల్లో వణుకు పుట్టించటం అనివార్యం. మార్క్సిజం-లెనినిజం ఒక శాస్త్రీయ సిద్ధాంతం. దాన్ని అన్ని చోట్లా రూళ్ల కర్రలా ఒకే మాదిరి వర్తింపచేయా లని చూసిన కొన్ని పార్టీలకు ఎదురుదెబ్బలు తగిలాయి. ప్రతిదేశ విప్లవం తనదైన పద్ధతిలో ఉంటుంది తప్ప ఏదో ఒకనమూనాలో జరగదు. చైనా మార్గంలోనో రష్యా మాదిరో వస్తుందని భావించిన వారు దుందుడుకు, మితవాద చర్యలకు పాల్పడటంతో అనేక చోట్ల ఉద్యమం దెబ్బతిన్నది. అలాంటి దేశాలలో శ్రీలంక ఒకటి.**

దాదాపు 60వేల మంది మరణించారు. జెవిపి కేంద్ర నాయకత్వంలో ఒకరు తప్ప మిగతావారందరినీ అరెస్టు లేదా చంపివేయటమో జరిగింది. తప్పించుకున్న పొలిట్‌బ్యూరో సభ్యుడు అమరసింఘ విదేశాల్లో తలదాచుకొని రహస్యంగా పార్టీ నిర్మాణానికి కృషి చేశాడు. మరోసారి చట్టబద్ద పార్టీగా ముందుకు వచ్చి 1994 ఎన్నికల్లో పోటీచేసింది. మరుసటి ఏడాది మహాసభ జరిపి కొత్త కేంద్ర కమిటీని ఎన్నుకుంది.2004లో కేంద్ర ప్రభుత్వంలో భాగస్వామిగా చేరింది.కొంతకాలం తరువాత బయటకు వచ్చింది.1968లో జన్మించిన అనుర కుమార దిశన్నాయకే విద్యార్థి దశలోనే జెవిపి కార్యకలాపాల్లో పాల్గొన్నారు. 1987 తిరుగుబాటు సమయంలో విశ్వవిద్యాలయ విద్యార్థిగా ఉన్నారు. తరువాత 1995లో పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడిగా ఎన్నికయ్యాడు.2000 సంవత్సరం నుంచి ఎంపీగా కొనసాగుతున్నారు. 2004లో చంద్రికా కుమారతుంగ ప్రభుత్వంలో వ్యవసాయశాఖ మంత్రిగా పనిచేశారు. ఉగ్రవాద సంస్థ ఎల్‌టిటిఇని వ్యతిరేకించిన కారణంగా కొంత మంది జెవిపిని తమిళ వ్యతిరేక పార్టీగా, సింహళజాతీయవాద పార్టీగా ఆరోపిస్తారు.

అధ్యక్షపదవిలో కొలువు దీరిన వామపక్ష కూటమి పార్లమెంటులో కూడా ఆధిక్యతను సంపాదించాల్సి ఉంది. లాటిన్ అమెరికాలో అధికారానికి వచ్చిన వామపక్షాలు అధ్యక్ష, ప్రధాని పదవులు పొందుతున్నప్పటికీ పార్లమెంట్లలో మెజారిటీ తెచ్చుకోలేని కారణంగా అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. అంతకు ముందున్న వ్యవస్థపునాదుల మీదనే అవి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నాయి. అయితే వాటికి ఉన్న పరిమితుల కారణంగా కొన్ని చోట్ల ఎన్నికల్లో ఎదురుదెబ్బలు కూడా తగిలాయి. వాటి నుంచి లంక వామపక్ష ఎన్‌పిపి తగిన పాఠాలు తీసుకోవాలి.2022లో అధికారానికి వచ్చిన ప్రభుత్వం ఐఎంఎఫ్, ఇతర అంతర్జాతీయ సంస్థల షరతులన్నింటికీ తలవూపి రుణాలు తీసుకుంది. దాని వలన పౌరసంక్షేమానికి నిధుల కోత ఒకటైతే భారాలు మరొకటి. ఐఎంఎఫ్ ఒప్పందాల నుంచి తక్షణమే వైదొలిగితే మరోసారి లంక చెల్లింపులతో పాటు ఇతర ఆర్థిక సమస్యలను ఎదుర్కొంటుంది. దాని షరతుల నుంచి ఉపశమనం కలిగించకపోతే జనంలో అసంతృప్తి తలెత్తటం అనివార్యం. ఈ పరిస్థితిని వామపక్ష ప్రభుత్వం ఎలా ఎదుర్కొంటుందనేది ఆసక్తికరంగా మారింది. మనదేశంలో బీజేపీ రెండు సీట్ల నుంచి మూడువందలకు పైగా సీట్లతో అధికారం పొందామని గర్వంగా, ఘనతగా చెప్పుకుంటున్నది. దానికి ఆ పార్టీకి మూడు దశాబ్దాలు పట్టింది, జెవిపి ఐదేండ్లలోనే అలాంటి అధికారాన్ని పొందింది. రాజకీయాల్లో బండ్లు ఓడలు, ఓడలు బండ్లవుతాయి.సింహళ హృదయ సామ్రాట్టులుగా పేరు తెచ్చుకున్న రాజపక్సే సోదరులు 2019 ఎన్నికల్లో 52.25శాతం ఓట్లు తెచ్చుకున్నారు. వారిని 2022లో జనం ఇండ్ల నుంచి తరిమికొట్టారు. తాజా ఎన్నికల్లో ఆ పార్టీకి వచ్చిన ఓట్లు కేవలం 2.57శాతమే. అందువలన జనానికి దూరమైతే ఎవరికైనా ఇదే గతి అని లంక జనాలు చెప్పారు. మన దేశంలోని పార్టీలు దీన్ని గుణపాఠంగా తీసుకుంటాయా?


> **మనదేశంలో బీజేపీ రెండు సీట్ల నుంచి మూడువందలకు పైగా సీట్లతో అధికారం పొందామని గర్వంగా, ఘనతగా చెప్పుకుంటున్నది. దానికి ఆ పార్టీకి మూడు దశాబ్దాలు పట్టింది, జెవిపి ఐదేండ్లలోనే అలాంటి అధికారాన్ని పొందింది. రాజకీయాల్లో బండ్లు ఓడలు, ఓడలు బండ్లవుతాయి.సింహళ హృదయ సామ్రాట్టులుగా పేరు తెచ్చుకున్న రాజపక్సే సోదరులు 2019 ఎన్నికల్లో 52.25శాతం ఓట్లు తెచ్చుకున్నారు. వారిని 2022లో జనం ఇండ్ల నుంచి తరిమికొట్టారు. తాజా ఎన్నికల్లో ఆ పార్టీకి వచ్చిన ఓట్లు కేవలం 2.57శాతమే. అందువలన జనానికి దూరమైతే ఎవరికైనా ఇదే గతి అని లంక జనాలు చెప్పారు. మన దేశంలోని పార్టీలు దీన్ని గుణపాఠంగా తీసుకుంటాయా?**

---

# భావితరానికి ఆదర్శం...ఏచూరి జీవితం



**ఎస్.పుణ్యవతి**



ఎమర్జెన్సీ ఎత్తివేశాక 1977లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యా విధానంపై ఒక జాతీయ సదస్సు న్యూఢిల్లీలో జరిగింది. ఆ సదస్సుకి మన రాష్ట్రం నుండి అనేకమంది విద్యార్థులతో పాటు నేను కూడా హాజరయ్యాను. అప్పుడే కామ్రేడ్ సీతారాంని చూశాను. ముఖ పరిచయం మాత్రమే. అప్పటికే జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీలో వామపక్ష విద్యార్థి ఉద్యమం, ఎస్ఎఫ్ఐ బలంగా ఉన్నాయి. ప్రకాశ్ కరత్, సీతారాం ఏచూరి, సోహైల్ హష్మి (సఫ్దర్ హష్మీ సోదరుడు) వంటి కేంద్ర నాయకులతో పాటు ఎంతోమంది జవహర్ లాల్ నెహ్రూ యూనివర్సిటీ, ఢిల్లీ యూనివర్సిటీ విద్యార్థులు ఈ సదస్సు నిర్వహణలో ప్రధాన పాత్ర తీసుకున్నారు. ఇంద్రాణి మజుందార్, అశోక్ లతా జైన్, శక్తి కాక్ వంటి నేతలను నేను అప్పుడే కలుసుకున్నాను. ఆ తరువాత కాలంలో కాసీతారాం ఏచూరి ఇంద్రాణి మజుందార్‌లు, మనందరికీ పరిచితమైన ప్రబీర్ పురకాయస్థ, అశోక్ లతా జైన్‌లు భార్యాభర్తలు కావడం, ఉద్యమంలో కొనసాగటం యాదృచ్ఛికం కాదు ఆ కాలంలో విద్యార్థి ఉద్యమంతో మమేకమైన అనేక మంది ఆ తదనంతర కాలంలో అభ్యుదయ భావాల ప్రచారం లో వారి మేధా శక్తిని ఉపయోగించారు. మూఢ నమ్మకాలతో కూరుకు పోతున్న దశలో దేశాన్ని శాస్త్రీయ భావాల వైపు నడిపించడంలో గాని, ప్రభు త్వం ప్రజల పక్షాన నిలబడే విధాన నిర్ణయాలు చేయడంలో గాని అప్పటి విద్యార్థి ఉద్యమంలో పని చేసిన మేధావుల పాత్ర అమోఘం. సీతారాం, ప్రకాశ్ కరత్ వంటి నేతలు కొంతమంది ప్రత్యక్షంగా పలు ఉద్యమాల నిర్వహణలో ఉన్నారు.

పాట్నాలో 1979లో జరిగిన ఎస్ఎఫ్ఐ మహాసభకు నేను, రమాదేవి ప్రతినిధులుగా హాజరయ్యాం. విద్యార్థినుల సమస్యలపై ఆ మహాసభలోనే తీర్మానం పెట్టారు. ఆ తీర్మానాన్ని అచ్చువేసి మన రాష్ట్రంలో అనేక విద్యాసంస్థల్లో పంచాం. ఆ తీర్మానం ఒక దిక్సూచి. ఆడపిల్లల సమస్యల్ని ముఖ్యంగా పేద కుటుంబాల నుంచి వచ్చిన ఆడపిల్లలు ఎట్లా విద్యకు దూరమవు తున్నారో ప్రభుత్వాలు ఏం చేయాలో చెప్పింది. ఈ తీర్మానం అనేక కోణాల్లో స్త్రీల అణిచివేత సమస్యను ఎత్తి చూపించింది. ఇది 46 ఏండ్ల కిందట విద్యార్థి ఉద్యమానికి ఉన్న దూరదృష్టికి నిదర్శనం. విద్యార్థులుగా ఉన్న అప్పటి నాయకుల ఉన్నతమైన ఆలోచనలకు ఇది నిదర్శనం. ఇందులో సీతారాం పాత్ర, ఇంద్రాణి మజుందార్, అశోక్ లతా జైన్ వంటి వారి పాత్ర నేను ప్రత్యక్షంగా చూశాను.సీతారాం వామపక్ష తాత్విక చింతనకు మూలం ఆయన కుటుంబంలో కూడా ఉన్నదనుకుంటాను. బయట సాగుతున్న ఉద్యమాల ప్రభావం ఒకటైతే, కుటుంబ తాత్విక ఆలోచనలు కూడా వ్యక్తిని ప్రభావితం చేస్తాయేమో అనిపిస్తుంది. సీతారాం అమ్మమ్మ కంద పాపాయమ్మ. ఆమె తెలుగు వారందరికీ చిరపరిచిత మైన దుర్గాబాయి దేశ్‌ముఖ్ సహచరి. దుర్గాబాయి దేశ్ ముఖ్ ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధురాలు. మద్రాసులోనూ, హైదరాబాద్‌లోనూ, అట్లాగే ఢిల్లీలోని ఆంధ్ర ఎడ్యుకేషన్ సొసైటీ నిర్మాణంలోనూ ఆమెది ప్రధాన పాత్ర. అప్పట్లో కేంద్ర క్యాబినెట్ మంత్రిగా పనిచేశారు. సీతారాం తల్లి కల్పకం కూడా చిన్న వయసులో దేశ స్వాతంత్ర్యం కోసం బాల సంఘాల్లో పనిచేశారు. ఢిల్లీకి మకాం మార్చిన తర్వాత ఆంధ్ర ఎడ్యుకేషన్ సొసైటీని అభివృద్ధి చేయడంలో ప్రధానమైన పాత్ర తీసుకున్నారు. ఆ విధంగా వ్యక్తి స్వార్థం కోసం లేదా కులపరమైన, మతపరమైన మూర్ఖత్వంలో మునిగిపోవడం కాకుండా దేశం కోసం, దేశాన్ని అభ్యుదయంగా నడపడం కోసం ఆయన ఆలోచనలు మళ్లించటానికి అమ్మ అమ్మమ్మల పరోక్ష ప్రేరణ కూడా ఉపయోగపడిందేమో!

కొంతమంది సీతారాం గురించి, ఆయన ఆస్తుల గురించి రోత పుట్టే రాతలు, మాటలు మాట్లాడుతున్నారు. కానీ ఆయన జీవితం ఎంతమందికి తెలుసు? సీతారాం దీర్ఘకాలం విఠల్ భారు పటేల్ హౌస్‌లోని సింగిల్ బెడ్ రూమ్ క్వార్టర్‌లో ఉన్నారు. భార్యాభర్తలు ఇద్దరు ఉద్యమంలో మునిగి వున్నప్పుడు పిల్లల పరిస్థితి ఎంత మందికి అర్థమవుతుంది? ఇంద్రాణి ఉదయం వెళ్లి ఏ సాయంత్రానికో వస్తే ఆవురావురుమంటూ ఉండే పిల్లల ఆలనా పాలన చూసేది ఎవరనేది సమస్య. ఆ క్వార్టర్స్‌లోనే పోస్టల్ యూనియన్ నాయకులు కామ్రేడ్ ఆదినారాయణ కుటుంబం ఉండేది. ఆ ఇంటి పక్కనే పిల్లలందరికీ ఒక చిన్న క్రెచ్ ఏర్పాటు చేశారు. పిల్లల్ని క్రెచ్‌లో వదిలి వెళ్ళేవాళ్ళు. అప్పుడప్పుడు ఆదినారాయణ గారి ఇంటికెళ్లి 'అమ్మమ్మా ఆకలేస్తోంది..' అని కరోనా కాలంలో చనిపోయిన సీతారాం కొడుకు ఆశిష్ అడిగేవాడట. పిల్లల ఆలనా పాలనా, అచ్చట ముచ్చట, ఆరోగ్యాలు ఎవరూ సంపాదించి

> **సీతారాం దీర్ఘకాలం విఠల్ భారు పటేల్ హౌస్‌లోని సింగిల్ బెడ్ రూమ్ క్వార్టర్‌లో ఉన్నారు. భార్యాభర్తలు ఇద్దరు ఉద్యమంలో మునిగి వున్నప్పుడు పిల్లల పరిస్థితి ఎంత మందికి అర్థమవుతుంది? ఇంద్రాణి ఉదయం వెళ్లి ఏ సాయంత్రానికో వస్తే ఆవురావురుమంటూ ఉండే పిల్లల ఆలనా పాలన చూసేది ఎవరనేది సమస్య. ఆ క్వార్టర్స్‌లోనే పోస్టల్ యూనియన్ నాయకులు కామ్రేడ్ ఆదినారాయణ కుటుంబం ఉండేది. ఆ ఇంటి పక్కనే పిల్లలందరికీ ఒక చిన్న క్రెచ్ ఏర్పాటు చేశారు. పిల్లల్ని క్రెచ్‌లో వదిలి వెళ్ళేవాళ్ళు. అప్పుడప్పుడు ఆదినారాయణ గారి ఇంటికెళ్లి 'అమ్మమ్మా ఆకలేస్తోంది..' అని కరోనా కాలంలో చనిపోయిన సీతారాం కొడుకు ఆశిష్ అడిగేవాడట. పిల్లల ఆలనా పాలనా, అచ్చట ముచ్చట, ఆరోగ్యాలు ఎవరూ సంపాదించి పెట్టలేరు.**

పెట్టలేరు. ఇంకో విధంగా మాట్లాడే వాళ్ళు కూడా ఉన్నారు. సీతారాం రాజకీయాల్లోకి రాకుండా ఉండి ఉన్నట్టయితే బహుశా ప్రపంచ బ్యాంకు అధిపతి అయ్యేవాడేమో అని. కానీ ఈ దేశప్రజలు, ముఖ్యంగా యువత అర్థం చేసుకోవాల్సింది ఒక్కటే. 'ఒక్కరోజైనా, ఒక్కసారైనా కమ్యూనిస్టుగా బతుకు నేస్తమా. ఆ బతుకు విలువ తెలుస్తుంది మిత్రమా' అని. ఆ బతుకు విలువ తెలిసిన, తెలిపిన కమ్యూనిస్టు, మార్క్సిస్టు మేధావి సీతారాం ఏచూరి. అదే ప్రజలకు యువతరానికి, భావితరానికి ఆదర్శం. దోపిడీ వర్గాలకు ఊడిగం చేయటమా? దేశ ప్రజలకు సేవ చేయడమా? ఏది మన దారి? సీతారాం జీవితం నుండి నేర్చుకోవాల్సిన పాఠం ఇది.

## నేడు జనరిక్, జనరల్ మందుల షాపు ప్రారంభం

**నవతెలంగాణ-ఖమ్మం**

వివిసి, బివికె ట్రస్ట్ ఆధ్వర్యంలో వైరా రోడ్ డాక్టర్ సత్యనారాయణ మూర్తి కాంప్లెక్స్‌లో (పాత ఎల్ఐసి ఆఫీస్ ఎదురుగా) బుధవారం ఉదయం 10 గంటలకు జనరల్, జనరిక్ మందుల షాప్‌ను ప్రారంభిస్తున్నట్లు వివిసి, బివికె ట్రస్ట్ నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం నగరంలో గత 7 సంవత్సరాలుగా మంచికంటి పంక్షన్‌హాల్‌లో ఉచిత బిపి, షుగర్, పక్షవాతం మెడికల్ క్యాంపు నడుస్తున్న విషయం విదితమే అని, ఈ నేపథ్యంలో ప్రజలకు మరింతగా సేవలు కొనసాగించడం కోసం అన్ని రకాల మందులు సరసమైన ధరలకు అందించడానికి వివిసి, బివికె ట్రస్ట్‌లు నిర్ణయించారని తెలిపారు. ముఖ్య అతిథులుగా వివిసి ట్రస్ట్ ఛైర్మన్ వంకాయలపాటి రాజేంద్రప్రసాద్ (రాజా), మాజీ ఎంఎల్ఏ, హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రం కోశాధికారి నంద్యాల నర్సింహా రెడ్డి, వివిసి ట్రస్ట్ అధినేత వంకాయలపాటి ద్రౌపది, బివికె ట్రస్ట్ కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు హాజరవుతారని తెలిపారు.



## ప్రజా సమస్యలపై పోరు

**- సీపీఐ(ఎం) మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం**

**నవతెలంగాణ-ముదిగొండ**

ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం పిలుపునిచ్చారు. పార్టీ గ్రామశాఖల మహాసభల్లో భాగంగా మండల పరిధిలోని కట్టకూరు గ్రామంలో మంగళవారం గ్రామ శాఖ మహాసభ పార్టీ నాయకులు చెన్ను అంజయ్య అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు.ఈ మహాసభలో ఆయన మ్టాట్లడుతూ పార్టీ పురోభివృద్ధికి ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. రానున్న పంచాయతీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం పాటుపడాలన్నారు. ఏచూరి ఆశయ సాధనకు పునరంకితం కావాలన్నారు. అనంతరం సిపిఐ(ఎం) గ్రామ శాఖ కార్యదర్శిగా తిరిగి రెండవసారి చెన్ను నాగరాజును ఎన్నుకున్నారు. తొలిత పార్టీ గ్రామ సీనియర్ నాయకులు నారాయణ ఎర్రజెండాను ఎగరవేశారు. గ్రామ అమరవీరుల చిత్రపటాలకు పుష్పగుచ్చాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) మండల నాయకులు మందరపు వెంకన్న, రాయల శ్రీనివాసరావు, వేల్పుల భద్రయ్య, గ్రామ నాయకులు పి.నాగరాజు, కందుల కోదండరామ్, ఎర్రబోయిన వెంకటేశ్వర్లు, వడ్లమూడి యుగంధర్, ఎలక ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## స్కేటింగ్‌లో సత్తా చాటిన సర్వజ్ఞ విద్యార్థిని

**నవతెలంగాణ- ఖమ్మం**




ఖమ్మంలో ఈ నెల 22న సర్దార్ పటేల్ స్టేడియంలో స్కేటింగ్ అసోసియేషన్ వారు నిర్వహించిన జిల్లా స్థాయి పోటీలలో సర్వజ్ఞ విద్యార్థిని ఏ.నివేదిత సోషిని పాల్గొని సిల్వర్, బ్రాంజ్ పతకాలను గెలుచుకున్నది. సర్వజ్ఞ పాఠశాల డైరెక్టర్స్ ఆర్వీ. నాగేంద్ర కుమార్, నీలిమాలు ఆ విద్యార్థినిని మంగళవారం అభినందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా నలుమూలల నుంచి వచ్చిన పోటీదారులతో పోటీపడి సర్వజ్ఞ విద్యార్థిని అత్యుత్తమ పురస్కారాన్ని కైవసం చేసుకున్నదని, సర్వజ్ఞ పాఠశాల విద్యార్థులు ఈ రంగంలోనేగాక చెస్, టేబుల్ టెన్నిస్, స్కేటింగ్, ఒలింపియాడ్ పోటీలలో గొప్ప ప్రతిభను కనబరచి తమ సర్వజ్ఞ విద్యాసంస్థ గౌరవాన్ని పెంపొందించారని, ఇలాంటి కళలను ప్రోత్సహించడంలో సర్వజ్ఞ ఎప్పుడు ముందంజలో ఉంటుందని, కేవలం చదువుకే పరిమితం కాకుండా అన్ని రంగాలలో సర్వజ్ఞ విద్యార్థులు వారి ప్రతిభను కనబరచాలని, అందుకు తగిన ప్రోత్సాహాన్ని అందిస్తూ విద్యార్థుల పురోగతికి పాఠశాల యాజమాన్యం ఎప్పుడు తోడుగా ఉంటుందని తెలిపారు. తమ పాఠశాల విద్యార్థిని ఇంత అద్భుతమైన ప్రతిభను కనబరిచినందుకు తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. సర్వజ్ఞ పాఠశాల ఖమ్మం వీడిఓస్ కాలనీలో అత్యంత సౌకర్యంతో, ఎంతో అనుభవం కలిగిన అధ్యాపకులతో పరిమిత విద్యార్థులకు ఉన్నత విలువలతో కూడిన విద్యను అందిస్తూ అన్నింటా సర్వజ్ఞ తనకు తానే సాటి అని నిరూపించుకుంటుందని, ఈ సందర్భంగా డైరెక్టర్స్ ఆర్వీ. నాగేంద్ర కుమార్, నీలిమా తెలిపారు. మున్ముందు మరెన్నో విజయాలను సాధించాలని నివేదితని ఆశీర్వదించారు.



## సాగర్ ఎడమ కాల్వ పనులను పరిశీలించిన మంత్రి ఉత్తమ్

**నవతెలంగాణ -కూసుమంచి**

ఈనెల 1వ తేదీన నాగార్జున సాగర్ ఎడమ కాలువకు మండలంలోని రంగుల బ్రిడ్జి వద్ద గండిపడిన విషయం తెలిసిందే. కాగా మంగళవారం రాష్ట్ర నీటిపారుల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి కోదాడ ఎమ్మెల్యే పద్మారెడ్డితో కలిసి అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు. సంబంధిత అధికారులను పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఖమ్మం జిల్లా, సూర్యాపేట జిల్లా నీటిపారుదల శాఖ అధికారులు పాల్గొన్నారు.




## 'క్రాంతి'లో జాతీయ సేవా వ్యవస్థాపక దినోత్సవం

**నవతెలంగాణ-వైరాటౌన్**

స్థానిక క్రాంతి జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో జాతీయ సేవ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యాసంస్థల ఛైర్మన్ వాసిరెడ్డి సునీత స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ స్వామి వివేకానంద స్ఫూర్తితో విద్యార్థులు నిజ జీవితంలో సేవా తత్పరత పెంచుకోవాలని, సమాజ శ్రేయస్సు కోసం తమదైన శైలిలో ప్రతి ఒక్కరూ శ్రమించాలని సూచించారు. అదేవిధంగా విద్యార్థులు చదువుతోపాటు జ్ఞానాన్ని సేవా గుణాన్ని పెంపొందించుకోవాలని అర్థవంతమైన, భవిష్యత్తు నిర్మాణం కోసం శక్తి వంచన లేకుండా కృషి చేయాలని వివరించారు. ఎన్ఎస్ఎస్ చిహ్నం నిరంతరాయంగా మార్పును సూచిస్తుందని, మానవజాతి సంక్షేమాన్ని కోరుకుంటుందని ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు గ్రామస్తుల జీవన ప్రమాణాలను మెరుగు పరచడానికి, గ్రామ పునర్నిర్మాణం కోసం, వీలైనంత సహాయపడాలని, సామాజిక సమస్యలపై అవగాహన కలిగి ప్రకృతి విపత్తుల సందర్భంగా సహకారాన్ని అందించాలని, పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని వివరించారు. కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్ సంక్రాంతి సంయోగిత, ఎన్ఎస్ఎస్ పిఓ లింగారావు, ప్రిన్సిపల్ కృష్ణారావు, మజీద్, వేణు, నరేందర్, నాగలక్ష్మి, చైతన్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఐద్వా జిల్లా మహాసభలు జయప్రదం చేయండి

**నవతెలంగాణ-ఖమ్మం**

ఖమ్మంనగరంలో ఖానాపూర్ హవేలీ మండల మహాసభ యుపిహెచ్ కాలనీలో పందుల నాగమణి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బుగ్గవీటి సరళ, జిల్లా కార్యదర్శి మాచర్ల భారతి మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా పోరాటం చేయాలన్నారు. మహిళా సాధికారత హక్కులు, చట్టాలు పటిష్ఠ పరచాలని, సమస్యలపై మాత్రమే కాకుండా ప్రజలు ఎదుర్కొంటున్న వాటిపై కూడా పోరాటం చేయాలని అన్నారు. తొలుత జిల్లా అధ్యక్షురాలు బండి పద్మ ఐద్వా జెండా ఆవిష్కరించారు. అనంతరం నూతన కమిటీ 18 మందితో ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మెరుగు రమణ,



అధ్యక్షురాలు పందుల నాగమణి, కార్యదర్శి కత్తుల అమరావతి, సహాయ కార్యదర్శి వంగూరి రమాదేవి, ఉపాధ్యక్షురాలు తాళ్లపూడి మంగమ్మ, ధారావత్ విజయ, కమిటీ సభ్యులు సరస్వతి టీ. నాగరత్నం, జి.పార్వతి, సిహెచ్ సునీత, ఎస్.ఈశ్వరి, ఏ.అంజలి, ఎస్.అలివేలు, డి.పద్మ, ఎస్కే జైన, వి.సునీత తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా అభివృద్ధి కార్యక్రమాలు త్వరగా, నాణ్యతతో పూర్తి చేయాలి

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
- నగరంలో సీసీ రోడ్డు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**నవతెలంగాణ-ఖమ్మం**

ప్రజల అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను త్వరగా పూర్తి చేయాలని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఖమ్మం 1వ డివిజన్ ఖైకొండాయగూడెంలో టియుఎఫ్ఐడిసి నిధులు 195.00 లక్షలతో, 59వ డివిజన్ దానవాయిగూడెంలో రూ.2 కోట్ల లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆయన మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ప్రజల అభివృద్ధి, సంక్షేమం దిశగా ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన పని చేస్తుందని అన్నారు. అభివృద్ధిలో భాగంగా ఖమ్మం కార్పొరేషన్‌లో రెండు కోట్ల నిధులతో 12 సిసి రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసుకున్నామని తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తొలి నాళ్లలో



కోటి 30 లక్షలకు డ్రైయిన్, కొన్ని రోడ్ల పనులు చేపట్టామని, అవి నేడు చివరి దశకు చేరుకున్నాయని మంత్రి అన్నారు. స్మశాన వాటిక నిర్మాణానికి నిధులను కూడా మంజూరు చేసుకున్నామని, టెండర్ పూర్తి చేశామని, త్వరలో ఆ పనులు పూర్తవుతాయని, వాటితో పాటు కేఆర్ ఫంక్షన్ హల్ నుంచి స్కూల్ వరకు లింక్ రోడ్డు మంజూరు చేస్తామని మంత్రి పేర్కొన్నారు. శంకుస్థాపన చేసుకున్న సిసి రోడ్డు నిర్మాణ పనులను నాణ్యతతో 2 నెలల కాలంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకుని రావాలని అధికారులను ఆదేశించారు. కబ్జాకు గురైన ప్రభుత్వ స్థలాలను ప్రభుత్వం తీసుకొని అర్హులైన పేదలకు పంచడం జరుగుతుందని అన్నారు. దేవాదాయ, రెవెన్యూ భూములకు సంబంధించి ఎవరు పోజిషన్‌లో ఉన్నా యుద్ధప్రాతిపదికన రిటర్న్ తీసుకోవాలని మంత్రి రెవెన్యూ డివిజన్ అధికారిని ఆదేశించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఇరిగేషన్ అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయబాబు, ఖమ్మం నగరపాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య, అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్, ఖమ్మం ఆర్డీవో జి.గణేష్, పబ్లిక్ హెల్త్ ఇఇ రంజిత్, మిషన్ భగీరథ ఇఇ పుష్పలత, మునిసిపల్ డిఇ ధరణి, ప్రజా ప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# డంపింగ్ యార్డుపై జిల్లా మంత్రులు స్పందించాలి

- యార్డ్ తరలిస్తామని ఇచ్చిన హామీని అమలు పరచాలి
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.విక్రమ్

**నవతెలంగాణ- ఖమ్మం**



ఖమ్మం నగరంలో నడిబొడ్డున ప్రజలకు తీవ్ర అసౌకర్యంగా ఉన్న రాపర్తినగర్ డంపింగ్ యార్డ్‌ను తక్షణమే తరలించడానికి ఖమ్మం, పాలేరు మంత్రులు వేగంగా స్పందించాలని సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై విక్రమ్ డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం) టూ టౌన్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం కార్పొరేషన్ అధికారి ఎన్.శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికలు సందర్భంగా డంపింగ్ యార్డ్ తరలిస్తామని హామీ ఇచ్చిన మంత్రులు అందుకు తగిన చొరవ చూపించి ప్రజలు అనారోగ్యం గురి కాకుండా చర్యలు తీసుకోవాలి డిమాండ్ చేశారు. గత కొన్ని సంవత్సరాలుగా రాపర్తినగర్, దానవాయిగూడెం ఏరియా 30 వేల ప్రజలు డంపింగ్ యార్డ్ దుర్వాసన ఫలితంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాబోయే చలి కాలంలో డంపింగ్ యార్డ్ పొగ ఫలితంగా ఉపిరితిత్తులోకి కాల్చిన చెత్త పొగ పీల్చడం వల్ల తీవ్ర అనారోగ్యానికి గురి అవుతారని తెలిపారు. గతంలో చాలా సందర్భాల్లో పలువురు హాస్పిటల్‌కు వెళ్లి చికిత్స తీసుకున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యపై శాస్త్రీయంగా పరిశీలన చేసి నగరానికి దూరంగా డంపింగ్‌యార్డ్ మార్చాలని, అవసరమైతే చెత్త తరలింపునకు ట్రాక్టర్‌లకు డీజిల్ ఛార్జీలు పెంచి నగరానికి దూరంగా డంపింగ్‌యార్డ్ మార్చాలని డిమాండ్ చేశారు. ప్రతి సందర్భంలోనూ వివిధ పార్టీలు ఆందోళన చేసే తరుణంలో అధికారులు రావడం హామీలు ఇవ్వడం తప్ప ఈ సమస్యపై శాశ్వత పరిష్కారం చేయడం లేదని ఆరోపించారు. డంపింగ్ యార్డ్ ఖమ్మం, పాలేరు డివిజన్ పరిధిలో ఉందని వెంటనే ఇద్దరు మంత్రులు సమన్వయంతో ఈ సమస్య పరిష్కారం కోసం కృషి చేయాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం కాకపోతే రాబోయే కాలంలో అఖిలపక్షం ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని వై విక్రమ్ హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ టూ టౌన్ కార్యదర్శి బోడపట్ల సుదర్శన్, నాయకులు సిహెచ్.భద్రం, పగడాల నాగేశ్వరరావు, కోయ రమేష్, నాగరాజు, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

## గుండెపోటుతో సీపీఐ(ఎం) సీనియర్ సభ్యులు కొప్పుల జనార్ధన్ మృతి

- నివాళులర్పించిన నున్నా నాగేశ్వరరావు

**నవతెలంగాణ-ఖమ్మంరూరల్**



మండలంలోని మంగళగూడెం గ్రామానికి చెందిన సీపీఐ(ఎం) సీనియర్ శాఖ సభ్యుడు కొప్పుల జనార్ధన్ (71) గుండెపోటుతో మంగళవారం మృతి చెందారు. జనార్ధన్ మృతదేహాన్ని పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు సందర్శించి ఎర్రజెండా కప్పి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నున్నా మాట్లాడారు. జనార్ధన్ చిన్ననాటి నుండే కమ్యూనిస్టు కార్యకర్తగా పనిచేశారని తెలిపారు. పార్టీ ఏ కార్యక్రమం ఇచ్చినా శక్తి వంచన లేకుండా పని చేసే వారని తెలిపారు. మృతునికి భార్య పుష్పావతి, కూతురు కవిత ఉన్నారు. నివాళులర్పించిన వారిలో పార్టీ పాలేరు నియోజకవర్గ ఇన్చార్జ్ బండి రమేష్, మండల కార్యదర్శి నండ్ర ప్రసాద్, మండల ఇన్చార్జ్ ఉరడీ సుదర్శన్‌రెడ్డి, మండల కార్యదర్శి వర్గ సభ్యులు నందిగామ కృష్ణ, పి.మోహన్‌రావు, వడ్లమూడి నాగేశ్వరరావు, కొప్పుల రామయ్య, కొప్పల ఉపేందర్, యండ్లపల్లి వెంకటరామయ్య, పుచ్చకాయల నాగేశ్వరరావు, ప్రతాపనేని వెంకటేశ్వర్లు, దొండపాటి రమేష్, శ్యామ్ కుమార్, నారాయణ, నర్రా కిషన్, సురేష్, మాస్ లైన్ నాయకులు బండేల వెంకయ్య, కాంగ్రెస్ నాయకులు కొప్పుల చంద్రశేఖర్, వీరేల్లి అప్పారావు, బీఆర్ఎస్ నాయకులు యండపల్లి ఉపేందర్, నాగయ్య, యండపల్లి రవి తదితరులు పాల్గొన్నారు.

## గోదాముల్లో నిల్వలతో పాటు నిర్వహణ సక్రమంగా జరగాలి

**రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు**

**నవతెలంగాణ- ఖమ్మం**

గోదాముల్లో నిల్వలతో పాటు వాటి నిర్వహణ సక్రమంగా జరగాలని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ కార్యాలయంలో జిల్లాల మేనేజర్‌లతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. నిలువలపై ఎప్పటికప్పుడు రికార్డులు సక్రమంగా నిర్వహించాలని ఆయన చెప్పారు. గోదాముల్లో ఎవరైనా అధికారులు అవినీతికి పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎండి కోర్రా లక్ష్మి, జనరల్ మేనేజర్ మాలతి, జయ ప్రకాష్‌రెడ్డి, రమణమూర్తి పాల్గొన్నారు.

## కమ్యూనిస్టుల పోరాటాల ఫలితమే పోడుభూములకు హక్కులు

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భూక్య వీరభద్రం

**నవతెలంగాణ-కొణిజర్ల**



కమ్యూనిస్టుల పోరాట ఫలితమే పోడుభూములకు హక్కులు వచ్చాయని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భూక్యా వీరభద్రం అన్నారు. మండల పరిధిలోని తుమ్మలపల్లిగ్రామంలో పార్టీ శాఖ మహాసభ కామ్రేడ్ సీతారాం ఏచూరి నగర్‌లో శాఖ కార్యదర్శి బొడ్డుపల్లి వీరభద్రం అధ్యక్షతన జరిగింది. మహాసభకు ముందు పార్టీ జెండాను సీనియర్ నాయకులు తుమ్మలపల్లి మాజీ సర్పంచ్ కొత్తపల్లి నారాయణ ఆవిష్కరించారు. మహాసభకు ముఖ్య అతిథిగా భూక్య వీరభద్రం మరియు పార్టీ జిల్లా కమిటీ సభ్యులు పారుపల్లి ఝాన్సీ హాజరైనారు.పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనేక పోరాటాలు చేసిన నేపథ్యంలో పోడు భూములకు పట్టాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఇంకా చాలామందికి పోడుభూములకు పట్టాలు రావలసి ఉందని, వాటి కోసం కూడా సిపిఎం పోరాడుతుందన్నారు.అదే విధంగా రైతాంగ, మహిళా, నిరుద్యోగ సమస్యలు పరిష్కారం కోసం రాజీలేని పోరాటాలే సరియైన మార్గమన్నారు. ఈ మహాసభలో సిపిఎం తుమ్మలపల్లి నూతన శాఖ కార్యదర్శిగా బొడ్డుపల్లి వీరభద్రంను ఏకగ్రీవంగా మహాసభ ఎన్నుకోవడం జరిగింది. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి చెరుకుమల్లి కుటుంబరావు, పార్టీ మండల నాయకులు అన్నారపు వెంకటేశ్వర్లు, బండారు మల్లయ్య, జుబ్బూరి వీరభద్రం, బోయినపల్లి ప్రసాదు, కొలుపుల నాగమణి, జోగు రమాదేవి, చింతల బసవయ్య తదితరులు పాల్గొన్నారు.

### ఏచూరి స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు నిర్మించాలి

**వైరాటౌన్ :** ఏచూరి స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు నిర్మించాలని, పోరాటాల ద్వారానే ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయని సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భూక్యా వీరభద్రం, బొంతు రాంబాబు అన్నారు. సిపిఐ(ఎం) వైరా పట్టణ కమిటీ సభ్యులు, శాఖా కార్యదర్శుల సమావేశం స్థానిక బోడేపూడి వెంకటేశ్వరరావు భవనంలో పట్టణ కార్యదర్శివర్గ సభ్యురాలు మచ్చా మణి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా భూక్యా వీరభద్రం, బొంతు రాంబాబు మాట్లాడుతూ వైరా మున్సిపాలిటీలో పేరుకుపోయిన స్థానిక సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేయాలని అన్నారు. మున్సిపాలిటీలో పారిశుధ్యం పడకవేసిందని, ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు, మురుగు నీటి గుంటలు పెరిగాయని, డ్రైనేజీ కాలువల్లో ప్లాస్టిక్ కవర్లు, చెత్త అడ్డుపడి మురికి నీరు రోడ్ల మీదికి, ఇండ్లలోకి వస్తుందని అన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా మున్సిపాలిటీ అధికారులు పారిశుధ్యం మెరుగు పరచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) వైరా పట్టణ కార్యదర్శి సుంకర సుధాకర్, కార్యదర్శివర్గ సభ్యులు చింతనిప్పు చలపతిరావు, బొంతు సమత, కమిటీ సభ్యులు హరి వెంకటేశ్వరరావు, గుడిమెట్ల రజిత, కొంగర సుధాకర్, గుడిమెట్ల మోహన్‌రావు, అనుమోలు రామారావు, రాచబంటి బత్తిరన్న, గుమ్మా నరసింహారావు, పారుపల్లి శ్రీనాథ్ బాబు, సంక్రాంతి పురుషోత్తం, బెజవాడ వీరభద్రం, తోట కృష్ణవేణి, మాడపాటి రామారావు, పాపగంటి రాంబాబు, ఓర్సు సీతారాములు, వడ్లమూడి మధు పాల్గొన్నారు.

### సలాంకు మంత్రి తుమ్మల పరామర్శ

**నవతెలంగాణ-ఖమ్మం**

సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మహమ్మద్ సలాంను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మంగళవారం పరామర్శించారు. సలాం కొద్ది రోజుల క్రితం గుండె సంబంధిత చికిత్స చేయించుకున్నారు. తుమ్మల ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, నాయకులు నల్లమల వెంకటేశ్వరావు, సాధు రమేష్‌రెడ్డి, ఎల్లగొండస్వామి పాల్గొన్నారు.

## అడవి జంతువుల వల్ల దెబ్బతిన్న పంటలకు పరిహారం చెల్లించాలి

- నేడు ఢిల్లీలో జరిగే ధర్నాను జయప్రదం చేయండి
- తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు

**నవతెలంగాణ-కొణిజర్ల**

దేశ వ్యాపితంగా అడవి జంతువుల వల్ల దెబ్బతిన్న పంటలకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 25న బుధవారం చలో ఢిల్లీని జయప్రదం చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొంతు రాంబాబు, సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు కమిటీ సభ్యులు తాళ్ళపల్లి కృష్ణ పిలుపునిచ్చారు. గద్దలగూడెం గ్రామంలో పార్టీ గ్రామ మహాసభ సందర్భంగా జరిగిన రైతు సభలో బొంతు రాంబాబు, తాళ్ళపల్లి కృష్ణ మాట్లాడుతూ పులులు, ఏనుగులు, కోతులు అడవి పందులు, నెమళ్ల వలన పంటలు తీవ్రంగా దెబ్బతింటున్నాయని అన్నారు. ఈ అభయ అరణ్యాల దగ్గర సాగు చేస్తున్న రైతుల పంటలు పెద్ద ఎత్తున దెబ్బతింటున్నాయనీ అన్నారు. 2018 నుండి ఇప్పటివరకు దేశంలో పులుల వలన 300 మంది పైగా రైతులు చనిపోయారనీ అన్నారు. ఏనుగుల వలన 2,700 మంది రైతులు చనిపోయారనీ అన్నారు. కోతులు వలన



కూడా వందలమంది రైతులు చనిపోయారన్నారు. వీరికి ఎలాంటి పరిహారం కేంద్ర ప్రభుత్వం నుండి రావడం లేదనీ అన్నారు. ఈనెల 25న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరుగు ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో గద్దల గూడెం మాజీ సర్పంచ్ పుల్లూరి వెంకటేశ్వరరావు, పార్టీ గ్రామ కార్యదర్శి తేజావత్ సీతారాములు, చల్లా రాములు, చల్లా వెంకటనారాయణ, రేమల్ల కృష్ణ, హనుమంతు, భూ లక్ష్మి, వంశీ, రవి, ఎర్రగాని కృష్ణ కౌసల్య తదితరులు పాల్గొన్నారు.

# గోకినేపల్లి వీరులు తెలంగాణ సాయుధ పోరాట ధీరులు

- తెలంగాణ సాయుధ పోరులో నెత్తురోడిన 9 మంది అమరులు
- నైజాం నవాబులను గడగడలాడించిన గోకినేపల్లి గడ్డ
- నేడు శౌర్య యాత్ర గోకినేపల్లికి రాక

**నవతెలంగాణ-ముదిగొండ**



తెలంగాణ సాయుధ పోరులో కమ్యూనిస్టు పార్టీ ప్రజా ఉద్యమ చరిత్రలో ముదిగొండ మండలం గోకినేపల్లి గ్రామం పేరు చారిత్రాత్మకంగా నిలిచి చరిత్ర పూటల్లోకి ఎక్కింది. సమరశీలంగా సాగిన సాయుధ పోరుకు సైరన్ ఊదిన గోకినేపల్లి ఎర్రగడ్డగా పేరు పొందింది. ప్రజలకు అండగా ఎర్రసైన్యమై నిలిచింది. 1946-52 వరకు సాగిన వీరతెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో మండలంలో ప్రధానంగా గోకినేపల్లి గ్రామ 9 మంది వీర యోధుల బలిదానం దాగి ఉంది. గ్రామ నడిబొడ్డున 9 మంది ప్రజా వీరులను కన్నతల్లి గోకినేపల్లి పోరు బిడ్డలు మచ్చా వీరయ్య, రావెళ్ల సత్యం,



వాసిరెడ్డి లింగయ్య, యరమనేని వెంకటనరసయ్య, రాజమ్మ దంపతులు, పారుపల్లి పుల్లయ్య, గుంజులూరి కాటయ్య(ఎర్ర), గుణగంటి బుచ్చయ్య, పయ్యావుల లక్ష్మయ్యలు, ఈ ప్రాంత ప్రజా ఉద్యమ నాయకులు, పల్లె ప్రజల ప్రజా సమస్యలపై జరిగిన పోరులో కీలకంగా పనిచేసి అగ్రభాగాన నిలిచారు. అందరికీ ఆప్తులయ్యారు. ఆదర్శ కమ్యూనిస్టులుగా నిలిచారు. గ్రామాల్లో భూస్వామ్య పెత్తందారుల, పెద్దు మానికల మాడు పగలగొట్టి చరమగీతం పాడి, గ్రామ,గ్రామాన ఎర్రజెండాలు ఎగరేసి విజయం సాధించి, పేద ప్రజలకు భూములను పంచిపెట్టారు. వెట్టిచాకిరీ, అణిచివేతల నుండి ఊపిరి పోసుకున్న జనం బతుకులను ఎర్రజెండా వెలిగించారు. గ్రామ నడిబొడ్డున స్మృతిస్థూపాలై వెలుగుతున్నారు.

**నేడు శౌర్య యాత్ర గ్రామానికి రాక.**

వీరతెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో నిండు ప్రాణాలను తృణపాయంగా అర్పించిన ప్రజా వీరుల త్యాగాలు, బలిదానాలను విసిదీకరిస్తూ తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను నాటిక ద్వారా గ్రామ గ్రామాన ప్రజలకు వివరించాలని సంకల్పంతో ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో మూడు జిల్లాలు ఖమ్మం, నల్లగొండ, వరంగల్‌లో శౌర్యయాత్ర ప్రారంభించి కొనసాగిస్తుంది. ఈనేపథ్యంలో బుధవారం గోకినేపల్లి గ్రామానికి సాయంత్రం ఐదు గంటలకు శౌర్యయాత్ర రానున్నదని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు వాసిరెడ్డి వరప్రసాద్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. గ్రామంలోనే వీర తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను వీధినాటిక ద్వారా కళాకారులు ప్రదర్శించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కమ్యూనిస్ట్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు, నాయకులు, ప్రజలు, సానుభూతిపరులు అధిక సంఖ్యలో పాల్గొని యాత్రను జయప్రదం చేయాలని ఆయన కోరారు.




## జమిలి ఎన్నికలు ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు

**సీపీఐ(ఎం) ఖమ్మం జిల్లా కమిటీ సభ్యులు చలమల విఠల్ రావు**

**నవతెలంగాణ-పెనుబల్లి**

స్థానిక చలమాల సూర్యనారాయణ భవనంలో సీపీఐ(ఎం) మండల ముఖ్య సమావేశం మంగళవారం మండల కార్యదర్శి గాయం తిరుపతిరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు చలమాల విఠల్ రావు పాల్గొని మాట్లాడుతూ.. కేంద్ర బీజేపీ ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న జమిలి ఎన్నికల అనే నినాదం భారతదేశ ప్రజాస్వామ్యానికే గొడ్డలి పెట్టులా ఉందదని, ఈ ఎన్నికల విధానం ఆలోచన విధానాన్ని తక్షణమే విరమించుకోవాలని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు చలమాల విఠల్రావు అన్నారు. భారత రాజ్యాంగ స్ఫూర్తి, సమైక్య రాష్ట్రాల స్ఫూర్తికి, జమిలి ఎన్నికల్లో పూర్తి వ్యతిరేకమని, నియంతృత్వ పాలనకు బీజాలు వేయటానికి జమిలి ఎన్నికల విధానాన్ని బీజేపీ తీసుకొస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల నాయకులు గాయం తిరపతి రావు, నల్లమల్ల అరుణ ప్రతాప్, చలమాల నరసింహారావు, మిట్టపల్లి నాగమణి, సండే సత్యం,తడికమళ్ళ చిరంజీవి, తేళ్లూరి ఆంజనేయులు, బెజవాడ శేషు సాయి, మరకాల వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## వైరాలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు

**నవతెలంగాణ-వైరా**

వైరా మున్సిపాలిటీ శాంతినగర్ (ఇందిరానగర్) ఎస్సీ కాలనీ నందు జై భీమ్ యువసేన యూత్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా జై భీమ్ యువసేన యూత్ సభ్యులు మాట్లాడుతూ.. రాజ్యాంగ నిర్మాత, ప్రపంచ మేధావి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం పెట్టడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో పమ్మి దాసు, కరిశ్ రమేష్, కాకాటి నరసింహారావు, కుక్కల నాగభూషణం, చలపతి, దానియేలు, కృష్ణ, సాయి, కాంతారావు, నరేష్, సైదులు, కాకాటి వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్‌లో ఉన్న జీపీఎఫ్, పెన్షన్ బిల్లులను తక్షణమే విడుదల చేయాలి

**పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షులు యలమద్ది వెంకటేశ్వర్లు**

**నవతెలంగాణ -బోనకల్**

ఉపాధ్యాయ రేషనలైజేషన్ మార్గదర్శకాలో మార్పులు చేయాలని పెండింగ్లో ఉన్న జీపీఎఫ్ పెన్షన్ బిల్లును తక్షణమే విడుదల చేయాలని ఎలమద్ది వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పీఆర్‌టీయు బోనకల్ మండల శాఖ సర్వసభ్య సమావేశం మంగళవారం చిరునోముల ఉన్నతపాఠశాల ఆవరణలో మండల శాఖ అధ్యక్షులు పనకంచి రామ్మోహన్ అధ్యక్షతన జరిగింది. ముందుగా మండల శాఖ ప్రధాన కార్యదర్శి బంధం వెంకటేశ్వర్లు సంఘ కార్యకలాపాల నివేదికను ప్రవేశపెట్టగా సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా హాజరైన జిల్లా అధ్యక్షులు యలమద్ది వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సర్దుబాటు పేరుతో పాఠశాల విద్యాసంచాలకులు ఈ నెల 20న కలెక్టర్లకు విడుదల చేసిన ఉపాధ్యాయ రేషనలైజేషన్ మార్గదర్శకాలు ప్రాథమిక విద్యకు తూట్లు పొడిచేలా ఉన్నాయని, తక్షణమే మార్గదర్శకల్లో మార్పు చేయాలని డిమాండ్ చేశారు. జిఓ 25 ప్రకారం ప్రాథమిక పాఠశాలల్లో 60 మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు, 90 మందికి ముగ్గురు ఉపాధ్యాయులు ఉన్నత పాఠశాలలో 220 మంది విద్యార్థులకు 7 ఉపాధ్యాయ పోస్టులు ఉండేలా ఉపాధ్యాయ సర్దుబాటు చేయాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయం తీసుకోవడం శోచనీయమని అన్నారు. సర్వసభ్య సమావేశంలో జిల్లా ప్రధానకార్యదర్శి ఆర్.రంగారావు, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు ఆర్.బ్రహ్మ రెడ్డి, జిల్లా బాధ్యులు జి.సుజాత, చింతల రవికుమార్, కొమ్ము శ్రీనివాసరావు, టీ. రత్నకుమార్, మండల నోడల్ అధికారి దామాల పుల్లయ్య, మహిళా నాయకులు జి.ఝాన్సీ, ఎం.భాగ్యాలక్ష్మి, జి.నాగలక్ష్మి చాపల మడుగు కోటేశ్వరరావు, గుత్తా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు నిరంతరం శ్రమిస్తేనే విజయం

**రిజిస్ట్రార్, జెఎన్టియు కె.వెంకటేశ్వరరావు**

**నవతెలంగాణ-మధిర**

మధిర మున్సిపాలిటీ పరిధిలోని జడ్పీహెచ్ఎస్ మడుపల్లిని జేఎన్టీయూ రిజిస్టర్ కె.వెంకటేశ్వరరావు సందర్శించి విద్యార్థులకు సందేశం ఇచ్చారు. ఈ కార్యక్రమానికి హెచ్ఎం తోట నరసింహారావు అధ్యక్షత వహించారు. విద్యార్థులు నిత్యం శ్రమిస్తే విజయం తప్పక మనదవుతుందని చెప్పారు. అలాగే ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సూచనలను పాటిస్తూ క్రమశిక్షణతో ఎదిగి మంచి పౌరులుగా ఉండాలని కోరారు. ఉన్నత లక్ష్యాలను ఏర్పర్చుకొని ఎన్ని ఆటంకాలొచ్చినా, లక్ష్యాత్మకంగా నిబద్ధతతో కృషిచేసి విజయం సాధించాలన్నారు. అనంతరం వెంకటేశ్వరరావును ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి.జ్ఞానేశ్వర చారి, బూసా.కోటేశ్వరరావు, కె. ఆదాము, పి.కిషోర్, టి. జ్యోతిర్మయి, బి.వి. యస్.యం.శర్మ, ఎ.కృష్ణమూర్తి, జి.రామచంద్రరావు పాల్గొన్నారు.

## నేడు సీపీఐ(ఎం) గ్రామ శాఖ మహాసభ

**నవతెలంగాణ-ముదిగొండ**

మండల పరిధిలో గోకినేపల్లి గ్రామంలో బుధవారం సీపీఐ(ఎం) గ్రామ శాఖ మహాసభ నిర్వహించినట్లు శాఖ కార్యదర్శి మేడా నారాయణ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఈ మహాసభకు సీపీఐ(ఎం) జిల్లా, మండల నాయకులు హాజరుకానున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## నేడు జరిగే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి

**కూసుమంచి :** ఈ నెల 25న ఇబ్రహీంపట్నంలో జరిగే టీఎంకెఎంకెఎస్ రాష్ట్ర మత్స్యకారుల సదస్సుకు మత్స్యకారులు అత్యధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని నాయకన్ గూడెం గ్రామ మత్స్యకారుల సంఘం టీఎంకెఎంకెఎస్ గ్రామ అధ్యక్షుడు సింగం కృష్ణంరాజు పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని నాయకన్ గూడెం గ్రామంలో గోడ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా మత్స్యకారులను ఆదుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో శేఖర్, మల్సూర్, సోమయ్య, లక్ష్మణ్, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

## సత్తుపల్లి కోర్టు ప్రాంగణంలో స్వచ్ఛ భారత్

**సత్తుపల్లి :** హైకోర్టు ఉత్తర్వుల మేరకు మంగళవారం స్థానిక కోర్టు ప్రాంగణంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని జ్యుడీషియల్ అధికారులు నిర్వహించారు. స్వచ్ఛ భారత్ వారోత్సవాలలో భాగంగా 6వ అదనపు జిల్లా జడ్జి ఎం. శ్రీనివాస్, సబ్ జడ్జి షేక్ మీరా కాశీమ్ సాహెబ్‌తో కలిసి కోర్టు ప్రాంగణంలో శ్రమదానం చేసి, కోర్టు పరిసరాలను, టాయిలెట్ లను శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో బార్ ప్రెసిడెంట్ అడమ్స్, సెక్రటరీ మాయర రమేష్, సీనియర్ న్యాయవాదులు పిన్నం జానకి రామారావు, చింతపల్లి కృష్ణప్రసాద్, వెంకటకృష్ణ, కటారపు దాస్, దర్గావలి, సాంబశివరావు, గోపాలరావు, ఏట రవి, సూపరింటెండెంట్ రవీంద్ర, సయ్యద్ మహమ్మద్ పాషా, సిబ్బంది పాల్గొన్నారు.

## రేపు చిట్యాల ఐలమ్మ జయంతి సభ

**ఖమ్మం కార్పొరేషన్ :** వీరనారి, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు చిట్యాల ఐలమ్మ జయంతి సభను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజా సంఘాల ఐక్యవేదిక కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు వీరనారి మణుల ఆశయ సాధన సమితి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. చిట్యాల ఐలమ్మ కేవలం భూమికోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం మాత్రమే కాకుండా మహిళా సాధికారత కోసం కూడా తన జీవితాన్ని అంకితం చేశారని నిర్వాహకులు పేర్కొన్నారు. నగరంలో గల కిమ్స్ ఆస్పత్రి ఎదురుగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజాసంఘాల ఐక్యవేదిక జిల్లా కార్యాలయంలో గురువారం ఉదయం 10 గంటలకు చిట్యాల ఐలమ్మ జయంతి ఉత్సవ సభను తలపెట్టినట్లు వివరించారు.

## మున్సిపాలిటీ చెత్త ట్రాక్టర్లను అడ్డుకున్న రామన్నపేట వాసులు

**నవతెలంగాణ-ఖమ్మం**



ఖమ్మం 60వ డివిజన్ రామన్నపేట వాసులు మంగళవారం చెత్త బండ్లను అడ్డుకున్నారు. చెత్త బండ్లు డివిజన్ రోడ్డు మీద నుండి వెళ్తున్నాయని, దానివల్ల ట్రాఫిక్ సమస్యలు, దుర్వాసన వెదజల్లుతోందని స్థానికులు అన్నారు. ఇన్ని రోజులు బీసీ కాలనీ, రాపర్తి నగర్ నుండి వెళ్లిన మున్సిపల్ వాహనాలు రెండు రోజులు నుండి డివిజన్ మీదుగా వెళ్తున్నాయని, దానికి కారణం రాపర్తి నగర్ బీసీ కాలనీ వాసులు ధర్నా చేపట్టారని అన్నారు. దీంతో దానవాయిగూడెం, రామన్నపేట గేట్ మీదుగా చెత్తను తలిస్తున్నారని చెప్పారు. చెత్తను అతి సమీపంలో వేస్తున్నారు. దీని వల్ల 59, 60 డివిజన్‌లోని ప్రజలకు చాలా అనారోగ్య సమస్యలు వస్తాయని తెలిపారు. డంపింగ్ యార్డ్ ను తరలించాలని డిమాండ్ చేశారు.

# కూసుమంచి జూనియర్ కళాశాలను తీర్చిదిద్దాలి

**మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**

**నవతెలంగాణ -కూసుమంచి**



ఉత్తమ కళాశాలగా కూసుమంచి జూనియర్ కళాశాలను తీర్చిదిద్దాలని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ఎం. విజయ్ బాబు లతో కలిసి మండల కేంద్రంలో జూనియర్ కళాశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూసుమంచి మండలం పరిసర గ్రామాల ప్రజల ఆకాంక్ష మేరకు జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలనే ప్రభుత్వ చిరకాల కోరికను సీఎం దృష్టికి తీసుకొని వెళ్లి ప్రభుత్వ కళాశాల ఏర్పాటు చేశామని, దీనికి సహకరించిన ముఖ్యమంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. విద్య వైద్య రంగాలకు ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేసిందని అన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమం ద్వారా డ్వాక్రా మహిళలను కమిటీలుగా వేసి 637 కోట్లు ఖర్చు చేసి రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక వసతులు సరి చేశామని అన్నారు. పాఠశాలలు, కళాశాలలు ప్రారంభించిన రోజే పాఠ్య పుస్తకాలు, ఏక రూప దుస్తులు అందించామని అన్నారు. పేదవాడి వైద్యం కోసం ఎన్ని వేల కోట్ల ఖర్చు వచ్చిన వెనకడుగు వేయడం లేదని, రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని 10 లక్షలకు పెంచామని తెలిపారు. కళాశాలలో ఇప్పటికే 50 మంది చేరారని, మరో 15 రోజులలో ఈ సంఖ్య 150 వరకు చేరుతుందని ఆశిస్తున్నట్లు అధికారులు తెలిపారని, చాలా సంతోషంగా ఉందని అన్నారు. సమయం ఉన్నప్పుడల్లా కళాశాలకు వస్తానని, రాబోయే 2 సంవత్సరాలలో ఖమ్మం జిల్లాలోనే ప్రైవేట్ సెక్టార్ కు ధీటుగా ఉత్తమ జూనియర్ కళాశాలగా కూసుమంచి కళాశాలను తీర్చిదిద్దడంలో సిబ్బంది పనిచేయాలని మంత్రి కోరారు. విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు ప్రభుత్వం తరపున కల్పిస్తామని అన్నారు.

జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ... విద్య, వైద్యంపై మంత్రి ఆదేశాలతో జిల్లాలో ప్రత్యేక దృష్టి పెట్టడం జరిగిందని అన్నారు. జిల్లాలోని 50 ప్రభుత్వ పాఠశాలల్లో 4 నుంచి 6వ తరగతి చదివే పిల్లల కోసం ప్రత్యేకంగా ఇంగ్లీష్ ల్యాబ్ లను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఇంగ్లీష్ ల్యాబ్ ల ద్వారా విద్యార్థులకు ఆంగ్లం నేర్పడంతో పాటు వారు ఆంగ్లం మాట్లాడే విధంగా అవసరమైన శిక్షణ అందిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ప్రతి బుధవారం 70 జిల్లా అధికారులతో ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలిస్తున్నామని అన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా చేపట్టిన మౌళిక వసతుల పనులు చివరి దశకు చేరుకున్నాయని కలెక్టర్ అన్నారు.

కూసుమంచి మండలంలో జూనియర్ కళాశాల ప్రారంభించడం సంతోషంగా ఉందని, 400 విద్యార్థులకు అనుగుణంగా ఈ కళాశాల నిర్మించామని, ప్రస్తుత సంవత్సరం నిర్దేశించిన లక్ష్యం మేరకు విద్యార్థుల సంఖ్య వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని, ప్రైవేటు పాఠశాలల్లో టీసీ తీసుకున్న విద్యార్థులతో సంప్రదిస్తున్నామని కలెక్టర్ తెలిపారు.

అనంతరం మంత్రి, కళాశాలలో చదివే విద్యార్థినులకు పిఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సైకిళ్లను ఉచితంగా అందజేశారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవి బాబు, నేలకొండపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ సీతారాములు, మాజీ ప్రజా పతినిధులు, కళాశాల ప్రిన్సిపాల్ వీరభద్రరావు, అధికారులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

**చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందిస్తాం**

చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందిస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం మంత్రి, జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, నీటిపారుదల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయ బాబులతో కలిసి కూసుమంచి మండలం హట్యాతండాలో పాలేరు ఎడమ కాల్వ నీటి విడుదలను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...150 మీటర్ల కింద పెద్ద గండి పడిందని యుద్ధ ప్రాతిపదికన గండి పూడ్చామని, కింద ఉన్న యూటి వాల్ నీటిలో ఉండటం వల్ల డ్యామేజ్ కావడం, దీనిని అధికారులు గ్రహించలేని కారణంగా నీటి విడుదల చేస్తే యూటి కూలిపోవడం జరిగిందని అన్నారు. ఈ కారణాల వల్ల దిగువన ఉన్న రైతులకు సాగునీటి సరఫరా రెండు మూడు రోజులు ఆలస్యమైందని, యుద్ధ ప్రాతిపదికన గత 2 రోజుల నుంచి అధికార యంత్రాంగం ఇక్కడే ఉండి మరమ్మతు పనులు చేశారని మంత్రి తెలిపారు. మంగళవారం ఉదయం 500 క్యూసెక్కుల నుంచి మొదలు పెట్టి పెంచుకుంటూ మధ్యాహ్నం 1500 క్యూసెక్కుల నీటి విడుదల చేస్తున్నామని అన్నారు. బుధవారం ఉదయం 8 గంటలకు పూర్తి స్థాయిలో 3200 క్యూసెక్కుల నీటి విడుదల చేసి చివరి ఆయకట్టు వరకు నీళ్ళు అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ సీఇ విద్యాసాగర్, ఎస్ఇ నర్సింగ రావు, ఇఇలు వెంకటేశ్వర రావు, అనన్య ఖమ్మం ఆర్డీవో జి.గణేష్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# నేటి సాయంత్రానికి సాగర్ జలాలు కల్లూరు చేరిక

**పాలేరు వద్ద 1500 క్యూసెక్కుల నీరు విడుదల**

**నవతెలంగాణ-కల్లూరు**



ఎండిపోతున్న పంటలను కాపాడటం కోసం జిల్లా మంత్రులు, అధికారులు ఎట్టికేళకు సాగర్ కాలువకు పడ్డ గండి మరమ్మతు పూర్తిచేశారు. దీంతో మంగళవారం ఉదయం పాలేరు వద్ద ఎడమ కాలువకు 500 క్యూసెక్కుల సాగునీటిని విడుదల చేశారు. పాలేరు దిగువ భాగాన యుటి వద్ద పడ్డ గండిని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేక చొరవతో అధికారులు తాత్కాలికంగా మరమ్మతులు సోమవారం రాత్రి పూర్తిచేసి సాగునీటిని విడుదల చేయడానికి వీలు కల్పించారు. బుధవారం సాయంత్రానికి కప్పల బంధం రెగ్యులేటర్ వరకు సాగునీరు చేరే అవకాశం ఉందని, అధికారులు అంచనా వేస్తున్నారు. బుధవారం ఉదయం నుండి మూడువేల క్యూసెక్కుల వరకు సాగునీటి సరఫరాను పెంచే అవకాశం ఉన్నట్లు సమాచారం. కాలువ మొత్తం ఎండలకు ఎండిపోయి ఉండటంతో సాగునీరు సరఫరా వేగంగా ముందుకు సాగట్లేదు. తల్లాడ, కల్లూరు, వేంసూరు, పెనుబల్లి, మండలాల్లో వరి సాగు అధికంగా ఉండటంతో పాటు ఈ ఖరీఫ్‌లో ఎక్కువగా కరివేదతో వరి సాగు చేయటం వల్ల 20 రోజులు పాటు నీళ్ల లేకపోవడంతో పొట్ట దశకు చేరిన పంట ఎండిపోయే పరిస్థితికి వచ్చింది. అధికారులు ఇది దృష్టిలో పెట్టుకొని తొలుత వరి పైరుకు సాగునీరు అందిస్తే కొత్త పంట నైనా కాపాడుకునేందుకు అవకాశం ఉంటుందని రైతులు అభిప్రాయపడుతున్నారు. ఒక తడి వరి పంటకు సాగునీటి అందించేందుకు జిల్లా మంత్రులు, కలెక్టర్ అధికారులు దృష్టి పెట్టి పంటలను కాపాడు కాపాడాలని, డివిజన్ పరిధిలోని రైతులు వేడుకుంటున్నారు. సాగునీటి కోసం అటు వర్షం కోసం రైతులు కంటిమీద కునుకు లేకుండా ఎదురుచూస్తూ పంటపై ఆశ వదులుకోలేక వరి రైతులు గోస హరిగోశగా మారింది. వారి బాధను అర్థం చేసుకొని ముందుగా వరి పంటకు సాగునీరు అందించాలని వేడుకుంటున్నారు.

# వరి పంటలో ఎండుటాకుకు ముడత తెగులు

**వ్యవసాయాధికారులతో కలిసి**

**కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తల పరిశీలన**

**నవతెలంగాణ-వైరా**



మండలంలోని సిరిపురం (కెజి) పుణ్యపురం గ్రామాలలో వ్యవసాయాధికారులు, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తల బృందం పర్యటించి వరి, పత్తి, మిర్చి పంటలను పరిశీలించింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంటలకు తెగుళ్ళు సోకినట్లు గ్రహించినట్లు కెవికె శాస్త్ర వేత్తలు తెలిపారు. వరి పొట్ట దశలో ఎండాకు తెగులు సోకినందన నివారణకు కాపర్ హైడ్రాక్సైడ్ 2 గ్రాములు ం ప్లాంటా మైసిన్ 0.4 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని తెలిపారు. పత్తి కాపు దశలో ఉన్నది. పత్తిలో పిండినల్లి, కాయకుళ్ళు ను గమనించామని, నివారణకు ఎసిఫిట్ 2 గ్రాములు, లేదా ప్రాఫినోపాస్ 3 మీ.లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని తెలిపారు. మిరపలో కాండం కుళ్ళును గమనించామని దాని నివారణకు థయోఫసేట్ మిథైల్ 1.5 గ్రాములను ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని తెలిపారు. కెవికె శాస్త్ర వేత్తలు జెస్సీ సునీత, ఫణి శ్రీ, ముఖేష్, వ్యవసాయాధికారులు ఏడిఏ కరుణ శ్రీ, మంజుఖాన్ ఎంఏఓ, ఏఈఓలు పాల్గొన్నారు.

**పంటలను సందర్శించిన శాస్త్రవేత్తలు**

**కూసుమంచి :** మండలంలో కృషి విజ్ఞాన కేంద్రం వైరా ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా.కే. రవికుమార్, శాస్త్రవేత్త డా.వి. చైతన్య, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, కూసుమంచి డివిజన్ ఏడిఏ సరిత, కూసుమంచి మండల వ్యవసాయ అధికారి వాణి, వ్యవసాయ విస్తరణ అధికారి కుమారి ప్రియాంక, మండలంలోని వరి, పత్తి, మిరప పంటలను సందర్శించి రైతులకు తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు.

## స్కేటింగ్ పోటీల్లో ప్రథమ స్థానంలో డీపీవీ విద్యార్థిని శ్లోక కిరణ్

**నవతెలంగాణ-సత్తుపల్లి**



జిల్లా స్థాయి స్కేటింగ్ పోటీల్లో గంగారం డీపీవీ పాఠశాల విద్యార్థిని శ్లోక కిరణ్ జిల్లా ఫస్ట్ ప్లేస్ సాధించి గోల్డ్ మెడల్ పొందినట్లు ప్రిన్సిపాల్ తణుకు శేష సాయి తెలిపారు. మంగళవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ ఖమ్మం పట్టణంలో నిర్వహించిన జిల్లా స్థాయి అండర్-9 రోలర్ స్కేటింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో శ్లోక కిరణ్ 100 మీటర్ల విభాగంలో గోల్డ్ మెడల్, 200 మీటర్ల విభాగంలో సిల్వర్ మెడల్ సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆమె పేర్కొన్నారు. ప్రతిభ కనబరిచిన చిన్నారిని సాయి స్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాల చైర్మెన్, ఎంపీ, పారిశ్రామికవేత్త డాక్టర్ బండి పార్థసారధిరెడ్డి, విపాసన ఎడ్యుకేషనల్ ఛారిటబుల్ ట్రస్టీ బండి అన్విద, డీపీవీ రీజినల్ ఆఫీసర్ ఆర్కే ప్రసాద్, పీడీ కుమారస్వామి, సాయిస్ఫూర్తి సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ దాసరి ప్రభాకరరెడ్డి, ప్రిన్సిపాల్ శేషారత్నకుమారి అభినందించారు. సత్తుపల్లి పట్టణ సీఐ తెల్లబోయిన కిరణ్ కుమార్తె శ్లోక కిరణ్ స్కేటింగ్లో జిల్లాస్థాయి మొదటి స్థానాన్ని కైవసం చేసుకోవడం పట్ల ఏసీపీ అనిశెట్టి రఘు, పోలీస్ సిబ్బంది అభినందనలు తెలిపారు.

## మనసు, సమాజం స్వచ్ఛంగా ఉండాలి

**"స్వచ్ఛత హి సేవ" కార్యక్రమంలో జిల్లా న్యాయమూర్తి జి. రాజగోపాల్**

**నవతెలంగాణ-ఖమ్మం లీగల్**



మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న స్వచ్ఛ భారత్ వృక్షోత్సవాలలో భాగంగా జిల్లా కోర్టు ఆవరణలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి రాజగోపాల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ మహాత్మ గాంధీ ఆశించిన స్వచ్ఛభారత్ సాకారం కావాలంటే సమాజంతో పాటు ప్రతి ఒక్క వ్యక్తి మనస్సు కూడా స్వచ్ఛంగా ఉండాలని అన్నారు. 2024వ సంవత్సరపు స్వచ్ఛభారత్ లక్ష్యాన్ని "స్వభావ్ స్వచ్ఛత - సంస్కార్ స్వచ్ఛత" గా నిర్ణయించారని దీని సాధనకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కేవలం ఈ ఒక్కరోజు మాత్రమే కాకుండా సంవత్సరంలో ప్రతిరోజు స్వచ్ఛత కోసం కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు కే.ఉమాదేవి, వి.అపర్ణ, డి.రాంప్రసాదరావు, ఎం .అర్చనకుమారి, ఎం.కల్పన, కె.దీప, వి.మాధవి, ఆర్.శాంతిలత న్యాయవాదులు న్యాయశాఖ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌ను అప్‌గ్రేడ్ చేస్తాం

**మంత్రి తుమ్మల**

**నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్**



ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌ను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనిఖీ చేశారు. పెసలు కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించే విషయంలో మార్కెట్ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌ను అప్‌గ్రేడ్ చేస్తామని రాష్ట్రంలోనే ఖమ్మం మార్కెట్‌ను నెంబర్ వన్ మార్కెట్‌గా అభివృద్ధి పరుస్తామని ఆయన తెలిపారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. మార్కెట్‌లో సౌకర్యాలు కల్పించాలని, అధికారులను ఆదేశించారు. రైతులు ప్రయోజనాల విషయంలో ఎట్టి పరిస్థితులలో రాజీ పడొద్దు అని తుమ్మల అధికారులకు తెలిపారు.

## తెలుగు విశ్వవిద్యాలయానికి శ్రీ పొట్టి శ్రీరాములు పేరు తొలగింపును తీవ్రంగా ఖండిస్తున్నాం

**ఖమ్మం నగర ఆర్యవైశ్య మహాసభ**

**నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్**

రాష్ట్ర ప్రభుత్వం తెలుగు విశ్వవిద్యాలయానికి ఉన్న పొట్టి శ్రీరాములు పేరు తొలగించి సురవరం ప్రతాపరెడ్డి పేరును పెట్టడం అన్యాయమని దీన్ని మేము తీవ్రంగా ఖండిస్తున్నామని ఖమ్మం నగర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు గుమ్మడవెల్లి శ్రీనివాస్, గోళ్ల రాధాకృష్ణమూర్తి అన్నారు. తెలుగు రాష్ట్రాలలో ఉన్న తెలుగు విశ్వవిద్యాలయాలకు శ్రీ పొట్టి శ్రీరాములు పేరును తొలగిస్తూ 20 - 9 - 2024న రాష్ట్ర మంత్రివర్గ (క్యాబినెట్) సమావేశంలో నిర్ణయం తీసుకోవడం దారుణం అని భాషా ప్రయుక్త రాష్ట్రం కోసం 58 రోజుల పాటు ఆమరణ నిరాహార దీక్ష చేసి, అసువులు బాసిన మహనీయుని త్యాగనికి స్ఫూర్తిగా 1985 డిసెంబర్ నెలలో నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారకరామారావు తెలుగు విశ్వవిద్యాలయంను నెలకొల్పారని తెలిపారు. తరువాత కాలంలో ఆ విద్యాలయానికి శ్రీ పొట్టి శ్రీరాములు త్యాగం సమాజానికి తెలిసేలా వారి పేరును ఏర్పాటు చేస్తే, నేడు సీఎం రేవంత్ రెడ్డి ఆ పేరుని తొలగించి, సురవరం ప్రతాపరెడ్డి పేరును పొందుపరచడం చాలా బాధాకరం అన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం నగర ఆర్యవైశ్య మహాసభ వర్కింగ్ ప్రెసిడెంట్ మాశెట్టి వరప్రసాద్, ప్రధాన కార్యదర్శి రాయపూడి రవికుమార్, కోశాధికారి రాయపూడి జయరామ్, వైస్ ప్రెసిడెంట్ ఊటూరి లక్ష్మీనరసింహారావు, అదనపు కార్యదర్శి యడమకంటి రామారావు, అదనపు కోశాధికారి కూర శ్రీనివాస్, యువజన విభాగం కమిటీ చైర్మెన్ పబ్బతి ప్రదీప్, కల్చరల్ కమిటీ చైర్మన్ కందిబండ వేణుగోపాల్ పాల్గొన్నారు.

## వర్తక సంఘం అధ్యక్షునిగా నాగు బండి

**నవతెలంగాణ-పెనుబల్లి**



పెనుబల్లి మండలం విఎం బంజర్ వర్తక సంఘం అధ్యక్షునిగా నాగుబండి ప్రభాకర్ రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు మంగళవారం నూతనంగా ఎన్నికైన కమిటీ ప్రకటించారు. వైస్ ప్రెసిడెంట్‌గా కొణిజేటి కృష్ణారావు, గౌరవ అధ్యక్షులుగా ఆ చంటి పుల్లారావు, ట్రెజరర్‌గా కేతేపల్లి వెంకటేశ్వరరావు, కార్యదర్శిగా మిట్టపల్లి నరేంద్ర సహాయ కార్యదర్శి పాలెపు సతీష్ ఎన్నికయ్యారు. నూతన కమిటీకి ఆర్యవైశ్య సంఘం జిల్లా నాయకులు ఆ చంటి శ్రీనివాసరావు అభినందనలు తెలిపారు.

## గుండెపోటుతో వెంకటేశ్వర రెడ్డి మృతి

**నవతెలంగాణ-తల్లాడ**

మండల పరిధిలోని ముద్దనూరు మాజీ సర్పంచ్ ఎర్రమల వెంకటేశ్వర రెడ్డి గుండెపోటుతో మంగళవారం మృతి చెందారు. తెలుగుదేశం పార్టీ మండల కమిటీ అధ్యక్షుడిగా, మండల సమన్వయకర్తగా, సొసైటీ డైరెక్టర్‌గా బాధ్యతలను నిర్వహించారు. ఆయన ఆకస్మిక మృతి మండల ప్రజలను విస్మయానికి గురి చేసింది, రంగాపురం గ్రామానికి చెందిన వెంకటేశ్వర రెడ్డి తెలుగుదేశం పార్టీ ఆవిర్భావంతో పార్టీలో చురుకుగా పాల్గొని, పార్టీ మండల అధ్యక్షునిగా పనిచేశారు. అనంతరం బిఆర్ఎస్ పార్టీలో చేరారు. రైతు సమన్వయ సమితి మండల సమన్వయకర్తగా, సొసైటీ డైరెక్టర్గా బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో ఉన్నారు. ఆయన మృతితో మండలంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## అన్నారుగూడెంలో ఘనంగా పోషక మాస ఉత్సవాలు

**నవతెలంగాణ-తల్లాడ**

మండల పరిధిలోని అన్నారుగూడెం గ్రామంలో పోషక మాస ఉత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. సీడీపీఓ నిర్మల జ్యోతి మాట్లాడుతూ.. పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవాలని, పిల్లల బరువు ప్రతినెల తప్పనిసరిగా చూపించుకొని, బరువు తక్కువగా ఉన్న పిల్లలను, ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పంపించి, ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలన్నారు. ఏసిడిఓ పి. మహబూబ్ అలీ, సూపర్వైజర్ సత్యవతి టీచర్లు పాల్గొన్నారు.

## కుర్నవల్లి తెలంగాణ రైతు సంఘం, మహిళా సంఘం ఆధ్వర్యంలో ఖమ్మం వరద బాధితులకు వితరణ

**నవతెలంగాణ-తల్లాడ**

మండల పరిధిలోని కుర్నవల్లి గ్రామానికి చెందిన తెలంగాణ రైతు సంఘం, మహిళా సంఘం ఆధ్వర్యంలో వరద బాధితులకు 40 వేల రూపాయల నగదు, ఏడు క్వింటాళ్ల బియ్యం, 250 చీరలను, ఖమ్మంలో వరద బాధితులకు అందించేందుకు మంగళవారం తీసుకుని వెళ్లినట్లు తెలంగాణ రైతు సంఘం నాయకులు శీలం సత్యనారాయణ రెడ్డి తెలిపారు.

## వరద బాధితుల సహాయార్థం 10 వేలు నగదు, 6 క్వింటాళ్ల బియ్యం

**నవతెలంగాణ-కల్లూరు**

ఖమ్మం మున్నేరు బాధితుల సహాయార్థం పల్లి శాసనసభ్యులు మట్ట రాగమయ దయానంద్ పిలుపు మేరకు మండల పరిధిలోని ముచ్చవరం గ్రామంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు దాతలు నుండి 10వేలు నగదు, 6.50 క్వింటాళ్ల బియ్యం సేకరించి సత్తుపల్లిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సత్తుపల్లి శాసన సభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్‌కి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్‌కి అందజేశారు. ఈ కార్యక్రమంలో ముచ్చరం కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. సహకరించిన గ్రామ ప్రజలకు ఎమ్మెల్యే దంపతులు ధన్యవాదములు తెలిపారు.

## లక్ష్మీపురం గ్రామంలో పశు వైద్య శిబిరం

**నవతెలంగాణ-తల్లాడ**

మండల పరిధిలోని లక్ష్మీపురం గ్రామంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ, పశు వైద్య పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పశు వైద్య శిబిరం నిర్వహించామని డాక్టర్ నిషి జోషి తెలిపారు. 22 పశువులను పరీక్షించి చికిత్స అందించామని, 45 గేదె దూడలకు నట్టాల నివారణ మందు తాగించామని తెలిపారు. గోపాల్ మిత్ర సూపర్వైజర్లు టీ.నాగభూషణం, ఎం.వెంకటేశ్వర్లు, నాగరాజు, చుక్క రావు పాల్గొన్నారు.

## ఏపీ హోం మంత్రిని సన్మానించిన వల్లూరిపల్లి, బిక్కసాని



**నవతెలంగాణ-బూర్గంపాడు**

ఆంధ్రప్రదేశ్ హోం మంత్రి వంగలపూడి అనితను తాళ్ళూరి చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్ వల్లూరిపల్లి వంశీ కృష్ణ, బూర్గంపాడు సొసైటీ చైర్మెన్ బిక్కసాని శ్రీనివాస రావు పాయకరావు పేటలో ఆమె నివాసంలో మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి భద్రాచలం శ్రీ సీతా రామచంద్ర స్వామి వారి ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో తూము రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## మండలంలో కళాబృందం...కళా ప్రదర్శనలు

**నవతెలంగాణ-ఆళ్ళపల్లి**

కలెక్టర్ ఆదేశాల అనుసారం జిల్లా సమాచార, పౌర సంబంధాల శాఖ అధికారి హుస్సేన్ ఆధ్వర్యంలో తెలంగాణ సంస్కృతిక సారథి పర్యవేక్షణలో ఆళ్ళపల్లి, మైలారం, కొమ్ముగూడెం, లక్ష్మీపురం గ్రామాలలో మంగళవారం నుండి శుక్రవారం వరకు ఒక్కో గ్రామంలో ఒక రోజు చొప్పున కళాబృందంచే కళ ప్రదర్శనలు నిర్వహించడం జరుగుతుందని తెలంగాణ సంస్కృతిక సారధి బొమ్మరి ముత్యం తెలిపారు. ఈ సందర్భంగా ఆళ్లపల్లి గ్రామంలో కళాబృందం సారధి బోమ్మెర ముత్యం, బృంద సభ్యులు పమ్మి రవి, పాగి, వెంకన్న, గోవింద, గురువయ్య, వెంకట్, నకిరికంటి లాచే ప్రజలకు అర్థమయ్యే విధంగ వర్షాకాలంలో వచ్చే వ్యాధులు పట్ల అప్రమత్తంగా ఉండాలని, యువత మాదకద్రవ్యాలకు అలవాటు పడకుండా తల్లిదండ్రులు బాధ్యత వహించాలని, యువత చెడు వ్యసనాలకు బానిస కావద్దని, జరిగే అనార్ధాలు, ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్ రేఖం, భద్రం, ఫీల్డ్ అసిస్టెంట్ వజ్రా, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## సాయ పడటంలోనే అసలైన సంతోషం

- చిన్నారికి రక్తదానం చేసిన జీడుగు రాఘవ



**నవతెలంగాణ-జూలూరుపాడు**

అన్ని దానాల్లోకెల్లా రక్తదానం గొప్పది. సకాలంలో రక్తం అందక ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారు. మనమిచ్చే రక్తం మరొకరి ప్రాణాలు కాపాడుతుంది. ఎదుటివారికి సహాయపడాలనే తపన వున్న వ్యక్తి జూలూరుపాడు మండలం కాకర్ల గ్రామ యువకుడు జీడుగు రాఘవ. చదువుతున్న రోజుల్లో తన అభిమాన నటుడు చిరంజీవి స్థాపించిన బ్లడ్ బ్యాంక్ కార్యక్రమాలకు ఆకర్షితుడై మొదటగా రక్తదానం చేసాడు. అనంతరం రక్తదానంలో అంతర్లీనంగా దాగివున్న సేవాభావ విలువను గ్రహించిన రాఘవ కొనసాగిస్తున్నాడు. ఇప్పటికి ఆయన ఎవరికి రక్తం కావాలన్నా తనవంతు సాయపడుతూ ఉంటాడు. అందులో భాగంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని సుగుణ హాస్పిటల్ నందు భవిత అనే చిన్నారికి రక్తం తక్కువ ఉండడం వల్ల అత్యవసరంగా రక్తం కావాలనే సమాచారంతో వెంటనే స్పందించి కొత్తగూడెం వెళ్లి రక్త దానం చేసాడు. ఆపదలో వున్న వారికి అండగా నిలుస్తున్న జీడుగు రాఘవని పలువురు అభినందించారు.

## పీఆర్‌టీయూ మండల శాఖ ఎన్నిక

**నవతెలంగాణ-అన్నపురెడ్డిపల్లి**

ఉపాధ్యాయులు సమస్యలు కోసం అను నిత్యం పోరాడేది పిఆర్‌టియు అని జిల్లా ప్రధాన కార్యదర్శి రవి అన్నారు. మండల శాఖ సర్వ సభ్య సమావేశానికి ఆయన హాజరైనారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులు పదోన్నతులు కల్పించడం చాలా సంతోషం అని అన్నారు. అనంతరం పిఆర్‌టియు మండల నూతన కమిటీని ఎన్నికల అధికారి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులు జి.ఎ జయకర్, ఉపాధ్యక్షులు బి.వెంకటేశ్వరావు, ప్రధాన కార్యదర్శి రమేష్, అసోసియేట్ అధ్యక్షులు చల్లా భాస్కర్, కోశాధికారి కృష్ణ, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ శంకర్ మహదేవన్, వరప్రసాద్, మండల మహిళ అధ్యక్షురాలుగా శాంతకుమారి, కార్యదర్శిగా వసుంధర, గౌరవ అధ్యక్షులుగా నారాయణ, కార్యదర్శిగా జయరాం, బాలు, రామ్ లక్ష్మణ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశానికి రాష్ట్ర కార్యదర్శులు అగ్గి రవి, వెంకటేశ్వర్లు, సంజీవరావు, ఆనంద్ కుమార్, సభ్యులు వెంకటేశ్వర్లు, శ్రీనివాసరెడ్డి, నాగరాజు, బాలకృష్ణ, కళ్యాణి పాల్గొన్నారు.

## జోనల్ క్రీడా పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

**నవతెలంగాణ-అన్నపురెడ్డిపల్లి**

మండల పరిధిలోని యర్రగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చంద్రుగొండ జోనల్ క్రీడా పోటీలను పాఠశాల హెడ్మాస్టర్ ఆనంద్ కుమార్ ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూలమాల వేసి జాతీయ జెండా ఎగురవేశారు. మండల విద్యాశాఖ అధికారి సత్యనారాయణ క్రీడా పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముడు మండలాలు అయిన అన్నపురెడ్డిపల్లి, చంద్రుగొండ, జూలూరుపాడు మండలాల విద్యార్థులు సుమారు 220 మంది విద్యార్థులు పాల్గొంటున్నారు అని అన్నారు. క్రీడా ఫ్లాగ్‌ను సిజియఫ్ సెక్రటరీ నరేష్ ఆవిష్కరణ చేసి క్రీడలు వలన మానసిక ఉల్లాసం పొందుతారు అని అన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్మాస్టర్ లక్ష్మీనర్సయ్య, చంద్రుగొండ మండల పిడి సృజన తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్నేషనల్ ఉత్తమ ఉపాధ్యాయుడిగా పాషా ఎదగాలి

- డాక్టర్ అర్వపల్లి రేవంత్, ఎస్‌వి సంఘమిత్ర



**నవతెలంగాణ-ఆళ్ళపల్లి**

తెలంగాణ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్న షేక్ మహమూద్ పాషా ఇంటర్నేషనల్ ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎదగాలని ఆళ్ళపల్లి మండల మెడికల్ ఆఫీసర్ అర్వపల్లి రేవంత్, డాక్టర్ సంఘమిత్ర అభిప్రాయ పడ్డారు. ఈ మేరకు మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో పాషాకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఈ మాటలు అన్నారు. పాషా అకుంఠిత దీక్ష రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు కారణమని, వాస్తవానికి ఇంటర్నేషనల్ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు కూడా పాషా అర్హుడని అన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ నరేష్, శ్రీధర్, బాబు మురళి, ల్యాబ్ టెక్నీషియన్ పార్వతి, స్టాఫ్ నర్స్ సునీత తదితరులు పాల్గొన్నారు.

## బాల్యం నుండే సేవా భావం అలవర్చుకోవాలి

- ఏడీ డాక్టర్ జే.హేమంత్ కుమార్




**నవతెలంగాణ-అశ్వారావుపేట**

బాల్యం నుండే సేవాభావం అలవర్చుకోవాలని, ప్రతీ ఒక్కరూ విద్యార్జనతో పాటు సమాజానికి ఎంతో కొంత సేవ చేయాలని స్థానిక వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జే.హేమంత్ కుమార్ విద్యార్థులకు సూచించారు. జాతీయ సేవా పథక దినోత్సవాన్ని మంగళవారం వ్యవసాయ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసరాల పరిశుభ్రత, చెట్ల పెంపకం, ఆరోగ్య శిబిరాలు, రక్తదాన శిబిరాలు లాంటి అవగాహన కార్యక్రమాలలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని సమాజం పట్ల అంకితభావం భావంతో మెలగాలి అన్నారు. కళాశాల బోధనా, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసినటువంటి సభలో కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ కే.గోపాలకృష్ణమూర్తి మాట్లాడుతూ కళాశాలలో జరిగే వివిధ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనాలి, దేశ సేవలో ఎంతో ఒక అంత పాలు పంచుకోవాలి అన్నారు. క్రమంలో భాగంగా జాతీయస్థాయిలో జరిగిన వివిధ కార్యక్రమాల్లో పాల్గొని అత్యున్నత ప్రతిభ కనబరిచిన ఎన్ఎస్ఎస్ సేవకులను కళాశాల సిబ్బంది సన్మానించారు. అనంతరం విద్యార్థులు జాతీయ సేవా పథకం పై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. తరువాత సమాజంలోని రుగ్మతల నిర్మూలన కై అవగాహన కల్పిస్తూ విద్యార్థులు వివిధ రకాలైనటువంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎన్ఎస్ఎస్ విభాగం ప్రొఫెసర్స్ ఎం.రాంప్రసాద్, ఆర్.శ్రావణ్ కుమార్, పి.రెడ్డి ప్రియ బాధ్యులుగా వ్యవహరించారు.

## సమస్యలపై ఎమ్మెల్యేకి వినతి



**నవతెలంగాణ-భద్రాచలం రూరల్**

ప్రభుత్వ జూనియర్ కళాశాల సమస్యలపై భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావుకి సిబ్బంది వినతి పత్రం అందజేశారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలను తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రాక్టికల్ బిల్డింగ్ కోసం ల్యాబ్ అండ్ ఎక్యూమెంట్స్ గ్రంధాలయం బుక్స్ గురించి ఎమ్మెల్యే కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌తో మాట్లాడి మంజూరు చేయాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యేని శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు రత్నం రమాకాంత్, బొంబోతుల రాజీవ్, నర్రా రాము, పుల్లగిరి నాగేంద్ర, కళాశాల సిబ్బంది జిల్లా నోడల్ ఆఫీసర్ ఇంటర్ విద్య వెంకటేశ్వర రావు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సుధాకర్ రెడ్డి, లైబ్రేరియన్ గరుడా చలం, సీనియర్ అసిస్టెంట్ రత్న, ల్యాబ్ అసిస్టెంట్ చిన్న వెంకట నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగం రావడం అదృష్టంగా భావించి, బాధ్యతగా పనిచేయాలి : జీఎం



**నవతెలంగాణ-ఇల్లందు**

రాష్ట్రంలో ఉన్న అతిపెద్ద బొగ్గు ఉత్పత్తి సంస్థ సింగరేణిలో ఉద్యోగం రావడం అదృష్టంగా భావించాలని ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని జియం జాన్ ఆనంద్ అన్నారు. ఏరియా నుండి కారుణ్య నియామకాల్లో భాగంగా మెడికల్ అన్ఫిట్ అయిన కార్మికుల వారసులకు మంగళవారం కార్యాలయంలో ఉద్యోగ నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా జియం మాట్లాడుతూ తెలంగాణ అలాగే భూగర్భ గనుల్లో పనిచేస్తే నైపుణ్యత పెరుగుతుందని, పనిప్రదేశంలో ఎల్లప్పుడూ రక్షణతో అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలన్నారు. అడ్రియాల లాంగ్ వాల్ ప్రాజెక్ట్ ఆర్‌జి-3 ఏరియా భూగర్భ గనిలో పనిచేయుటకు నియామక ఉత్తర్వు అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో యస్ఓటూ జియం బొల్లం వెంకటేశ్వర్లు, డిజిఎం పర్సనల్ జి.వి.మోహన్ రావు, ఏరియా రక్షణాధికారి రామస్వామి గుర్తింపు సంఘం డిప్యూటీ జనరల్ సెక్రెటరీ సారయ్య, ప్రాతినిధ్య సంఘం జనరల్ సెక్రెటరీ త్యాగరాజన్, ఉపాధ్యక్షుడు జే.వెంకటేశ్వర్లు, సీనియర్ ఆఫీసర్, జూనియర్ అసిస్టెంట్ అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలపై ప్రజా ఉద్యమాలు నిర్మించాలి

- మాజీ ఎంపీ డాక్టర్ మిడియం బాబురావు
- భద్రాచలంకు ఆనుకొని ఉన్న ఐదు పంచాయతీలను తెలంగాణలో కలపాలి
- ఎమ్మెల్యే కాలనీ శాఖ 8వ మహాసభలో తీర్మాణం



**నవతెలంగాణ-భద్రాచలం రూరల్**

స్థానికంగా ప్రజా సమస్యలు గుర్తించి, ప్రజా పోరాటాలు నిర్మించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు, మాజీ ఎంపీ డాక్టర్ మీడియం బాబురావు అన్నారు. ఎమ్మెల్యే కాలనీ సీపీఐ(ఎం) శాఖ 8వ మహాసభ కుంజ మంగమ్మ అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ మహాసభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న నూతన ఆర్థిక విధానాలు ఫలితంగా ప్రజల జీవన ప్రమాణాలు పడిపోతున్నాయని, రోజురోజుకీ పేదరికంలోకి నెట్టబడుతున్నారని అన్నారు. పేద ప్రజలకు కనీస సౌకర్యాలు కూడా అందని పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ఈ మహాసభలో భద్రాచలంకు అనుకుని ఉన్న ఐదు పంచాయతీలను తెలంగాణలో కలపాలని, ఎమ్మెల్యే కాలనీలో అంగనవాడీ సెంటర్‌కు పక్కాభవనం మంజూరు చేసి నిర్మించాలని, డ్రైన్లు, సీసీ రోడ్లు వేయాలని, కరెంటు పోల్స్ కొత్తవి ఏర్పాటు చేయాలని తీర్మానించారు. మహాసభకు ముందు అమరవీరుల చిత్రపటాలకు పూలమాలవేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, కార్యదర్శి వర్గ సభ్యులు వై.వెంకట రామారావు, నాదెళ్ల లీలావతి, పి.సంతోష్ కుమార్, పట్టణ కమిటీ సభ్యులు ఎం.వి.ప్రసాద్ రావు, డి.సీతాలక్ష్మి, పార్టీ సీనియర్ నాయకులు ఎంవిఎస్ నారాయణ, ముండ్రు ఝాన్సీ, కనక శ్రీ, హైమావతి, సత్యవతి, రుక్మిణి, దేవి, మంగమ్మ, రామిరెడ్డి, గొడ్ల రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## లాభాల వాటా ప్రకటించడం కార్మికులను మోసం చేయడమే : మంద



**నవతెలంగాణ-టేకులపల్లి**

సింగరేణిలో 2023-24 సంవత్సరానికి గాను వచ్చిన నికర లాభము రూ.4701 కోట్లు కాగా దానిని మసిబూసి మారేడు గాయ చేయటానికి రాష్ట్ర ప్రభుత్వము, సింగరేణి యాజమాన్యం కంపెనీ అవసరాలరీత్యా పెట్టుబడుల కోసమని రూ.2289 కోట్ల పక్కకు పెట్టి మిగతా వాటిపై మాత్రమే 33% కార్మికులకు లాభాలు వాటా ప్రకటించటం కార్మికులను మోసం చేయడమేనని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంద నరసింహారావు మంగళవారం తెలిపారు. మండలంలోని కోయగూడెం ఓపెన్ కాస్ట్‌లో ఆయన మాట్లాడారు. నికర లాభాన్ని స్థూల లాభంగా ఏఐటీయూసీ నాయకులు చెప్పటం వారి అవివేకానికి నిదర్శనం అన్నారు. గత అనేక సంవత్సరాలుగా నికర లాభం పై కార్మికులకు లాభాల వాటా ప్రకటిస్తా ఉంటే, ఈ సంవత్సరం ప్రతి కార్మికుడికి గత సంవత్సరం వచ్చిన లాభాల కంటే రెండు రెట్లు అధికంగా వచ్చేదని, దానిని తగ్గించడానికి చేసిన కుట్రనే ఈ లాభాలను పక్కదారి పట్టించడం తప్ప మరొకటి కాదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ యజమాన్యానికి ఏఐటీయూసీ నాయకత్వం ఇలా అంటగట్టడం సరైనది కాదని, కార్మికులు అన్ని విషయాలను గమనిస్తున్నారని, గతంలో కంటే కార్మికులు వివేకులని అన్ని అంశాలను పరిగణలోకి తీసుకుంటున్నారన్నారు. ఇప్పటికైనా వాస్తవాలు తెలియజేసి కంపెనీ పై ఒత్తిడి తీసుకొచ్చి 4701 నికర లాభం పై 33% కార్మికులకు ఇప్పించాల్సిన, బాధ్యత గెలిచిన సందర్భంగా ఉన్నదన్నారు. గత ప్రభుత్వం సింగరేణిని అన్ని విధాల ఆర్థికంగా నష్టం చేసిన విధానాలని, ఇప్పుటి ప్రభుత్వం కూడా అదేవిధంగా కొనసాగిస్తే కంపెనీ డబ్బును ఇష్టారాజ్యంగా వాడుకుంటే దానికి సింగరేణి యాజమాన్యం వత్తాసు పలికితే సింగరేణి పరిస్థితి అగమ్య గోచరంగా మారుతుందన్నారు. కార్మికులందరూ మెలకువతో కంపెనీని కాపాడుకోవడం కొరకు సమయాత్తం కావలసిన అవసరమున్నదని అన్నారు.

సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు లాభాలలో వాటా ఇవ్వాలని, సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం రాష్ట్ర వ్యాపితంగా బస్సు యాత్ర చేసిందని, ఫలితంగా నేడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారని, ఎంత మంది కాంట్రాక్టు కార్మికులు సింగరేణికి ప్రత్యక్షంగా, పరోక్షంగా పని చేసినా వారందరికీ బేషరతుగా ప్రకటించిన 5వేల బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ పిట్ మీటింగ్‌లో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అబ్దుల్ నబి, ఇల్లందు బ్రాంచ్ కార్యదర్శి అబ్బాస్, కోయగూడెం బాద్యులు జీ చెందర్, సీఐటీయూ టేకులపల్లి మండలం మాజీ కార్యదర్శి కడుదుల వీరన్న తదితరులు పాల్గొన్నారు.



## విజయవంతంగా ముగిసిన జోనల్ క్రీడలు

**నవతెలంగాణ-దుమ్ముగూడెం**

మండలంలోని పెద్ద ఆర్లగూడెం బాలుర గిరిజన ఆశ్రమ పాఠశాలలో రెండు రోజులపాటు జరిగిన భద్రాచలం డివిజన్ స్థాయి జోనల్ క్రీడలు విజయవంతంగా ముగిశాయి. అండర్ 14, అండర్ 17 విభాగంలో జరిగిన ఈ క్రీడల్లో రెండవ రోజు మంగళవారం బాలురకు నిర్వహించగా వివిధ క్రీడల్లో క్రీడాకారులు తమ సత్తా చాటుకున్నారు. క్రీడల్లో సత్తా చాటిన క్రీడాకారులకు జోనల్ స్థాయి కన్వీనర్ ఆర్లగూడెం పాఠశాల ప్రధానోపాధ్యాయులు సోమశేఖర్ మండల విద్యాశాఖ అధికారి సున్నం సమ్మయ్య విజేతలకు బహుమతి ప్రధానోత్సవం చేశారు. జిల్లా స్థాయికి ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 26, 27 తేదీల్లో కొత్తగూడెం పట్టణంలో జరిగే జిల్లాస్థాయి క్రీడల్లో పాల్గొననున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రెటరీ దశంబాబు, ఐటీడీఏ స్పోర్ట్స్ ఆఫీసర్స్ గోపాల్, రావు, వెంకట్ నారాయణ, నాగేశ్వరరావు వివిధ మండలాల పీడీలు వసంత్, వెంకట్, కెజియా, శ్రీను, వెంకటరమణ, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

## మెగా లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలి

- గొడవలు వద్దు-రాజీలే ముద్దు
- ఎస్సై రాణా ప్రతాప్



**నవతెలంగాణ-జూలూరుపాడు**

రాజీ పడదగిన కేసులో ఉన్నవారు రాజమార్గం ద్వారానే పరిష్కరించుకోవడమే మంచిది, దీని ద్వారా సమయం వృధా కాదని కక్షలు, కారుణ్యాలు తగ్గుతాయని తద్వారా స్నేహభావం పెంపొందుతుందని ఎస్సై రాణా ప్రతాప్ తెలిపారు. మీ ఉచిత న్యాయ సేవ అధికార సంస్థ తేదీ 23-09-2024 నుండి 28-09-2024వ తారీకు వరకు కొత్తగూడెం జిల్లా కోర్టులో మెగా లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహిస్తున్నారని, జూలూరుపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని మీపై కానీ, మీకు తెలిసిన వాళ్లపై గాని ఏమైనా కేసులు ఉంటే వాటిని పూర్తి పరిష్కారం (రాజీ) చేసుకుని కోర్టుకు హాజరైనట్లయితే ఆ కేసులను పూర్తిగా మూసి వేయడం జరుగుతుందని తెలిపారు. పూర్తి సమాచారం కోసం సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్:8712682041, కోర్టు కానిస్టేబుల్:9704694238, 9959124768 ఈ నెంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

**టేకులపల్లి** ఈనెల 23 నుండి 28వరకు ఇల్లందు కోర్టులో మెగా లోక్ అదాలత్ జరుగుతుందని మండలంలోని ప్రజలు ఉపయోగించుకోవాలని ఎస్ఐ పోగుల సురేష్ మంగళవారం తెలిపారు. దీనికోసం ఫిర్యాదు దారుడు, నేరస్తుడు (ఇంజూరి అయినవారు) తమ ఆధార్ కార్డు తీసుకుని ఇల్లందు కోర్టుకు వెళ్లాలని తెలిపారు.

## భద్రాచలం సమస్యలపై మరో పోరాటం తప్పదు

- ఐదు గ్రామపంచాయతీలను తెలంగాణలో కలపాల్సిందే
- టీజేఎస్ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపగాని శంకర రావు



**నవతెలంగాణ-భద్రాచలం రూరల్**

భద్రాచలం నియోజకవర్గంలో ఎన్నో సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయని, వాటిని పరిష్కరించేందుకు ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం నేతృత్వంలో టిజెఎస్ పార్టీ ఆధ్వర్యంలో భవిష్యత్తు పోరాటాలు నిర్వహించనున్నట్లు టీజెఎస్ పార్టీ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపగాని శంకర్రావు తెలిపారు. మంగళవారం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా భద్రాచలం విచ్చేసిన ఆయన తొలి మలి దశ తెలంగాణ ఉద్యమ నాయకులు తిప్పన సిద్ధులు నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఆంధ్రాలో విలీనమైన ఐదు గ్రామపంచాయతీలను తెలంగాణలో కలపాల్సిందేనని స్పష్టం చేశారు. ఐదు గ్రామ పంచాయతీలతోనే భద్రాచలం అభివృద్ధి ముడిపడి ఉందని అన్నారు. ఈ విషయంపై ఇరు తెలుగు రాష్ట్ర ముఖ్య మంత్రులు అంగీకారానికి రావాలని ఆయన కోరారు. ఏజెన్సీ ప్రాంతమైన భద్రాచలంలో 1/70, పిసా, వాల్టా చట్టాలను అధికారులు అమలు చేయడం లేదని విమర్శించారు. పోలవరం నిర్వాసితులకు మెరుగైన ప్యాకేజీని అందించాలని డిమాండ్ చేశారు. జగన్నాధపురం నుండి భద్రాచలం వరకు సింగిల్ రోడ్డుగా ఉన్న రహదారిని జాతీయ రహదారిగా మార్చి అంతర్రాష్ట్ర సరిహద్దులకు మెరుగైన రవాణా సదుపాయాన్ని ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. లేనిపక్షంలో టీజేఎస్ ఆధ్వర్యంలో భవిష్యత్తు పోరాటాలను నిర్వహించనున్నట్లు వివరించారు. అనంతరం టీఎస్ భద్రాచలం నియోజకవర్గం కో ఆర్డినేటర్లుగా పూనెం ప్రదీప్ కుమార్, ఆర్ రామారావును నియమించి టీజేఎస్ సభ్యత్వ పుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు దేవదానం, ఖమ్మం నియోజకవర్గం ఇన్‌చార్జ్ బెల్లంకొండ నాగేశ్వరరావు, పినపాక నియోజకవర్గం ఇన్‌ఛార్జ్ మూల నాగిరెడ్డి, టీజెఎస్ రాష్ట్ర నాయకులు నబి సాహెబ్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక హక్కులను కాలరాస్తున్న ఎన్డీఏ ప్రభుత్వం

- సీపీఐ(ఎం) మండల కార్యదర్శి బత్తుల



**నవతెలంగాణ-బూర్గంపాడు**

కార్మిక హక్కులను ఎన్డీఏ ప్రభుత్వం కాలరాస్తుందని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మండలంలోని లక్ష్మీ పురం గ్రామంలో పార్టీ లక్ష్మీపురం శాఖ మహాసభ జరిగింది. మహాసభ సందర్భంగా జెండా ఆవిష్కరించి బత్తుల వెంకటేశ్వర్లు మాట్లాడారు. కేంద్రంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వం సామాన్య ప్రజల పైన భారాలు మోపుతున్నాయని ఆయన అన్నారు. 29 కార్మిక చట్టాలను, నాలుగు లేబర్ కోడ్ లాగా మార్చి కార్మికులను యజమానికి బానిసలుగా చేసే కుట్రతో భాగంగా కార్మిక హక్కుల్ని సవరిస్తున్నారన ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలపై కార్మిక వర్గం, వ్యవసాయ కార్మికులు, రైతులు, ఇతర కార్మికులందరూ ఏకమై పోరాటంలోకి ముందుకు రావాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు. లక్ష్మీ పురం చుట్టూ ఐటీసీ పీఎస్ పీడీ ఫ్యాక్టరీకి సంబంధించిన గోడౌములు విపరీతంగా ఉన్నాయని, అట్టల ఫ్యాక్టరీలు వాటి వల్ల కాలుష్యం ప్రజల అనారోగ్యానికి గురి అవుతున్నారని క్యాన్సరు అనారోగ్యానికి గురయ్యే పరిస్థితి ఉందని ఆయన అన్నారు. గోదావరి మంచినీళ్ల లక్ష్మీపురానికి అందించాలని, ఐటీసీ పిఎస్పీడీ మేనే జ్మెంట్ ఆ రకమైన ఆలోచన చేయాల్సిన అవసరం ఉందన్నారు.

**లక్ష్మీపురం శాఖ కార్యదర్శిగా గుంటుక కృష్ణ**



లక్ష్మీపురం సీపీఐ(ఎం) శాఖా కార్యదర్శిగా గుంటుక కృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నాగులు, సాయి, నాగేశ్వర రావు, రమేష్, గణేష్, రాజేష్, వెంకటేశ్వర్లు, సామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ దిష్టి బొమ్మ దహనం

**నవతెలంగాణ-ఇల్లందు**

సింగరేణి కార్మికుల లాభాల వాటా పట్ల మోసపూరితంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా తెలంగాణ తల్లి విగ్రహం వద్ద సింగరేణిలో టీబీజీకేఎస్, బీఆర్ఎస్ నిరసన ప్రదర్శన నిర్వహించి ప్రభుత్వ దిష్టి బొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ జనరల్ సెక్రెటరీ సుదర్శనం రంగనాథ్, బీఆర్ఎస్ పార్టీ నేత రాజేందర్ మాట్లాడారు. సింగరేణి సంస్థకు గత ఆర్థిక సంవత్సరంలో వచ్చిన లాభాలు అక్షరాల రూ.2222 కోట్లు ఇందులో ఎటువంటి మినహాయింపులు చేయకుండా దీనిలో 32 శాతం అనగా దాదాపు అక్షరాల రూ.710 కోట్లు రూపాయలను కార్మికులకు కేసీఆర్ ప్రభుత్వం పంచడం జరిగింది. అప్పుడు కార్మికులకు సగటున లక్షా అరవై వేల రూపాయలు లాభాల వాటాగా వచ్చింది. కానీ ఈ ఏడాది సింగరేణి సంస్థకు వచ్చిన లాభాలు అక్షరాల రూ.4701 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం చెప్పిన విధంగా 33 శాతం లాభాలు ప్రకటిస్తే మొత్తంగా దాదాపు అక్షరాల రూ.1551 కోట్లు సింగరేణి ఉద్యోగులకు పంచాల్సి ఉంది, అలా పంచితే ఒక్కో కార్మికునికి సగటున మూడు లక్షల డెబ్బైవేల వెచ్చించి ఉండేది. కానీ రాష్ట్ర ప్రభుత్వం వచ్చిన లాభాల నుండి రూ.2389 కోట్లను అభివృద్ధుకని పక్కన పెట్టి కేవలం రూ.2412 కోట్లను మాత్రమే 33 శాతం పంచి కార్మికులకు ఒక్కలక్షా తొంబాయివేల రూపాయలు సగటున వస్తున్నాయని చెప్పి సింగరేణి కార్మికులను నిండా ముంచిందన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ జెకె శ్రీను, మండల అధ్యక్షుడు శీలం రమేష్, ప్రధాన కార్యదర్శి పరుచూరి వెంకటేశ్వర్లు, ఇల్లందు మండలం ప్రధాన కార్యదర్శి ఖమ్మం పాటి రేణుక తదితరులు పాల్గన్నారు.

## గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమం చేపట్టాలి

**నవతెలంగాణ-మణుగూరు**

మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని గ్రామాల్లో వెంటనే పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని సిపిఐ పట్టణ కార్యదర్శి దుర్గాల సుధాకర్ డిమాండ్ చేశారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ మున్సిపాలిటీ, మండలంలో చెత్త, పెరిగిపోయి కాలువలు శుభ్రం చేయక, మురుగు నీరు ఎక్కడెక్కడ ఆగి ఇబ్బంది కంరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కుటుంబరావు, నాయకులు ఎస్వీ నాయుడు, తోట రమేష్, రాజబాబు, రాయల భిక్షం, సీతారాములు, రాములు, సంపత్, తదితరులు పాల్గొన్నారు.

## సీ టైపు రోడ్డును విస్తరింప చేయాలి

- ప్రమాదాలు నివారించాలి
- సీపీఐ(ఎం) మండల కార్యదర్శి రాములు



**నవతెలంగాణ-మణుగూరు**

సింగరేణి యాజమాన్యం సీ టైప్ రోడ్డును విస్తరింప చేయాలని, సెంట్రల్ లైటింగ్‌ను ఏర్పాటు చేయాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కోడిశాల రాములు డిమాండ్ చేశారు. మంగళవారం సంతోష్ నగర్ పార్టీ గ్రామ శాఖ సభ సట్టు లక్ష్మయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యమే యుద్ధ ప్రాతిపదికన రోడ్డు నిర్మించాలన్నారు. ముత్యాలమ్మ నగర్ గ్రామపంచాయతీ పరిధిలో గల సంతోష్ నగర్, ఇతర గ్రామాలలో అంతర్గత రోడ్లు అస్తవ్యస్తంగా ఉన్నాయని కొన్ని ప్రాంతాల్లో రోడ్డు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మిషన్ భగీరథ నీటిని అన్ని గృహాలకు అందేలా చూడాలని ప్రభుత్వ అధికారులను కోరారు. తోగ్గూడా నుండి ముత్యాలమ్మ నగర్ గుట్ట మల్లారం లంక మల్లారం పంచాయతీల పరిధి, మున్సిపాలిటీ పరిధిలోని కమలాపురం, రాయి గూడెం పరిధిలోగల అతి పెద్ద అర్బన్ పార్క్‌కు టికెట్లు లేకుండా చేయాలన్నారు. ఉచితంగా ప్రజలందరూ సందర్శించేలా అవకాశం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి వర్గ సభ్యులు డి.లెనిన్ బాబు, సత్రపల్లి సాంబశివరావు, కొడిశాల రాములు, పద్మ కోండ్రు గౌరీ, సంతోషమ్మ, రాజమ్మ పాల్గొన్నారు.

**ముత్యాలమ్మ శాఖ కార్యదర్శిగా కోండ్రు గౌరీ**



ముత్యాలమ్మ నగర్ పంచాయతీ పరిధిలోని సీపీఐ(ఎం) శాఖ మహాసభ నూతన కార్యదర్శిగా కోండ్రు గౌరీని మంగళవారం ఎన్నుకున్నది. కోండ్రు గౌరీ గిరిజన సంఘం మండల అధ్యక్షురాలుగా ప్రస్తుతం పని చేస్తున్నారు. పార్టీని విస్తరింప చేయడానికి కోసం కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆమె తెలిపారు.

## స్వచ్ఛంద సంస్థ సహకారంతో మానసకు కృత్రిమ కాలు



నవతెలంగాణ-ములకలపల్లి

ములకలపల్లి మండలంలో మారుమూల గ్రామం పాత గుండాలపాడుకు చెందిన కారం మానస చిన్నతనం నుంచి ఎంతో చలాకీగా ఉండి చదువులో ముందుండేది. 8వ తరగతిలో ఉండగా అంతుచిక్కని వ్యాధితో కాలు సెప్టిక్ కావడంతో కొంతకాలానికి ఇంటర్ చదువుతున్న సమయంలో కాలు తీసేయాల్సి వచ్చింది. అయినప్పటికీ చదువులో ప్రతిభ కనబరుస్తూ ఇంజనీరింగ్ సీటు సాధించింది. అయితే ఓ పక్క ఆర్థిక ఇబ్బందులు, మరోపక్క మానసిక వైకల్యంతో కుంగిపోయి చదువును ఆపివేసింది. ఆ సమయంలో రగ్గులు పంపిణీ చేసేందుకు పీపుల్స్ హెల్పింగ్ చిల్డ్రన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆ గూడానికి వచ్చిన ములకలపల్లి గ్రామవాసి, ఎస్సై పుష్పాల రామారావు ఇది గమనించి కుటుంబసభ్యులతో మాట్లాడి ఇంజనీరింగ్ చదివేందుకు కృషి చేశారు. అలాగే ఆమె కాలుకు ప్రొస్టెటిక్ లింబ్ కృత్రిమ కాలు అమర్చేలా కృషి చేశారు. దీనికి రూ.లక్ష ఖర్చు అవుతుందని తెలిసి తనకు పరిచయం ఉన్న స్వచ్ఛంద సంస్థలను సంప్రదించి పినపాకకు చెందిన సామాజిక కార్యకర్త తోలెం శ్రీనివాస్ సహకారం, విజయవాడకు చెందిన శ్రీనివాసరావు ఆర్థికసాయంతో హైదరాబాద్లోని ఇవోలేషన్ ప్రొస్టెటిక్ లింబ్స్ సంస్థ ప్రతినిధి జన్ను నాగరాజు సహకారంతో ఆమెకు విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న రూ.లక్ష విలువైన కృత్రిమ కాలును అమర్చారు. ఇప్పుడు కారం మానస సాధారణంగా నడుస్తూ ఇంజనీరింగ్ చదువును కొనసాగిస్తుంది. తన కుటుంబ ఆర్థికపరిస్థితి, నా ఆరోగ్య పరిస్థితిని గమనించి సహాయం చేసిన ఎస్సై పుష్పాల రామారావు, దాతలకు మానస, కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఆర్థిక సాయం అందజేత

నవతెలంగాణ-బూర్గంపాడు

మండల పరిధిలోని బత్తుల నగర్‌కు చెందిన సోడే వెంకటేష్ నివసిస్తున్న ఇళ్లు విద్యుద్ఘాతంతో చెలరేగిన మంటల్లో పూర్తిస్థాయిలో దగ్ధమై, కుటుంబం నిరాశ్రయులుగా మారారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సూచనల మేరకు మంగళవారం ఆ కుటుంబ సభ్యులను కాంగ్రెస్ పార్టీ పినపాక నియోజకవర్గం నాయకులు, మాజీ జడ్పీటీసీ బట్టా విజయ్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎడమకంటి సుధాకర్ రెడ్డిలు పరామర్శించారు. తాత్కాలిక షెడ్ నిర్మాణంకు రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక మాజీ ఉప సర్పంచ్ సొందే గోవింద్, మండల యువజన కాంగ్రెస్ నాయకులు హరీష్ యాదవ్, గ్రామస్తులు, ప్రజలు పాల్గొన్నారు.

## ఘన, ద్రవ పదార్థాలపై అవగాహన కార్యక్రమం

నవతెలంగాణ-దుమ్ముగూడెం

ఐటీసీ ఎమ్మెస్ కే వాష్ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం మండల పరిషత్ సమావేశపు మందిరంలో ఘన, ద్రవ పదార్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఐటిసి బంగారు భవిష్యత్ వాష్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. ఎంపీఓ రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు మాట్లాడారు. ఏపీవో సుకన్య, ఐటిసి ఎమ్మెస్ కే వాష్ ప్రోగ్రాం పిఓ గీత, సాగర్, వాష్ ప్రోగ్రాం ఏపీఓ సునీల్ బాబు, వెంకటేశ్వర్లు, వెంకటరావు, రాజ్ కుమార్, ప్రమోదు, ప్రసాదు, సాంబ, సందీప్, జంపరాజు, పంచాయతీ కార్యదర్శులు, మల్టీపర్పస్ వర్కర్లు మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఐఎఫ్‌డబ్ల్యూజే జాతీయ సమావేశాలను జయప్రదం చేయండి

- టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కర్ర అనిల్ రెడ్డి

నవతెలంగాణ-దుమ్ముగూడెం



ఈ నెల 28, 29, 30 తేదీలలో ఐఎఫ్‌డబ్ల్యూజే జర్నలిస్ట్ యూనియన్ ఆధ్వర్యంలో ఉత్తరప్రదేశ్‌లోని మధుర (బృందావన్)లో జరిగే జాతీయ సదస్సును జయప్రదం చేయాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి కర్ర అనిల్ రెడ్డి పిలుపునిచ్చారు. జాతీయ సదస్సును విజయవంతం కోరుతూ మంగళవారం దుమ్ముగూడెం, చర్ల మండలాల్లో జరిగిన యూనియన్ సమావేశాలలో ఆయన పాల్గొని మాట్లాడారు. జాతీయ, రాష్ట్ర, జిల్లా బాధ్యులు అధిక సంఖ్యలో జాతీయ మహాసభలకు హాజరు కావాలన్నారు. ఈ సమావేశంలో టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పూదోట సూరిబాబు, గుండెబోయిన వెంకటేశ్వర్లు, రాష్ట్ర నాయకులు డి.రవికుమార్, జిల్లా ఉపాధ్యక్షులు తోటమల్ల రమణ మూర్తి, నాయకులు పుష్పగిరి, మచ్చా రాజా, వై.గణపతి, తదితరులు పాల్గొన్నారు.

## రామగుండం థర్మల్ స్టేషన్‌ను జెన్కోనే నిర్మించాలి

నవతెలంగాణ-మణుగూరు

రామగుండంలో ఆర్‌టీఎస్ (రామగుండం థర్మల్ స్టేషన్) స్థానంలో నిర్మించ తలపెట్టిన 800 మెగావాట్ల విద్యుత్ కేంద్రాన్ని టీజీ జెన్కో ఆధ్వర్యంలోనే నిర్మించాలని టీజీపిఈఏ(తెలంగాణ స్టేట్ పవర్ ఇంజనీర్ అసోసియేషన్) నాయకులు డిమాండ్ చేశారు. మణుగూరులోని బీటీపీఎస్‌లో చీఫ్ ఇంజనీర్ బి.బిచ్చన్నకు టీజీ పిఈఏవీ ఆధ్వర్యంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలు అంశాలను సీఈ దృష్టికి తీసుకొని వెళ్లారు. విద్యుత్ కేంద్రాలను నిర్మించే అనుభవమున్న ఇంజనీర్లు జెన్కోలో ఉన్నారని గుర్తు చేశారు. కేటీపీఎస్ లోని పాత ప్లాంట్ స్థానంలో 1600 మెగావాట్ల సామర్థ్యంతో రెండు యూనిట్లు ,800 మెగావాట్ల సామర్థ్యంతో కేటీపీపీలో మరో యూనిట్లను జెన్కో నిర్మించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రీజినల్ అధ్యక్షులు బి.రవి ప్రసాద్ నాయకులు సి.హెచ్ రాజబాబు, రవితేజ, సాయి, రాము, ఆనంద్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## రూ.285 కోట్ల లాభాలు సాధించడంలో జెకె 5 ఓపెన్ కాస్ట్ కీలక పాత్ర

- ప్రాజెక్ట్ ఆఫీసర్ కృష్ణ మోహన్

నవతెలంగాణ-ఇల్లందు

సింగరేణి లాభాలు సాధించడంలో జెకె 5 ఓపెన్ కాస్ట్ ఎంతో కీలక పాత్ర పోషించిందని లాభాలలో రూ.285 కోట్లు సాధించిందని మొత్తం లాభాలలో 5 శాతం వాటా జేకే 5 ఓ.సి నుండే వచ్చిందని ప్రాజెక్ట్ ఆఫీసర్ కృష్ణ మోహన్ అన్నారు. సింగరేణి సంస్థ ఇల్లందు ఏరియాలోని జెకె ఉపరితల గని నందు ప్రమాదాల నివారణ పై ప్రత్యేక భద్రత అవగాహన కార్యక్రమానికి కృష్ణ మోహన్ హాజరై మాట్లాడారు. అధికారులు, కార్మికులు ఎంతో కష్టపడి ఈ లాభాలు సాధించారని అధికారులను, కార్మికులను అభినందించారు.

ఈ కార్యక్రమంలో మేనేజర్ పూర్ణ చందర్, సేఫ్టీ ఆఫీసర్ శివ ప్రసాద్, సీనియర్ పర్సనల్ అధికారి సుధాకర్, గని గుర్తింపు సంఘం నుండి ఎం. వెంకటేశ్వరరావు, ప్రాతినిధ్య సంఘం నుండి బాబురావు ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఐక్య పోరాటాల ఫలితమే లాభాల వాటా చెల్లింపు

నవతెలంగాణ-మణుగూరు

సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు లాభాల వాటా రూ.5 వేలు చెల్లింపు నిర్ణయం పట్ల అఖిలపక్ష కాంట్రాక్ట్ కార్మిక సంఘాల నేతలు హర్షం వ్యక్తం చేశారు. అన్ని విభాగాల కాంట్రాక్ట్ కార్మికులకు దీన్ని వర్తింప చేయాలని అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘాల నేతల డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఐ కార్యాలయంలో అఖిలపక్ష కాంట్రాక్ట్ కార్మిక సంఘాల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా అఖిలపక్ష కాంట్రాక్ట్ కార్మిక సంఘాల నాయకులు ఆర్.మధుసూదన్ రెడ్డి, గద్దల శ్రీనివాస్ రావు, గడ్డం వెంకటేశ్వర్లు, డి.సుధాకర్, సత్రపల్లి సాంబశివరావు, పి.సంజీవరెడ్డి, ఆర్.బిక్షం తదితరులు మాట్లాడారు. ఈ సమావేశంలో తోట రమేష్, జక్కుల రాజబాబు, ఎం.రాజకుమార్, వై.రవి తదితరులు పాల్గొన్నారు.





## పౌరులుగా తీర్చిదిద్దే సమాజ సేవా వేదిక ఎన్ఎస్ఎస్

- ఫైర్ ఆఫీసర్ నవీన్

నవతెలంగాణ-ఇల్లందు




సమాజానికి ఉపయోగపడే శక్తివంతమైన పౌరులుగా తీర్చిదిద్దే సేవా వేదిక ఎన్ఎస్ఎస్ అని ఫైర్ ఆఫీసర్ ఎం.నవీన్ అన్నారు. పట్టణంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఎన్ఎస్ఎస్ యూనిట్స్ ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకం దినోత్సవం పురస్కరించుకొని జాతీయ సేవా పథకం వేడుకలను కళాశాల ప్రిన్సిపాల్ రామలింగేశ్వరావు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి విచ్చేసి మాట్లాడారు. ఎన్ఎస్ఎస్ ద్వారా ఎన్ఎస్-ఎస్ వాలంటీర్లు నవ సమాజ సైనికులుగా, నవ సమాజ నిర్మాతలుగా తయారవుతున్నారని అన్నారు. భారత ప్రభుత్వం చేత 1969 సెప్టెంబర్ 24వ సంవత్సరంలో ప్రారంభించబడిన ఈ పథకం 55 సంవత్సరాల అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి తోర్తి జాన్, విలియం ప్రసాద్, లైబ్రరీయన్ కలం ప్రసాద్, అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు సాగునీరు అందించాలి

- మూకమామిడి ప్రాజెక్ట్ కాలువల పూడిక తీయాలి
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కనకయ్య

నవతెలంగాణ-ములకలపల్లి




మూకమామిడి ప్రాజెక్టు చివరి కంపగూడెం, రంగాపురం గ్రామాల ఆయకట్టు రైతులకు కాలువలు మరమ్మతులు నిర్వహించి, సాగునీరు అందించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిధిలోని కంపగూడెం, రంగాపురం మహాసభకు ఆయన హాజరై మాట్లాడారు. మండలంలోని పేరుగాంచిన అతిపెద్ద ప్రాజెక్టుకు మరమ్మతులు కోసం గత సంవత్సరంలో ప్రభుత్వం రూ.6 కోట్ల నిధులు కేటాయించినప్పటికీ ప్రాజెక్ట్ పనులు పూర్తి కాలేదని, కోట్ల నిధులు కాంట్రాక్టు పాలు చేసారని అన్నారు. కాలువలను మరమ్మతులు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. మూకమామిడి ప్రాజెక్టుకు నిధులు కేటాయించి పూడికే తీయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీల సంక్షేమ పథకాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతు భరోసా డబ్బులను రైతుల అకౌంట్‌లోకి తక్షణమే జమ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు, నిమ్మల మధు, మంచాల సారయ్య, వూకంటి రవికుమార్, మాజీ సర్పంచ్ గడ్డం వెంకటేశ్వర్లు, బోర్రా జోగయ్య, ఓరుగంటి నరేష్, కుర్సం ముత్యాలు, మంచాల ఉపేందర్, గడ్డం రాజు, కణితి కాంతారావు, సూర్య నారాయణ, వెంకటేశ్వర్లు, ముత్యాల రావు, తదితరులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి ఆటల పోటీలకు నవభారత్ విద్యార్థులు ఎంపిక

నవతెలంగాణ-పాల్వంచ



ఈనెల 17 నుండి 19వ తేదీలలో నల్గొండ ఏకశిలా అడ్వాన్స్డ్ లెర్నింగ్ స్కూల్ నందు జరిగిన సీబీఎస్ ఈ క్లస్టర్-7 అథ్లెటిక్స్ పోటీలలో పాల్వంచలో ఉన్న నవభారత్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు అత్యున్నత ప్రతిభ కనబరచి జాతీయస్థాయికి ఎంపికయ్యారు. అండర్-14 విభాగంలో షార్ట్ పుట్ నందు బి.దియా సిల్వర్ మెడల్ కైవసం చేసుకోగా, అండర్-19 విభాగంలో 800 మీటర్ల పరుగు పందెంలో టి.జ్ఞానవి గోల్డ్ మెడల్ సాధించింది. వీరిరువురు అక్టోబర్-6 నుంచి వారణాసిలో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జ్ఞానవి అథ్లెటిక్స్‌తో పాటు స్కేటింగ్ పోటీలలోను అద్భుతంగా రాణించి మూడు మెడల్స్ సాధించింది. వీరిరువురిని పాఠశాల ప్రిన్సిపల్ శ్రీ.యం.వి.ఎస్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ ఎ.శ్రీదేవి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వీరికి పాఠశాల అథ్లెటిక్ కోచ్ పవన్ కళ్యాణ్ శిక్షణను అందించారు.

## ఐద్వా రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

- ఐద్వా పట్టణ కార్యదర్శి సందకూరి లక్ష్మి

నవతెలంగాణ-కొత్తగూడెం




ఐద్వా రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఐద్వా పట్టణ కార్యదర్శి సందకూరి లక్ష్మి అన్నారు. మంగళవారం కొత్తగూడెం మంచి కంటి భవనంలో పట్టణ అధ్యక్షురాలు అన్నవరపు ఇందిరా అధ్యక్షతన జరిగిన సమావేశంలో లక్ష్మి మాట్లాడుతూ దేశంలో రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు, హింసలు రోజురోజుకు పెరిగి పోతున్నాయన్నారు. మహిళలకు రిజర్వేషన్లు కల్పించే విధంగా ప్రభుత్వాలు పనిచేయడం లేదని ఆరోపించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు కూడా సక్రమంగా అమలు చేయడం లేదని విమర్శించారు. ఎన్నికల హామీలు అమలుకే పరిమితం అవుతున్నారని వాపోయారు. అక్టోబర్ 21, 22, 23 తేదీల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, కొత్తగూడెంలోని కొత్తగూడెం క్లబ్బులో జరిగే ఐద్వా రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ మహాసభల్లో అనేక విషయాలపై చర్చించనున్నారని ఈ మహాసభలకు అందరూ అందరూ ఆదరించాలని విజయవంతం చేయడానికి వ్యాపార వర్గాలు, మేధావులు, డాక్టర్లు, ప్రజలు ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా పట్టణ కార్యవర్గ సభ్యులు శ్యామల, రమా, రజిత, మరికంటి సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

# వేతనాలు చెల్లించకపోతే సమ్మె చేస్తాం

- సీఐటీయూ ఆధ్వర్యంలో హాస్టల్ వర్కర్ల ధర్నా
- అడిషనల్ డైరెక్టర్ సర్వేశ్వర్ రెడ్డికి వినతి

నవతెలంగాణ-కొత్తగూడెం






వేతనాలు చెల్లించకపోతే సమ్మె చేస్తామని హాస్టల్ వర్కర్ల ధర్నాలో స్పష్టం చేశారు. హైద్రాబాద్ ప్రజా భవన్, గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. అనంతరం అడిషనల్ డైరెక్టర్ సర్వేశ్వర్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ గిరిజన సంక్షేమ శాఖ హాస్టల్ డైలీ వేజ్, అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.మధు మాట్లాడారు. గిరిజన సంక్షేమ శాఖ పోస్టుమెట్రిక్ (పిఎంహెచ్) హాస్టల్ వర్కర్ల 20 నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని తెలిపారు. ఆసిఫాబాద్ జిల్లాలో డైలీ వేజ్ వర్కర్లకు జిల్లా కలెక్టర్ గెజిట్ ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో పీఎంహెచ్ హాస్టల్ అవుట్సోర్సింగ్ వర్కర్లు, డైలీ వేజ్ వర్కర్లు ప్రజా భవన్‌లో ధర్నా నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. రాష్ట్ర నోడల్ ఆఫీసర్ దివ్యకి వినతి పత్రం అందజేశారు. గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి అడిషనల్ డైరెక్టర్ సర్వేశ్వర్ రెడ్డికి వినతి పత్రం అందజేశామని మధు చెప్పారు. 20 నెలలుగా గిరిజన కార్మికులు వేతనాలు లేకుండా పస్తులు ఉంటున్నారని, మంత్రులకు, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆసిఫాబాద్ జిల్లాలో 36 మంది కార్మికులకు జిల్లా కలెక్టర్ గెజిట్ ప్రకారం వేతనాలు చెల్లించవలసి ఉండగా అందుకు విరుద్ధంగా పదివేల రూపాయలు మాత్రమే చెల్లిస్తున్నారని ఫలితంగా ప్రతి కార్మికులు రూ.8 వేలు నష్టపోతున్నారని ఆయన తెలిపారు. సమస్యలపై వినతిపత్రం స్వీకరించిన ప్రజాపాలన నోడల్ ఆఫీసర్ దివ్య ప్రజాపాలన ఇన్ చార్జి జి.చెన్నారెడ్డి మాట్లాడుతూ ఆర్థిక శాఖ అధికారులతో మాట్లాడి పెండింగ్‌లో వుంచిన చెక్కులను క్లియర్ చేయించి జీతాలు ఇప్పిస్తామని హామి ఇచ్చారు. సమ్మె చేయవద్దని కార్మికులను కోరారు. గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శితో మాట్లాడి సమస్యలు పరిష్కారం అయ్యేవిధంగా చర్యలు తీసుకుంటామని హామి ఇచ్చారు. దసరా పండుగ లోపు వేతనాలు ఇవ్వకపోతే రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెచేస్తామని సిఐటియూ నాయకులు హెచ్చరించారు. ఈ ధర్నా కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు టేకం ప్రభాకర్, కార్యదర్శి కె.బ్రహ్మాచారి, నాయుకులు కృష్ణమాచారి, హీరాలాల్, జలందర్, జయ, తిరుపతమ్మ, ముత్తయ్య పాల్గొన్నారు.

# జీవో నెంబర్ 22 ప్రకారం వేతనాలు చెల్లించాలి

- 30న ఛలో హైద్రాబాద్
- సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి డి.వీరన్న

నవతెలంగాణ-కొత్తగూడెం




సింగరేణి సంస్థలో గత అనేక సంవత్సరాలుగా కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు జీవో-22 ప్రకారం హైపవర్ కమిటీ వేతనాలు చెల్లించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో దశలవారి పోరాటాలు నిర్వహించడం జరుగుతుందని, రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి యాజమాన్యం ఏమాత్రం కూడా పట్టించుకోకుండా సంస్థలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికుల మీద సవతి తల్లి ప్రేమ చూపిస్తుందని సింగరేణి లాభాల్లో పర్మినెంట్ కార్మికులతో సమానంగా పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు బోనస్ చెల్లించకుండా వారితో వెట్టి చాకిరి చేయిస్తుందని, సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి డి.వీరన్న విమర్శించారు. మంగళవారం పోరుబాట ప్రచారం కార్యక్రమంలో భాగంగా ఈనెల 30న జరిగే ఛలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ అన్ని కార్మిక ప్రాంతాలు, అడ్డాల దగ్గర, గ్రూప్ మీటింగ్‌లు, కరపత్రాలు, పోస్టర్ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరన్న మాట్లాడుతూ సింగరేణి విస్తరించిన ఉన్న ఆరు జిల్లాలు, 12 నియోజకవర్గాల పరిధిలో ఈ రాష్ట్రంలో సింగరేణి విస్తరించి ఉన్నదని అందులో 27 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. వారి న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం ఈ నెల 30న ఛలో హైదరాబాద్ కార్యక్రమాన్ని సిఐటియు నిర్వహిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కాంట్రాక్ట్ కార్మికులకు విజ్ఞప్తి చేశారు. ఇప్పటికైనా సింగరేణి యాజమాన్యం ప్రకటించిన లాభాలు బోనస్‌ను రూ.5,000లు ఇస్తానని చెప్పారని, అవి ఎలాంటి షరతులు లేకుండా ప్రతి కాంట్రాక్ట్ కార్మికులకీ అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు కోశాధికారి సూరం ఐలయ్య ప్రభాకర్, కిషన్, రాణి తదితరులు పాల్గొన్నారు.



## పాత్రికేయుల మీద దాడి అమానుషం

- అక్షర సీనియర్స్ ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు

నవతెలంగాణ-చర్ల

సమాజంలో జరుగుతున్న రుగ్మతలను వెలికి తీసి వార్తలు రాసిన పాత్రికేయుని పైన దాడులు చేయడం అమానుష్యమని చర్ల సీనియర్స్ అక్షర ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు జవ్వాది మురళీకృష్ణ, సుతార్ ఋషి కుమార్‌లు తమ ఆందోళన వ్యక్తం చేశారు. మండలంలోని అంబేద్కర్ నగర్ గ్రామంలో నివాసం ఉండే ప్రజాజ్యోతి విలేఖరి అలవాల సతీష్ ఇంటిపై గుర్తు తెలియని వ్యక్తులు రాళ్లదాడి చేయడం ఎంతవరకు సమంజసం అని వారు ప్రశ్నించారు. గత కొన్ని రోజుల నుండి వరుసగా గంజాయి, గుడుంబా, జూదం పై కథనాలు రాస్తున్న విలేకరిపై సోమవారం రాత్రి 10:50 నిమిషాలకు ఇంటి పైకప్పు పై గుర్తుతెలియని దుండగులు రాళ్ల దాడికి పాల్పడ్డారు. దీనిపై అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు, కుటుంబ సభ్యులు కోరుతున్నారని వారు తెలిపారు. తొలుత మండల కేంద్రంలో పాత్రికేయులు అందరూ సంఘటితంగా అంబేద్కర్ విగ్రహానికి మెమోరాండం ఇచ్చి అక్కడ నుండి తహసీల్దార్ శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు దొడ్డా ప్రభుదాస్, కొంగు రమణారావు, పందిళ్ళపల్లి వెంకటేశ్వర్లు, కిరణ్, ఎం.వి చారి, రామ లక్ష్మణ్, కిషోర్, జి.సురేష్, సునీల్, శ్రావణ్, అలవాల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

### విలేకరులపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండిస్తున్నాం

ప్రజాజ్యోతి విలేఖరి అలవాల సతీష్ ఇంటిపై గుర్తుతెలియని దుండగులు, ఆకతాయిలు, రౌడీ మూకల్లా రాళ్లదాడి చేయడాన్ని, ఫోన్లు చేసి బెదిరించడాన్ని సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీగా తీవ్రంగా ఖండిస్తున్నామని ప్రజాపంథా డివిజన్ నాయకులు కొండా చరణ్ తెలిపారు. ఈ విషయమై ఆయన మంగళవారం మాట్లాడారు. మంచి కోసం తమ కలాన్ని, గలాన్ని వినిపించే విలేకరి మిత్రులకు ప్రజాపందా అండగా ఉంటుందన్నారు.

## 5వ విడత ఐటీఐలో స్పాట్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-మణుగూరు



భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ప్రభుత్వ ప్రయివేటు ఐటీఐలలో 5వ విడత స్పాట్ ప్రవేశాల కోసం దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు మణుగూరు ఐటిఐ ప్రిన్సిపాల్ జిల్లా కన్వీనర్ బడుగు ప్రభాకర్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... ఈనెల 23 నుంచి 28 తేదీ వరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. మణుగూరు ప్రభుత్వ ఐటిఐలో డ్రాఫ్ట్ మెన్ సివిల్, డీజిల్ మెకానిక్, కంప్యూటర్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్ (కోప) కోర్సులలో సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. గతంలో దరఖాస్తు చేసి సీట్ రానివారు ఆన్లైన్లో ఆప్షన్ పెట్టుకోవాల్సిందిగా తెలిపారు. ఇప్పటివరకు దరఖాస్తు చేయనివారు కొత్తగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హత ఆసక్తి కలిగిన విద్యార్థులు ఆన్ లైన్ దరఖాస్తు చేసుకున్నవారు. ఈ నెల 25నుంచి మీరు చేరదలచిన ఐటిఐకి వెళ్లి సీట్ పొందాలని తెలిపారు. ఈ చివరి అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. www. ititelangana. gov.in అనే వెబ్సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చును. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాల కోసం 9440206990కు ఫోన్ చేసి తెలుసుకోవాలన్నారు.



## రైతాంగం పట్ల ఎందుకు వివక్ష

- సీతారామ ప్రాజెక్ట్ డిజైన్ మార్పుల వల్ల తీవ్ర నష్టం
- గోదావరి నదీ జలాలు ఏజెన్సీ ప్రాంతానికి అందించాలని మంత్రికి అఖిలపక్షం వినతి

నవతెలంగాణ-ఇల్లందు

దుమ్ముగూడెం ప్రాజెక్టును స్వర్గీయ వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం 2005లో ఇందిరా సాగర్ రాజీవ్ సాగర్ పేరుతో శంకుస్థాపన చేసి శ్రీకారంచుట్టారు. మరల మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దానిని సీతారాం ప్రాజెక్టుగా నామకరణం చేసి రోళ్లపాడు చెరువు వద్ద శంకుస్థాపన చేసారు. మొదట ఈ ప్రాజెక్టు ద్వారా ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ప్రతి ఎకరానికి సాగునీరు అందించాలనే సంకల్పంతో ప్రారంభించారు. కానీ పాలకులు స్వార్థపూరిత ఆలోచనలతో ప్రాజెక్టు డిజైన్లను మార్పులు చేస్తూ ఏజెన్సీ ప్రాంతానికి చుక్క నీరు రాకుండా చేస్తున్నారని సీతారామ ప్రాజెక్టు రీ డిజైన్ ద్వారా నియోజకవర్గ సాగునీరు అవసరాలు తీర్చాలని సీపీఐ, సీపీఐ(ఎం), సీపీఐ ఎంఎల్ మాస్ లైన్, టిడిపి, కాంగ్రెస్, న్యూడెమొక్రసీ ఆధ్వర్యంలో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార, శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఏజెన్సీ తలాపున ప్రవహించే గోదావరి నదీ జలాలు ఏజెన్సీ ప్రాంత సాగునీటి అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వాలని దానివల్ల జిల్లా సస్యశ్యామలమవుతుందని గత పాలకుల చేసిన డిజైన్ మార్పుల వల్ల ఇల్లెందు నియోజకవర్గానికి ఏజెన్సీ ప్రాంతానికి చుక్క సాగు నీరు వచ్చే పరిస్థితి లేదని మంత్రి దృష్టికి తెచ్చారు. సంపుల వల్ల ఏజెన్సీ ప్రాంత రైతాంగం భూములను నష్టపోతున్నారని, సాగునీరు అవసరాలు తీర్చాలని ఆ తరువాతే బయటి ప్రాంతాలకి తీసుకెళ్లాలని తెలిపారు.

## సీపీఐ(ఎం) గ్రామ శాఖల నియామకం

నవతెలంగాణ-దమ్మపేట



మండలంలో సీపీఐ(ఎం) గ్రామ శాఖలను ఎన్నుకున్నట్టు పార్టీ కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పార్టీలో ప్రతీ మూడు సంవత్సరాలకు ఒకసారి జరిగే మహాసభలల్లో భాగంగా సెప్టెంబర్ నెలలో జరగవలసిన పార్టీ గ్రామ శాఖ మహాసభను పురష్కరించుకొని 4 గ్రామాల్లో శాఖా కార్యదర్శులను ఎన్నుకున్నట్టు తెలిపారు. వీటిలో మొద్దులగూడెం శాఖా నూతన కార్యదర్శిగా చెన్నుబోయిన బ్రహ్మయ్య, అల్లిపెంట శాఖ నూతన కార్యదర్శిగా కూరం గోపిరాజు, బొల్లిగట్టు శాఖ నూతన కార్యదర్శిగా పెనుబల్లి లక్ష్మణరావు, శీరాంపురం శాఖా నూతన కార్యదర్శిగా షేక్ జాన్ పాషాలను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని మోరంపూడి తెలిపారు.

## ఫిజియోథెరపీ శిబిరాన్ని సందర్శించిన అధికారులు

నవతెలంగాణ-దమ్మపేట



మండల కేంద్రంలోని దమ్మపేట మండల విద్యా వనరుల కేంద్రంలో ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు జరుగుతున్న ఫిజియోథెరఫీ శిబిరాన్ని ఆర్‌జెడి సత్యనారాయణ రెడ్డి, మండల విద్యాశాఖ అధికారిని కీసరి లక్ష్మిలు మంగళవారం సందర్శించారు. ఫిజియోథెరపిస్ట్ ఎం.ప్రభాకర్ ఆధ్వర్యంలో జరుగుతున్న శిబిరాన్ని సందర్శించిన వారు మాట్లాడుతూ ప్రతీ మంగళవారం విద్యావనరుల కేంద్రంలో జరిగే ఈ ఫిజియోథెరఫీ శిబిరాన్ని మండలంలోని పలు పాఠశాలల ఆవాస ప్రాంతాల్లో గల ప్రత్యేక అవసరాలు గల చిన్నారులు సద్వినియోగం చేసుకునే విధంగా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐఈఆర్పీలు నాగలక్ష్మి, కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

**ఆర్‌జేడీ విచారణ :** వరంగల్ ఆర్‌జెడి మండలంలో పర్యటించి రికార్డులను తనిఖీ చేశారు. మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరావుని విచారణ చేయడానికి గాను ఆర్‌జెడి మంగళవారం మండలానికి విచ్చేశారు. ఈ క్రమంలో అర్జున కాలనీ మండల ప్రజాపరిషత్ పాఠశాలను సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. రిజిస్టర్‌లను పరిశీలించిన ఆర్‌జెడి 3వ తరగి విద్యార్థులతో చదివించారు. విద్యార్థులు మంచిగా చదవడంతో ఆయన మెచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ కీసరి లక్ష్మి, పలువురు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## బాలికపై లైంగికదాడి

**కరకగూడెం :** మండల పరిధిలోని రేగాళ్ల గ్రామ పంచాయతీలోని వీరపురం గ్రామంలో ఘోర సంఘటన చోటు చేసుకుంది. వీరాపురం గ్రామానికి చెందిన వ్యక్తి అదే గ్రామానికి చెందిన బాలిక ఇంట్లోకి వెళ్లి బాలికను తన ఇంటికి ఎత్తుకు పోయి లైంగికదాడికి పాల్పడ్డాడు. తనపై ఈ విషయాన్ని బాలిక తల్లికి చెప్పడంతో బాధితురాలి తల్లి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఘటన వెలుగులోకి వచ్చింది. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఖమ్మం-భద్రాద్రి కొత్తగూడెం
బుధవారం | సెప్టెంబర్ 25, 2024 | www.navatelangana.com

## పొట్టి శ్రీరాములు పేరు మార్చొద్దు

**నవతెలంగాణ-బోనకల్**

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పేరును సురవరం ప్రతాపరెడ్డిగా పేరు మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు చేడే వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ భాష సంయుక్త రాష్ట్రాల కోసం 58 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణత్యాగం చేసిన మహనీయుని పేరుతో ఉన్న తెలుగు విశ్వవిద్యాలయం పేరును మార్చాలనుకోవడం రాష్ట్ర ప్రభుత్వం త్యాగధనులకు ఇచ్చే బహుమతి ఇదేనా అని ప్రశ్నించారు. తమ నిర్ణయాన్ని వెంటనే మార్చుకోవాలని లేనిచో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పోరాటాలు

**నవతెలంగాణ-కారేపల్లి**




ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా సీపీఐ(ఎం) పోరాటాలను రూపకల్పన చేస్తుందని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం కారేపల్లి మండలం గాదెపాడు శాఖ మహాసభ భూక్య లక్ష్మన్ అధ్యక్షతన జరిగింది. ఈసభలో కొండబోయిన నాగేశ్వరరావు మాట్లాడుతూ కాంగ్రెస్ హామీల అమలులో జాప్యం జరుగుతుండటం, పథకాలకు నిబంధనల పేరిట కొర్రి పెడుతుండటంతో ప్రజలలో ప్రభుత్వంపై అనుమానాలు రెకెత్తిస్తుందన్నారు. ప్రజా సమస్య పరిష్కారానికి పోరాటాలే శరణ్యమన్నారు. మహాసభకు ముందు పార్టీ పతాకాన్ని సీనియర్ నాయకులు వీరబోయిన వీరన్న ఆవిష్కరించారు. అనంతరం శాఖ కార్యదర్శిగా ఎండీ.ఇస్మాయిల్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి కే.నరేంద్ర, నాయకులు వజ్జా రామారావు, అజ్మీర శోభన్, రాయల మాధవరావు, యనమగండ్ల శ్రీనివాసరావు, షేక్.సిలార్, భూక్య సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళల ఆర్థిక బలోపేతానికి పథకాలు

**నవతెలంగాణ-కారేపల్లి**

మహిళలను ఆర్థిక బలోపేతానికి సెర్ప్ ఆధ్వర్యంలో పథకాల రూపకల్పన జరుగుతుందని డీఆర్‌డీఏ ఏపీడీమొహమ్మద్ నూరుద్దీన్ అన్నారు. మంగళవారం కారేపల్లి స్త్రీశక్తి భవన్‌లో జరిగిన సమీక్ష సమావేశం ఏపీఎం పీడమర్తి వెంకటేశశ్వర్లు అధ్యతన జరిగింది. ఈ సమావేశంలో ఏపీడీ మాట్లాడుతూ ఇందిరా మహిళ శక్తి పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం స్వయం సహాయక సంఘాల మహిళలు వడ్డి లేని రుణాలు అందజేస్తుందన్నారు. రుణాలు పొందిన మహిళ సభ్యులకు గ్రూపు ఇన్సూరెన్స్ కింద రూ.2 లక్షలు, ప్రమాద బీమాగా రూ.10 లక్షల బీమా కల్పిస్తున్నట్లు తెలిపారు. మహిళలకు అదనపు ఉపాధిలో భాగంగా విద్యార్థుల యూనిఫామ్ కుట్టు పనులను గ్రామ సంఘాలకు అప్పగించడం జరిగిందన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల పథకంలో గ్రామ సమాఖ్య అధ్యక్షులను పాఠశాల యాజమాన్య కమిటీ అధ్యక్షులుగా నియమించి మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా సింగరేణి మండలంలో 900 మంది మహిళా సంఘ సభ్యులకు లబ్ధి చేకూరుతుందన్నారు. రుణాలు తీసుకున్న ప్రతి సభ్యురాలు వివరాలను లోకోష్ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేయడం జరుగుతుందన్నారు. కారేపల్లి మండలం 5 గురు వీవోఏలను విధుల నుండి తొలగించినట్లు తెలిపారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే ఎవరిని సహించేది లేదన్నారు. ఈసమావేశంలో సీసీలు పాల్గొన్నారు.

## డీఆర్వో సురేష్ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

**నవతెలంగాణ-కారేపల్లి**

గుండెపోటుతో మృతి చెందిన పాల్వంచ ఫారెస్టు డీఆర్వో చందావత్ సురేష్ కుటుంబాన్ని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్, డీసీసీ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ లు మంగళవారం పరామర్శించారు. ఖమ్మంలోని సురేష్ స్వగ్రామంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించిన ఎమ్మెల్యే కుటుంబ సభ్యులను ఓదార్చారు. కుటుంబానికి ప్రభుత్వం ద్వారా అందాల్సిన ఎక్స్‌గ్రేషియా అందేలా చూస్తానన్నారు. వీరి వెంట కాంగ్రెస్ నాయకులు బానోత్ రామ్మూర్తి, మేదరి వీర ప్రతాఫ్ (టోనీ), బానోత్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన పాఠశాలల క్రీడలు

**నవతెలంగాణ-ఖమ్మంరూరల్**

మండల పరిధిలోని గొల్లగూడెంలోని గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న మండల స్థాయి పాఠశాలల క్రీడలు మంగళవారం ముగిశాయి. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థల విద్యార్థులు ఈ క్రీడా పోటీల్లో పాల్గొన్నారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. చివరి రోజు ఎంఈఓ శ్రీనివాస్, ఎంపీఓ రాజారావు క్రీడాకారులను పరిచయం చేసుకొని క్రీడలను తిలకించారు. అన్ని పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## లకారం వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు పంపిణీ

**నవతెలంగాణ-ఖమ్మం**

నగరంలోని లకారం వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో లకారం చెరువు ప్రాంతంలో వరద తాకిడి గురై నష్టపోయిన వారికి మంగళవారం నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. క్లబ్ మెంబర్స్ ముందుగా ఒక సర్వే నిర్వహించి ఆ సర్వే ద్వారా నష్టపోయిన కుటుంబాలను గుర్తించి కొంతమందిని ఎంపిక చేశారు. ఒక్కొక్క కుటుంబానికి వెయ్యి రూపాయలు గల నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా వాకర్స్ క్లబ్ మెంబర్స్ డిపిసి రావు ఖాదర్ బాబు, జనార్దన్‌రావు మాట్లాడుతూ వరదల్లో నష్టపోయిన వారికి మానవతా దృక్పథంతో వాళ్లని ఆదుకుంటున్నట్లు వారు తెలిపారు. భవిష్యత్తులో కూడా తమ క్లబ్ సహకారంతో మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లకారం వాకర్స్ క్లబ్ మెంబర్స్ పాల్గొన్నారు.

## విద్యుత్ శాఖలో ప్రమోషన్‌లు

**నవతెలంగాణ-ఎర్రుపాలెం**

వైరా డివిజన్ పరిధిలో గల ఎర్రుపాలెం, మామునూరు విద్యుత్ సబ్ స్టేషన్‌లో పని చేస్తున్న జూనియర్ లైన్‌మెన్‌లకు అసిస్టెంట్ లైన్‌మెన్లుగా ప్రమోషన్ పత్రాలను వైరా డివిజన్ ఆపరేషన్ డిఈ హీరాలాల్ అందజేశారు. ఎర్రుపాలెం సెక్షన్ పరిధిలో పనిచేస్తున్న పగడాల వెంకటేశ్వర్లు (పెద్ద గోపవరం) షేక్ ఆఖిల్ (నరసింహపురం) తాళ్లూరి వంశీకృష్ణ (ఎర్రుపాలెం) మామునూరు సెక్షన్ పరిధిలో పని చేస్తున్న యెర్రం శెట్టి రాజేష్ (ములుగుమాడు), ఆకుల శ్రీనివాసరావు (చొప్పకట్లపాలెం), పెరుమాళ్ళ వెంకటరమణారావు (అయ్యవారిగూడెం) అసిస్టెంట్ లైన్మెన్లుగా పదోన్నతులు పొందారు. ప్రస్తుతం వారు పనిచేస్తున్న స్థానాలలోనే విధులు నిర్వహించవలసి ఉంటుందని తెలిపారు.

## గ్రామపంచాయతీ సిబ్బందికి బీమా సౌకర్యం

**నవతెలంగాణ - బోనకల్**

గ్రామపంచాయతీలలో విధులు నిర్వహిస్తున్న మల్టీపర్పస్ వర్కర్లకు గ్రామ పంచాయతీల ద్వారా పోస్టల్ శాఖ వారిచే బీమా సౌకర్యాన్ని కల్పించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బీమా సౌకర్యం కార్యక్రమాన్ని మంగళవారం లాంఛనంగా ప్రారంభించారు. 22 గ్రామపంచాయతీలలో పనిచేస్తున్న ప్రతి సిబ్బందికి 10 లక్షల బీమా వచ్చే విధంగా పోస్టల్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించారు. ఈ పాలసీ ద్వారా 10 లక్షలు బీమా సౌకర్యం వర్తిస్తుంది. కార్యక్రమంలో ఎంపీడీవో వ్యాకరణం వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రి, ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ జిల్లా మేనేజర్ జగదీష్, గార్లపాడు బీపీఎం ఎస్.కె మహమ్మద్ ఫజల్, లక్ష్మీపురం బిపిఎం, బి.రమ్య ఆళ్లపాడు బిపిఎం కే నాగేశ్వరరావు, పలువురు గ్రామపంచాయతీ మల్టీపర్పస్ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## పైపులైనుల మరమ్మతుల నిర్వహణపై అవగాహనా సదస్సు

**నవతెలంగాణ - బోనకల్**

మిషన్ భగీరథ పైప్‌లైన్‌లో మరమ్మత్తులు నిర్వహణపై చేతిపంపుల రిపేర్‌లపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ అవగాహన సదస్సులో మిషన్ భగీరథ చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్ ఎస్ ఈ సదాశివరావు మాట్లాడారు. 23 నుంచి 26వ తేదీ వరకు మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ మంచినీటి సహాయకులకు, సిబ్బందికి నాలుగు రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు వారు తెలిపారు. పైప్‌లైనుల మరమ్మత్తులు ఎలా చేయాలి, చేతి పంపు రిపేర్ ఎలా చేయాలి, గ్రామ పంచాయతీ మంచినీటి బోర్ మోటర్లపై శిక్షణ, మంచినీటి ల్యాబ్ పరీక్షలపై అవగాహన కల్పించారు. అనుభవజ్ఞులైన వారిచే ఈ శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అవగాహన సదస్సులో మండల తహసిల్దార్ అనిశెట్టి పున్నం చందర్, ఎంపీడీవో వ్యాకరణం వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రి, డిఈ ఎర్ర శ్రీనివాసరావు, ఏఈలు చంద్రశేఖర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## పినపాక తహసీల్దార్‌పై సస్పెన్షన్ వేటు

### ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్

**నవతెలంగాణ-పినపాక**

పినపాక తహసీల్దార్ సూర్యనారాయణపై కలెక్టర్ జితేష్ వి పాటిల్ సస్పెన్షన్ వేటు వేశారు. మండలంలోని పలు గ్రామాలలో కోర్టు వివాదంలో ఉన్న భూములను, వారసత్వ భూములను అక్రమంగా మరొకరికి రిజిస్ట్రేషన్ చేసిన వ్యవహారంలో పలువురు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన కలెక్టర్ తక్షణమే విచారణలో రిజిస్ట్రేషన్ చేసినట్లు తేలడంతో బాధ్యుడైన తహసీల్దార్ సూర్య నారాయణ పైన సస్పెన్షన్ వేటు పడింది. కలెక్టర్ అనుమతులు లేకుండా హెడ్ క్వార్టర్ వదిలి వెళ్ళకూడదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## అగ్ని ప్రమాద బాధితుడికి ఐటీడీఏ సాయం

**నవతెలంగాణ -భద్రాచలం రూరల్**

విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల నిరాశ్రయులైన పోడియం సురేష్ కుటుంబానికి ఐటీడీఏ ట్రైబల్ రిలీఫ్ ఫండ్ నుంచి ఆర్థిక సహాయం అందించినట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అన్నారు. మంగళవారం తన ఛాంబర్ లో మండలంలోని మంగవాయి భడవ గ్రామానికి చెందిన పోడియం సురేష్, సావిత్రి దంపతులు తమకున్న కొద్దిపాటి పొలంలో వ్యవసాయం, కూలి పనులు చేసుకుంటూ తన కుటుంబాన్ని పోషించుకునేవారని, తన రోజువారి కూలీ పనులు, వ్యవసాయం చేసుకోవడానికి పొలం పనులకు వెళ్ళగా అనుకోకుండా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగింది. ఇల్లు పూర్తిగా దగ్ధమై కుటుంబం అంతా నిలువ నీడ లేక నిరాశ్రయులైనరని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఏడి అగ్రికల్చర్ భాస్కర్, పోడియం సురేష్ పాల్గొన్నారు.

# జాతీయ రహదారులతో ఖమ్మం నగరానికి రింగ్ రోడ్డు ఏర్పాటు

- ప్రకాష్ నగర్ బ్రిడ్జి పునరుద్ధరణకు 100 రోజుల సమయం
- నిపుణుల కమిటీ ఆధ్వర్యంలో రిటైనింగ్ వాల్ నిర్మాణానికి నూతన డిజైన్ రూపకల్పన
- నగర ఓఆర్ఆర్‌కు అవసరమైన సర్వీస్ రోడ్ల ఏర్పాటుకు చర్యలు
- విలేకరుల సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**నవతెలంగాణ-ఖమ్మం**

జాతీయ రహదారులతో ఖమ్మం నగరానికి రింగ్ రోడ్డు ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం ఖమ్మం కలెక్టరేట్‌లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వరద ప్రభావిత ప్రాంతాల్లో పునరుద్ధరణ చర్యలు, ఖమ్మం ఓఆర్ఆర్, సర్వీస్ రోడ్ల నిర్మాణం అంశంపై జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌తో కలిసి మంగళవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ కుంభవృష్టి వరదల కారణంగా ఖమ్మం జిల్లా తీవ్రంగా దెబ్బతిందని, జిల్లా కలెక్టర్ అధ్యక్షతన వరద ప్రభావిత ప్రాంతాల్లో పునరావాస చర్యలు చేపట్టి సాధారణ పరిస్థితులు పునరుద్ధరించడంలో అధికారులు సఫలీకృతులయ్యారని, విద్యుత్తు, తాగునీటి సరఫరా మొదలగు వసతులను వేగవంతంగా పునరుద్ధరించడం జరిగిందని తెలిపారు. వరదల కారణంగా ప్రకాష్ నగర్ బ్రిడ్జి యథాస్థితి కోల్పోయి పక్కకు జరిగిందని, పిల్లర్లకు ఎటువంటి ఇబ్బంది లేకపోయినా స్లాబ్ పక్కకు జరిగిందని, రోడ్లు భవనాల శాఖ మంత్రితో మాట్లాడి వైజాగ్‌కు చెందిన నిపుణుల కమిటీతో పరిశీలన జరిపామని, బ్రిడ్జిలో మొత్తం 24 స్పాన్‌లలో 9 పక్కకు జరిగాయని, హై లెవెల్ కమిటీ సమావేశంలో ఈ పనులను సంబంధిత కాంట్రాక్టర్లకు అప్పగించామని, దీని పునరుద్ధరణకు మరో 100 రోజుల సమయం పడుతుందని మంత్రి తెలిపారు.

గతంలో ఎప్పుడు మున్నేరు నది చరిత్రలో 42 అడుగులు వరద వచ్చిన రికార్డు లేదని, దీనికి అనుగుణంగా నిపుణుల కమిటీ ఇచ్చే రిటైనింగ్ వాల్ రీ డిజైనింగ్ చేయిస్తున్నామని మంత్రి తెలిపారు. ఖమ్మం నగరంలోకి వచ్చిన డ్రైయిన్ నీరు మళ్లీ నదిలోకి ఎలా వెళ్లాలి అనేది సర్వే చేస్తున్నామని అన్నారు. వెయ్యి కోట్లకు పైగా నిధులతో ఖమ్మం- కోదాడ 31 కిలోమీటర్ల జాతీయ రహదారి పూర్తి చేస్తామని, అదే విధంగా ఖమ్మం, దేవరపల్లి జాతీయ రహదారి ఉగాది వరకు పూర్తి చేస్తామని తెలిపారు. మంచిర్యాల, వరంగల్, ఖమ్మం, అమరావతి జాతీయ రహదారి, సూర్యాపేట, ఖమ్మం, రాజమండ్రి జాతీయ రోడ్ల మధ్యలో 6 కిలో మీటర్ల మిగులుతుందని, దీనిని కూడా 120 కోట్లు మంజూరు చేసి జాతీయ రహదారి అమరావతి రోడ్డుకు కలుపుతున్నామని, దీనితో ఖమ్మం నగరానికి ఔటర్ రింగ్ రోడ్డు రూపుదిద్దుకుంటుందని అన్నారు. ఖమ్మం ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్ల నిర్మాణానికి సంబంధించి సమగ్ర చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ప్రకాష్ నగర్ బ్రిడ్జి పునరుద్ధరణ పనులకు ప్రజలు సహకరించాలని, పనులు పూర్తయ్యే వరకు బ్రిడ్జిపై ఎవరిని అనుమతించబోమని అన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రోడ్లు భవనాల శాఖ పరిధిలో 750 కోట్ల నష్టం జరిగిందని, వీటిని తాత్కాలికంగా పునరుద్ధించేందుకు 25 కోట్లు మంజూరు చేస్తామని, వెంటనే పనులు చేపట్టి పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

తెల్ల రేషన్ కార్డులేని రైతులకు రుణమాఫీ పథకం అమలు చేసేందుకు రైతు కుటుంబాల నిర్ధారణ సర్వే చేపట్టామని, దీని ప్రకారం అర్హులకు రుణమాఫీ పథకం వర్తింప చేస్తామని మంత్రి తెలిపారు. రెండు లక్షల పైన ఉన్న రైతులకు షెడ్యూల్ ఇస్తామని అన్నారు. వరద నష్టం కింద కేంద్ర ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ఎటువంటి సహాయం అందలేదని, కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రిని కలిసి ప్రతిపాదనలు సమర్పించామని అన్నారు.

విలేకరుల సమావేశంలో సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ, అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్, ఇరిగేషన్ సిఇ విద్యాసాగర్, ఆర్అండ్‌బి సిఇ మోహన్ నాయక్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పదవులు కాదు స్థలాలు ముఖ్యం

### మండలాల్లోనూ ఈ ప్రక్రియ చేపట్టాలి..

### తక్షణమే జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు మంజూరు చేయాలి

- జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే టీడబ్ల్యూజేఎఫ్ లక్ష్యం
- టీడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం జిల్లా కమిటీ సమావేశం నిర్ణయాలు



**నవతెలంగాణ-ఖమ్మం**

ఖమ్మం నగర పరిధిలోని జర్నలిస్టులకు వెంటనే ఇండ్ల స్థలాలు మంజూరు చేయాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ఖమ్మం జిల్లా కమిటీ (టీ.డబ్ల్యూ.జే.ఎఫ్) విజ్ఞప్తి చేసింది. మంగళవారం ఖమ్మం మంచికంటి ఫంక్షన్ హాలులో సంఘం జిల్లా కమిటీ సమావేశంలో చేసిన తీర్మానాలను అధ్యక్ష, కార్యదర్శులు పల్లా కొండలరావు, కార్యదర్శి కొత్తపల్లి శ్రీనివాసరెడ్డిలు ప్రకటించారు. ఖమ్మం జిల్లా కేంద్రంతో పాటు మండల కేంద్రాల్లో కూడా అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ఇండ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరారు. ఖమ్మం జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీలో రూ.1100 రుసుం వసూలు చేసిన ప్రతి జర్నలిస్టుకు రశీదులు ఇవ్వాలని, సభ్యుల లిస్ట్ బహిరంగంగా ప్రకటించాలని కోరారు. హౌసింగ్ సొసైటీలో పదవుల కోసం తమ సంఘం వెంపర్లాడటం లేదని, జర్నలిస్టుల ప్రయోజనాల కోసం తమ సంఘం ఎలాంటి సహాయ సహకారాలు అందించేందుకు అయినా సిద్ధమని స్పష్టం చేశారు. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు మంజూరు చేయించేందుకు కృషి చేయాలని కమిటీ ఏకగ్రీవంగా అభిప్రాయపడింది. ఖమ్మం నగరంలో సొసైటీలో సభ్యత్వం ఉన్న ప్రతి జర్నలిస్టుకూ ఇండ్ల స్థలం ఇవ్వాలన్నారు. ఈ విషయంలో స్తంభాద్రి హౌసింగ్ సొసైటీ పారదర్శకంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. తమ సంఘంకు పదవులకన్నా ఇండ్ల స్థలాలు మంజూరు మాత్రమే ముఖ్యమని తెలిపారు. ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు పల్లా కొండలరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజశేఖర్, కోశాధికారి తేనె వెంకటేశ్వర్లు, గరిడేపల్లి వెంకటేశ్వర్లు, సాతుపాటి రామయ్య, జక్కంపూడి కృష్ణ, బాలకృష్ణ, బోయినపల్లి అంజయ్య, మోహన్‌రావు, నాగుల్ మీరా, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు అందజేయాలని వినతి

**నవతెలంగాణ-కామేపల్లి**

మండలంలో పనిచేస్తున్న జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ కామేపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు తెల్లబోయిన రాము ఆధ్వర్యంలో ఇల్లందు నియోజకవర్గ ఎమ్మెల్యే కోరం కనకయ్యకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జర్నలిస్టులు చిలుముల శ్రీనివాస్, రమేష్, రాయల బిక్షమయ్య, కోర్రా గోపి, బండి గురునాథ్, గుండ్ల సుధాకర్, మేకల మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

### శిక్షణా తరగతుల బ్రోచర్ ఆవిష్కరణలో ఏఎస్పీ అంకిత్ కుమార్ సంక్వార్

**నవతెలంగాణ-దుమ్ముగూడెం**

జర్నలిజం పట్ల ఆసక్తితో పాత్రికేయ వృత్తిలోకి వచ్చిన ప్రతి జర్నలిస్టు వృత్తి శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని భద్రాచలం ఏఎస్‌పి అంకిత్ కుమార్ సంక్వార్ అన్నారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అక్టోబర్ 26, 27 తేదీలలో భద్రాచలం పట్టణంలో నిర్వహించే పాత్రికేయుల వత్తి శిక్షణ తరగతుల కరపత్రలను మంగళవారం ఆయన చాంబర్లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిజం వృత్తి బాధ్యతాయుతం అయిందని అన్నారు. జర్నలిస్టు రాసే ప్రతి వార్త సమాజానికి అద్దం పట్టేలా ఉండాలని, మానవీయ కోణమైన వార్తలు, ఇన్వెస్టిగేషన్ వార్తలతోనే జర్నలిజం విలువలు పెంచుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి కర్ర అనిల్ రెడ్డి, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పూదోట సూరిబాబు, గుండెబోయిన వెంకటేశ్వర్లు, రాష్ట్ర నాయకులు డి రవికుమార్, జిల్లా నాయకులు పుష్పగిరి తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మీదేవిపల్లి పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ

**నవతెలంగాణ-లక్ష్మీదేవి పల్లి**

ఎస్పీ రోహిత్ రాజు లక్ష్మీదేవిపల్లి పోలీస్ స్టేషన్‌ను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో నమోదైన పలు కేసులు వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అధికారులకు సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో నేరాలు జరగకుండా నిత్యం పెట్రోలింగ్ చేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. నేర విచారణలో జాప్యం జరగకుండా బాధితులకు సత్వర న్యాయం చేకూరేలా బాధ్యతగా పనిచేయాలని సూచించారు. సామాన్య ప్రజానికానికి ఇబ్బందులు కలిగే విధంగా ప్రవర్తించే ఆకతాయిల పట్ల కఠినంగా వ్యవహరించాలని సూచించారు. అదే సమయంలో పోలీస్ స్టేషన్‌కు వచ్చిన బాధితులను వారి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తూ మద్యం సేవించి వాహనాలను నడిపే వాహనదారులపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం సిబ్బంది సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చుంచుపల్లి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై రమణారెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

## పంట నమోదు తప్పనిసరి :

### జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు

**నవతెలంగాణ-మణుగూరు**

రైతులు తమ పంట వివరాలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు అన్నారు. మంగళవారం మణుగూరు మున్సిపాలిటి పరిధిలోని అన్నారం గ్రామంలో ఆయన పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతు భరోసాలో భాగంగా రైతులకు క్వింటాకు 500 రూపాయాల బోనస్ ఇస్తుందని అన్నారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకునేందుకు తప్పనిసరిగా తమ వంట వివరాలను వ్యవసాయ అధికారుల వద్ద నమోదు చేసుకోవాలని తెలిపారు. ఆన్లైన్ ద్వారా పంట నమోదు జరిగిన రైతుల మాత్రమే ప్రభుత్వ పథకాలకు అర్హులు అవుతారాని అన్నారు. రైతులు సాగుచేస్తున్న అన్ని వంటల వివరాలను అధికారులకు అందజేయాలని సూచించారు. త్వరలో డిజిటల్ క్రాఫ్ సర్వే కార్యక్రమం చేపడతామని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ వ్యవసాయాధికారి చటర్జీ, సహాయ వ్యవసాయాధికారి కోమరం లక్ష్మణరావు రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం మన బాధ్యత

### ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎం.వెంకటేశ్వర్లు

### కోర్టు ఆవరణలో స్వచ్ఛభారత్...

**నవతెలంగాణ-భద్రాచలం రూరల్**

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రతి పౌరుడు తప్పకుండా స్వచ్ఛభారత్ కార్యక్రమాలలో పాల్గొని పరిశుభ్రమైన భారతం నిర్మించేందుకు కృషి చేయాలని ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ వెంకటేశ్వర్లు కోరారు. మంగళవారం డిస్ట్రిక్ లీగల్ సర్వీసెస్ అథారిటీ వారి ఆదేశానుసారం భద్రాచలం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోర్టు ఆవరణలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మెజిస్ట్రేట్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దోమలను నివారించే సీజనల్ వ్యాధుల నుండి మనల్ని మనం కాపాడుకునే అవకాశం ఉంటుందని అన్నారు. జాతిపిత మహాత్మా గాంధీ స్పూర్తితో కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న స్వచ్ఛభారత్ కార్యక్రమాలలో ప్రతి పౌరుడు పాల్గొనాలని కోరారు. సామాజిక సేవ కార్యక్రమాలలో పాల్గొనడం ద్వారా మనుషులు పరివర్తనం చెంది నేరాల వైపు పయనించారని ఆయన అభిప్రాయపడ్డారు. అనంతరం సబ్ జైలుని సందర్శించి విచారణ ఖైదీలతో మాట్లాడి సబ్ జైల్లో ఉన్న వసతుల గురించి ఆరా తీశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు టీ.చైతన్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీనివాస్, న్యాయవాదులు, కోర్టు కాంస్టేబులు కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నాయకుడిపై దాడి

**నవతెలంగాణ-అశ్వారావుపేట**

భూ వ్యవహారంలో కలుగజేసుకుంటున్నాడని ఒక కాంగ్రెస్ నాయకుడిపై దాడి జరిగింది. బాధితుడు సత్యనారాయణ చౌదరి ఫిర్యాదు మేరకు ఎస్‌హెచ్‌ఓ ఎస్ఐ యయాతి రాజు తెలిపిన వివరాలు ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. అశ్వారావుపేటకు చెందిన కాంగ్రెస్ నాయకుడు సత్యనారాయణ చౌదరి మంగళవారం తహశీల్దార్ కార్యాలయం నుండి మూడు రోడ్లు ప్రధాన కూడలికి చేరుకోగానే పేలాయి గూడెంనకు చెందిన గుర్రాల సాయి కారును అడ్డగించి మా భూమి విషయంలో ఎందుకు కలుగ జేసుకుంటున్నావంటూ దాడికి పాల్పడ్డాడు. బాధితుడి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

## కేబుల్ నెట్‌వర్క్ వారు పడే ఇబ్బందులే "కేబుల్ రెడ్డి" మూవీ

### చిత్ర బృందానికి లంచ్ ఆఫర్ చేసిన కాపు సీతాలక్ష్మి

**నవతెలంగాణ-కొత్తగూడెం**

సుహాస్ హీరోగా తెరకెక్కనున్న చిత్రాన్ని పారిశ్రామిక ప్రాంతం అయిన కోల్ బెల్టు ఏరియాలో చిత్రీకరించడం అభినందనీయమని కొత్తగూడెం మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి అన్నారు. గత కొన్నిరోజులుగా కొత్తగూడెం కార్మిక ప్రాంతం రుద్రంపూర్ పరిసర ప్రాంతాల్లో నిర్మాణం జరుపుకుంటున్న కేబుల్ నెట్‌వర్క్ వారు పడే ఇబ్బందులే "కేబుల్ రెడ్డి" మూవీ చిత్ర బృందాన్ని చైర్ పర్సన్ కలిసి పలకరించారు. చిత్రం వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారిని మంగళవారం వారి ఇంటికి లంచ్‌కి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేబుల్ రెడ్డి హీరో సుహాసిని మర్యాద పూర్వకంగా కలిసి బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని సినిమాలలో నటించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కేబుల్ రెడ్డి హీరో డైరెక్టర్ శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ డిష్ టీవీలు ఎక్కువ అయ్యాయని, కేబుల్ నెట్ వర్క్ అంతరించిపోతున్నందున ఒక మధ్యతరగతి కేబుల్ నెట్ వర్క్ ఓనర్ పడే కష్టాలు ఎలా ఉంటాయో తెలియజేస్తూ సినిమాను అందరూ కుటుంబ సమేతంగా చూసే విధంగా రూపొందిస్తున్నామని వివరించారు.

## పరిసరాల పరిశుభ్రత సామాజిక బాధ్యత

### జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి

**నవతెలంగాణ-కొత్తగూడెం**

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి సూచించారు. జిల్లా కోర్టు ఆవరణలో మంగళవారం స్వచ్ఛ భారత్ కార్యక్రమంను నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం మనందరి సామాజిక బాధ్యత అని తెలిపారు. కోర్టు ఆవరణలో ఉన్న చెత్తను న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది తొలగించారు. కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ మాట్లాడుతూ మహాత్మా గాంధీ చూపిన మార్గం అందరికీ ఆదర్శప్రాయమని ఆయనను స్మరించుకుంటూ ప్రతి సంవత్సరం గాంధీ జయంతి సందర్భంగా జిల్లా కోర్టు ఆవరణలో స్వచ్ఛ భారత్ కార్యక్రమంను నిర్వహించుకోవడం మంచి పరిణామం అని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బత్తుల రామారావు, ఏపీపీలు పివిడి లక్ష్మి, ఎస్.లావణ్య, విశ్వశాంతి, నాగలక్ష్మి లాడ్స్ ఊటుకూరి పురుషోత్తమరావు, కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ, ఉపాధ్యక్షులు తోట మల్లేశ్వరరావు, ఏపూరి బాబురావు, కటికం పుల్లయ్య అనుబ్రోలు రాంప్రసాదరావు, పిట్టల రామారావు, మల్లెల ఉషారాణి, మెండు రాజమల్లు, న్యాయశాఖ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఉద్యోగులు రామిశెట్టి రమేష్, లగడపాటి సురేష్, మీనా కుమారి, ప్రమీల, కృష్ణ కుమారి, యాధా రమణ, సిస్టమ్ ఆఫీసర్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## నికర లాభాల నుండి కార్మికులకు లాభాలు ప్రకటించాలి

**నవతెలంగాణ-కొత్తగూడెం**

సింగరేణి సంస్థ ఆర్జించిన నికర లాభాల నుండి కార్మికులకు లాభాల వాటా ప్రకటించాలని టీబీజీకెఎస్ రాష్ట్ర చీఫ్ జనరల్ సెక్రటరీ కాపు కృష్ణ సింగరేణి యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం టిజిబికెఎస్ ఆధ్వర్యంలో సింగరేణి సంస్థ సాధించిన నికర లాభం రూ.4701 కోట్లపై ప్రకటించిన 33 శాతం వాటా ఇవ్వాలని, సింగరేణిపై రాష్ట్ర ప్రభుత్వ రాజకీయ జోక్యం తగ్గించాలని అన్ని మైన్స్ డిపార్ట్మెంట్స్ వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రూ.4701 కోట్లు నికర లాభం ప్రకటించి ప్రభుత్వం రూ.2289 కోట్లు సంస్థ డెవలప్ మెంట్‌కు అనిచెప్పి పక్కన పెట్టడం రూ.2412 కోట్లలో 33 శాతం ఇస్తామనడం ప్రభుత్వ ద్వంద వైఖరికి నిదర్శనమని విమర్శించారు. రూ.4701 కోట్లలో 33 శాతం కార్మికులకు పంపకం చేయగా మిగిలిన 67 శాతం మాత్రమే సంస్థ డెవలప్ మెంటుకు వాడాలన్నారు. గతంలో ఎప్పుడూ లేనిది కొత్త వరవడితో, కొంత అమౌంట్ పక్కన పెట్టడం కార్మికుల కష్టార్జితాన్ని దోచుకోవడమే అని ఆరోపించారు. ఈ నిరసన కార్యక్రమంలో టీబీజీకెఎస్ నాయకులు తుమ్మ శ్రీనివాస్, రాసూరి శంకర్, విజయ్, వెంకటేశ్వర్లు, సూరజ్, రాజ్ కుమార్, గణేష్, రాజేందర్, వెంకట్రావు, పూర్ణ, కార్మికులు పాల్గొన్నారు.

## రామచంద్ర కళాశాలలో ఘనంగా ఎన్ఎస్ఎస్ డే

**నవతెలంగాణ-కొత్తగూడెం**

శ్రీరామచంద్ర ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ డేని పురస్కరించుకొని ఎన్ఎస్ఎస్ దినోత్సావాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ కె. వనజ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాల్వంచ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.పద్మ, అసోసియేట్ ప్రొఫెసర్ ఆఫ్ ఎకనామిక్స్ డాక్టర్ వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వనజ మాట్లాడారు. ఎన్ఎస్ఎస్ డే ప్రాముఖ్యతను వివరించారు. నిస్వార్థమే లక్ష్యంగా సేవ చేసే "యూనిఫామ్ లేని సైనికులే ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు" అని అభివర్ణించారు. పాల్వంచ కాలేజీ ప్రిన్సిపల్ పద్మ మాట్లాడుతూ సమాజ సేవలో ఎన్ఎస్ఎస్ అనేది చాలా ప్రాముఖ పాత్రను పోషిస్తుందని, కళాశాలలో జరిగే అభివృద్ధి కార్యక్రమాలలో, స్వచ్ఛత కార్యక్రమాలలో పిల్లలు ఉత్సాహంగా పాల్గొనాలని కోరారు. ప్రొఫెసర్ వెంకటేశ్వర్లు ఎన్ఎస్ఎస్ నినాదము "నేను కాదు... మీరు" ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పి.సునీత, డాక్టర్. అనూరాధ, డాక్టర్ పూర్ణ చందర్ రావు, డాక్టర్ విద్యాప్రవీణ, తదితర కాలేజి సిబ్బంది, ఇతరులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ పరిహారమందాలి

- ఖమ్మం వరద ముంపు ప్రాంతాల్లో మంత్రి పొంగులేటి పర్యటన



నవతెలంగాణ-ఖమ్మం రూరల్

మున్నేరు వరదముంపు ప్రాంతాలైన ఖమ్మం రూరల్ మండలంలోని రాజీవ్ గృహకల్ప, జలగం నగర్ ప్రాంతాల్లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంగళవారం పర్యటించారు. వరద బాధితులను పరామర్శించి వారి సంక్షేమం గురించి అడిగి తెలుసుకున్నారు. వరద సహాయక చర్యలు, ప్రభుత్వ సాయం గురించి ఆరా తీశారు. కొందరు వరద బాధితులు తమకు ప్రభుత్వం నుంచి ఇచ్చే సాయం అందలేదని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. అధికారులను పిలిచి వాస్తవంగా ఇండ్లు నీట మునిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సాయం అందాలని, మరోసారి ఇంటింటి సర్వే చేపట్టి అర్హులను గుర్తించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. అనర్హులకు ఒక్కరికి కూడా పరిహారం అందడానికి వీలులేదని హెచ్చరించారు. వీధులన్నీ శుభ్రం చేసి దుర్వాసన రాకుండా బ్లీచింగ్ చల్లాలని సూచించారు. వరద ముంపు ప్రాంత ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడటమే కాకుండా ప్రభుత్వ సాయం అందేలా కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ మధుసూదన్‌నాయక్, ఆర్డీఓ గణేశ్, తహసీల్దార్ రాంప్రసాద్, ఎంపీడీఓ కుమార్, ఎంపీఓ రాజారావు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 38 కాలేజీల్లో బీఎఫ్ఎస్ఐ కోర్సు

(మొదటిపేజీ తరువాయి)

18. ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ, కరీంనగర్ 19. తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం, కోఠి, 20. గిరిరాజ్ ప్రభుత్వ కాలేజీ, నిజామాబాద్

### 18 ఇంజినీరింగ్ కాలేజీలు

1. బీవీఆర్ఐటి హైదరాబాద్ ఇంజినీరింగ్ కాలేజీ (జేఎన్టీయూహెచ్), 2. జి నారాయణమ్మ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (జేఎన్టీయూహెచ్), 3. గోకరాజు రంగరాజు ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కాలేజీ (జేఎన్టీయూహెచ్), 4. జెబి ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కాలేజీ (జేఎన్టీయూహెచ్), 5. జేఎన్టీయూ కూకట్‌పల్లి ప్రధాన ప్రాంగణం (జేఎన్టీయూహెచ్), 6. కేశవ్ మెమోరియల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (జేఎన్టీయూహెచ్), 7. మహాత్మా గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (జేఎన్టీయూహెచ్), 8. వర్ధమాన్ ఇంజినీరింగ్ కాలేజీ (జేఎన్టీయూహెచ్), 9. వల్లూరుపల్లి నాగేశ్వరరావు విజ్ఞాన జ్యోతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (జేఎన్టీయూహెచ్), 10. కిట్స్ వరంగల్ (కేయూ), 11. చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఓయూ), 12. మాతృశ్రీ ఇంజనీరింగ్ కాలేజీ (ఓయూ), 13. మాటూరి వెంకట సుబ్బారావు ఇంజినీరింగ్ కాలేజీ (ఓయూ), 14. మెథడిస్ట్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కాలేజీ (ఓయూ), 15. ఉస్మానియా విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కాలేజీ (ఓయూ), 16. స్టాన్లీ మహిళా ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కాలేజీ (ఓయూ), 17. ఆర్జీయూకేటీ బాసర, 18. బివి రాజు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, నర్సాపూర్ (జేఎన్టీయూహెచ్).

## పిడుగుపాటుకు భద్రాద్రిలో ఇద్దరు మృతి

- ఒకరి పరిస్థితి విషమం
- పలు జిల్లాల్లో పశువులు మృత్యువాత




నవతెలంగాణ-దమ్మపేట/విలేకరులు

రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో ఉరుములు మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తుండటంతో పిడుగులుపడి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇద్దరు మృతిచెందగా, ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. రంగారెడ్డి, ఆదిలాబాద్ జిల్లాల్లో గేదెలు, లేగదూడలు మృత్యువాతపడ్డాయి. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలంలోని జగ్గారం గ్రామంలో అరటితోటలో పనిచేస్తున్న కూలీలపై పిడుగుపడటంతో ఇద్దరు మృతిచెందారు. ఐదుగురి పరిస్థితి విషమంగా ఉంది. మండల పరిధిలోని జగ్గారం గ్రామంలో కౌలు రైతు రవిరాజు తోటలో వ్యవసాయ పనులకు పలువురు గిరిజన కూలీలు వెళ్లారు. కాగా, మధ్యాహ్న సమయంలో ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురుస్తుండటంతో కూలీలు బయటకు పరుగులు తీశారు. రోడ్డుపై ఆటో కోసం వేచిచూస్తుండగా వారి సమీపంలో పిడుగు పడడంతో కట్టం రాజు-వెంకటమ్మ దంపతుల కమార్తె కట్టం నాగశ్రీ(16), సున్నం వెంకటేష్-సుశీల దంపతుల కుమార్తె సున్నం అనూష(23) అక్కడికక్కడే మృతిచెందారు. రాజమ్మ, సీతమ్మ, రత్తమ్మ అనే ముగ్గురు మహిళా కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి. ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. సీతమ్మ పరిస్థితి విషమంగా ఉండటంతో ఖమ్మం తరలించారు. రంగారెడ్డి జిల్లాలో పిడుగుపాటుకు మూడు పాడి ఆవులు మృత్యువాత పడ్డాయి. యాచారం మండలం మాల్ అనుబంధ గ్రామం కిషన్‌పల్లిలో రైతు కలకొండ నరసింహ తన పొలం వద్ద ఆవులను కట్టేశాడు. సోమవారం అర్ధరాత్రి పిడుగు పడటంతో రెండు ఆవులు మృత్యువాత పడ్డాయి. వాటి విలువ రూ.1.50 లక్షలు ఉంటుందని రైతు తెలిపారు. కొందుర్గు మండలం తంగళ్లపల్లి గ్రామంలో పశువుల కొట్టం పైన పిడుగుపడి పాడి ఆవు మృత్యువాత పడింది. రూ.లక్ష వరకు నష్టం జరిగిందని బాధిత రైతు గొల్ల లింగం తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా లోకేశ్వరం మండలంలో పిడుగుపడి రెండెద్దులు, లేగదూడ మృత్యువాతపడ్డాయి.

## చింతల్ నార్ అడవుల్లో ఎన్‌కౌంటర్

- ఇద్దరు మావోయిస్టులు మృతి

నవతెలంగాణ-చర్ల

సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లాలోని చింతల్‌నార్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చింతవాగు నది ఒడ్డున ఉన్న అటవీ-కొండల్లో పోలీసులు, మావోయిస్టులకు మధ్య జరిగిన కాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చింతల్‌నార్ పోలీస్ స్టేషన్ క్యాంప్ ముకరం నుంచి డిస్ట్రిక్ట్ ఫోర్స్, డీఆర్జీ, బస్తర్ ఫైటర్, 206 కోబ్రా వాహిని సంయుక్తంగా.. మావోయిస్టు పార్టీ వ్యతిరేక ఆపరేషన్ కోసం కర్కన్‌గూడ పరిసర ప్రాంతాలకు బయలుదేరింది. చింతవాగు నది ఒడ్డున ఉన్న అటవీ-కొండల్లో తారసపడిన మావోయిస్టులతో పోలీసులకు మధ్య సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు ఎదురుకాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు మృతిచెందగా, సంఘటనాస్థలంలో భారీ మొత్తంలో మావోయిస్టు డంప్‌ను పోలీసులు గుర్తించారు. భద్రతా దళాల పెట్రోలింగ్ పార్టీ సురక్షితంగా శిబిరానికి తిరిగి వచ్చిందని సుకుమా ఎస్పీ కిరణ్ చౌహాన్ తెలిపారు.

# ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

**జిల్లాల్లో సమావేశాలు నిర్వహించి భవిష్యత్ కార్యాచరణ**

- పెండింగ్ డీఏలను విడుదల చేయాలి
- సీఎం రేవంత్‌రెడ్డితో సమావేశాన్ని ఏర్పాటు చేయాలి
- 51 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించాలి
- తెలంగాణ ఉద్యోగ జేఏసీ డిమాండ్
- 101 మందితో కార్యవర్గం ఏర్పాటు
- కోదండరామ్‌కు ఆత్మీయ సన్మానం
- సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా : ఎమ్మెల్సీ




నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ఉద్యోగ జేఏసీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. అన్ని జిల్లా కేంద్రాల్లో 15 రోజుల్లో సమావేశాలను నిర్వహించి భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామని తెలిపింది. పెండింగ్‌లో ఉన్న కరువు భత్యం (డీఏ)ను విడుదల చేయాలని కోరింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉద్యోగ జేఏసీ నాయకులను పిలిచి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేసింది. మంగళవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ఉద్యోగ జేఏసీ విస్తృతస్థాయి సమావేశాన్ని చైర్మెన్ మారం జగదీశ్వర్ అధ్యక్షతన నిర్వహించారు. 205 భాగస్వామ్య సంఘాల నాయకులు పాల్గొన్నారు. 101 మందితో ఉద్యోగుల జేఏసీ పూర్తిస్థాయి కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పనిచేసి ఇప్పుడు ఎమ్మెల్సీగా ఎన్నికైన కోదండరామ్‌ను ఆత్మీయ సన్మానం చేశారు. ఉద్యోగులకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా కోదండరామ్ పనిచేయాలని కోరారు. అనంతరం ఉద్యోగ జేఏసీ చైర్మెన్ మారం జగదీశ్వర్, సెక్రెటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు సమావేశంలో చేసిన తీర్మానాలను మీడియాకు విడుదల చేశారు. 2022, జులై ఒకటి నుంచి పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలు, ఈ ఏడాది జులై ఒకటి నుంచి కలిపితే మొత్తం ఐదు డీఏలను విడుదల చేయాలనీ, బకాయిలను నగదు రూపంలో చెల్లించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల బిల్లులను మంజూరు చేయాలని కోరారు. ఈ-కుబేర్ వ్యవస్థను రద్దు చేయాలనీ, ట్రెజరీ శాఖ ద్వారా బిల్లులను మంజూరు చేసే పాత విధానాన్ని పునరుద్ధరించి ఉద్యోగులకు ఇవ్వాలని తెలిపారు. అన్ని ఉద్యోగుల సంఘాలతో సంప్రదింపులు, చర్చలు ఇప్పటికే పూర్తయిన దృష్ట్యా ధరల పెరుగుదల ప్రకారం 51 శాతం ఫిట్‌మెంట్‌తో రెండో పీఆర్సీ నివేదికను తెప్పించుకుని అమలుకు చర్యలు వేగవంతం చేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వం, లబ్దిదారులు/ఉద్యోగులు, పెన్షనర్ల సమాన సహకారంతో ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఈహెచ్ఎస్)ను అమలు చేయాలని కోరారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్)ను రద్దు చేయాలనీ, పాత పెన్షన్ స్కీం (ఓపీఎస్)ను అమలు చేయాలని వివరించారు. 317 జీవోను సమీక్షించి బాధితుల బదిలీల కోసం ఉద్యోగులు కోరుకునే ఖాళీల లభ్యత కోసం అడగకుండా, వీలైనంత త్వరగా వెబ్‌సైట్ ద్వారా లేవనెత్తిన అన్ని ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకుని పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల జేఏసీ జిల్లాస్థాయి కమిటీలను ఏర్పాటు చేస్తామని తెలిపారు.

### 101 మందితో ఉద్యోగ జేఏసీ కార్యవర్గం

తెలంగాణ ఉద్యోగ జేఏసీ చైర్మెన్‌గా మారం జగదీశ్వర్, కోచైర్మెన్‌గా చావ రవి, వి రవీందర్‌రెడ్డి, జి సదానందంగౌడ్, జి జ్ఞానేశ్వర్, మణిపాల్‌రెడ్డి, పి మధుసూదన్‌రెడ్డితోపాటు సచివాలయ ఉద్యోగుల సంఘం నుంచి ఒకరు, వైస్ చైర్మెన్లుగా 21 మంది, సెక్రెటరీ జనరల్‌గా ఏలూరి శ్రీనివాసరావు, అడిషనల్ సెక్రెటరీ జనరల్‌గా పి శ్రీపాల్‌రెడ్డి, డిప్యూటీ సెక్రెటరీ జనరల్‌గా ముగ్గురు, ఫైనాన్స్ కార్యదర్శిగా కె వెంకటేశ్వర్లు, ప్రచార కార్యదర్శి బి శ్యామ్, కార్యదర్శులుగా 22 మంది, సంయుక్త కార్యదర్శులుగా 12 మంది, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా ఇద్దరు, కార్యవర్గ సభ్యులుగా 29 మందిని కలిపి మొత్తం 101 మంది కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

### ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తా : కోదండరామ్

ఉద్యోగుల పెండింగ్ సమస్యల పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తానని ఎమ్మెల్సీ కోదండరామ్ అన్నారు. ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. 'తెలంగాణ ఉద్యమంలో ఉద్యోగులతోపాటు అన్ని వర్గాలు ఐక్యంగా పోరాడాయి. రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత పదేండ్ల పాలనలో గత ప్రభుత్వం ఉద్యోగులతోపాటు ప్రజలను వంచించింది. సమస్యలను చెప్పుకునే పరిస్థితులు కూడా లేని నిర్బంధ వాతావరణం కల్పించింది. బలిదానాలు, త్యాగాలను కనుమరుగు చేసేందుకు గత పాలకులు ప్రయత్నించారు. అయినా ప్రజలు వారిని తరిమి కొట్టి కొత్త ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో నిర్బంధాలు లేవు, ఫోన్ ట్యాపింగ్‌లు లేవు. ప్రజాస్వామ్య వాతావరణం ఉంది. అయితే ప్రభుత్వం కూడా ఆర్థిక ఇబ్బందుల్లో ఉంది. లక్షల కోట్ల అప్పులు మెడపై ఉన్నాయి. రూ.40 వేలకు కోట్లకు పైగా వివిధ రకాల పెండింగ్ బిల్లులు చెల్లించాల్సి ఉంది. వాటన్నింటిని సమన్వయం చేసుకుంటూ అందరికీ న్యాయం చేసేందుకు ప్రయత్నిస్తా. ఉద్యోగులు సైతం మంచి వాతావరణంలో న్యాయబద్ధమైన డిమాండ్లను సర్కార్ ముందుంచాలి. ప్రభుత్వంతో మధ్యవర్తిగా చర్చలు జరిపి, వాటి పరిష్కారానికి తన వంతు పాత్ర పోషిస్తాను'అని కోదండరామ్ అన్నారు.

### సమస్యల పరిష్కారంపై దృష్టిపెట్టాలి : మారం జగదీశ్వర్

కొత్త ప్రభుత్వం వచ్చిన తొమ్మిది నెలల్లోనే ఉద్యోగులకు సంబంధించిన కొన్ని సమస్యలను పరిష్కరించిందనీ, అదే క్రమంలో పెండింగ్‌లో ఉన్న మిగతా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మెన్ మారం జగదీశ్వర్ కోరారు. 317 జీవో వల్ల ఉద్యోగులు చిన్నాభిన్నమయ్యారనీ, వారికి న్యాయం చేయాలని కోరారు. పెండింగ్ బిల్లులు రాక ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారనీ, దాదాపు రూ.నాలుగు వేల కోట్లు రావాల్సి ఉందని చెప్పారు. వాటిని దశల వారీగా ఇప్పించాలని సూచించారు. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్ అమలు చేస్తామంటూ కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. ఉద్యోగులు తమ సామాజిక బాధ్యతగా ఒక రోజు మూల వేతనం రూ.130 కోట్లు విరాళంగా ఇచ్చారని గుర్తు చేశారు.

# లెబనాన్‌లో మారణకాండ

- ఇజ్రాయిల్ దాడుల్లో 558కి పెరిగిన మృతులు
- ఆరోగ్యమంత్రిత్వ శాఖ వెల్లడి
- ప్రపంచ నేతల ఆందోళన

**బీరుట్, గాజా :** సోమ, మంగళవారాల్లో లెబనాన్‌పై ఇజ్రాయిల్ సాగించిన రాక్షస దాడుల్లో మృతుల సంఖ్య 558కి పెరిగింది. వీరిలో 50మంది చిన్నారులు, 94మంది మహిళలు వున్నారు. మరోవైపు ఖాన్ యూనిస్ నగరంలో జరిపిన తాజా దాడిలో ఏడుగురు మరణించారని గాజాలోని పాలస్తీనా అధికారులు తెలిపారు. గాజాలో హమాస్‌పై దాడులు ఆరంభించినప్పటి నుండి లెబనాన్‌తో కూడా ఇజ్రాయిల్ ఘర్షణ పడుతూనే వస్తోంది. సోమవారం దక్షిణ, తూర్పు లెబనాన్‌ల్లో వందలాది స్థావరాలపై వైమానిక దాడులకు తెగబడింది. లెబనాన్ ఆరోగ్య శాఖ మంత్రి ఫిరాజ్ అబిద్ విలేకర్లతో మాట్లాడుతూ, సోమవారం తెల్లవారు జామునుండి కొనసాగుతున్న దాడుల్లో ఇప్పటివరకు 1835మంది గాయపడ్డారని, వారందరినీ 54 ఆస్పత్రుల్లో చేర్పించినట్లు తెలిపారు. దాడుల నేపథ్యంలో దక్షిణ లెబనాన్ ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో సురక్షిత ప్రాంతాలకు తరలిపోతున్న వేలాది నిర్వాసిత కుటుంబాలు బీరుట్‌లో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన శిబిరాల్లో రాత్రి తలదాచుకున్నారు.

అక్కడ కూడా ఆశ్రయం దొరకని వారు కారుల్లో, పార్కుల్లో రోడ్ల పక్కనా, బీచ్‌ల్లో పడుకున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో బీరుట్‌లో ఖాళీగా వున్న గ్యాస్ స్టేషన్ వద్ద నిర్వాసితుల కోసం వలంటీర్లు వండి పెట్టారు. తమ ఇళ్లలో తల దాచుకోవాల్సిందిగా కోరుతూ అనేకమంది సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. మంగళవారం కూడా దాడులు చోటు చేసుకున్న నేపథ్యంలో నిత్యావసరాల కొరత ఏర్పడుతుందనే భయంతో తూర్పు ప్రాంత నగరమైన బాల్‌బెక్‌లో బేకరీలు, గ్యాస్ స్టేషన్ల వద్ద పెద్ద సంఖ్యలో ప్రజలు బారులు తీరి నిలుచోవడం కనిపిస్తోంది.

మరోవైపు ఇజ్రాయిల్‌లో 8చోట్ల తాము క్షిపణులను, రాకెట్లను ప్రయోగించామని హిజ్బుల్లా తెలిపింది. సరిహద్దుకు 60 కిలోమీటర్ల దూరంలో గల పేలుడు పదార్థాల ఫ్యాక్టరీపై కూడా దాడి చేసినట్లు తెలిపింది. ఉత్తర ఇజ్రాయిల్‌పై ఉదయం నుండి వంద వరకు రాకెట్లు పడ్డాయని ఇజ్రాయిల్ మిలటరీ మంగళవారం ప్రకటించింది.

### ప్రపంచ నేతల భయాందోళనలు

మధ్య ప్రాచ్యంలో తాజా పరిణామాల పట్ల ప్రపంచ నేతలు తీవ్ర భయాందోళనలు వ్యక్తం చేశారు. వీటివల్ల అనూహ్యమైన పర్యవసానాలు తలెత్తే ప్రమాదముందని హెచ్చరించారు. తక్షణమే ఉద్రిక్తతలు సమసిపోయేందుకు చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. లెబనాన్, ఇజ్రాయిల్ మధ్య గల విభజన రేఖ బ్లూ లైన్ పొడవునా, ఆక్రమిత గోలన్ హైట్స్‌లో నెలకొన్న పరిస్థితుల పట్ల ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటానియో గుటెరస్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. పెద్ద సంఖ్యలో అమాయకులు మరణించడంపై ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే దౌత్య మార్గాలకు మళ్ళాల్సిన అవసరం వుందని గుటెరస్ ప్రతినిధి స్టీఫెన్ దుజారిక్ పేర్కొన్నారు. పూర్తి స్థాయి యుద్ధాన్ని ప్రస్తుత తరుణంలో ఏ దేశమూ, ప్రజలు భరించలేరని అన్నారు.

ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల కార్యాలయం ప్రతినిధి రవీనా షామ్‌దాసాని మాట్లాడుతూ, పౌర లక్ష్యాలు, సైనిక లక్ష్యాల మధ్య తేడాను గుర్తించాలని అంతర్జాతీయ మానవతా చట్టాలు స్పష్టంగా చెబుతున్నాయని, కానీ వాటిని ఎక్కడా ఎవరూ పాటించడం లేదని ఆవేదన వ్యకం చేశారు. యునిసెఫ్ డైరెక్టర్ కేథరిన్ రొసెల్ మాట్లాడుతూ ఈ ఘర్షణల్లో లెక్కలేనంత మంది చిన్నారులు ప్రాణాలు కోల్పోవడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు.

## బొడిగె లక్ష్మయ్య భౌతికకాయం బీబీనగర్ ఎయిమ్స్‌కు అప్పగింత

- నివాళులర్పించిన నవతెలంగాణ సీజీఎం పి.ప్రభాకర్, ఎడిటర్ ఆర్.సుధాభాస్కర్, ఇతర సిబ్బంది



నవతెలంగాణ-హైదరాబాద్ బ్యూరో,రామన్నపేట

అనారోగ్య కారణాలతో సోమవారం రాత్రి హైదరాబాద్‌లో మరణించిన సీనియర్ న్యాయవాది, ఐలు రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు బొడిగె లక్ష్మయ్య భౌతికకాయాన్ని ఆయన కుమారులు సుందరయ్య, బసవపున్నయ్య, కుమార్తె ఉదయం, ఇతర కుటుంబ సభ్యులు బీబీనగర్‌లోని ఎయిమ్స్‌కు అందజేశారు. మంగళవారం ఉదయం ఆయన భౌతికకాయాన్ని కుటుంబ సభ్యులు స్వగ్రామమైన భువనగిరి జిల్లా శోభనాద్రిపురానికి తరలించారు. బంధువులు, మిత్రులు, శ్రేయోభిలాషుల సందర్శనార్థం మధ్యాహ్నం ఒంటి గంట వరకు అక్కడే ఉంచారు. ఈ సందర్భంగా నవతెలంగాణ సీజీఎం పి.ప్రభాకర్, ఎడిటర్ ఆర్.సుధాభాస్కర్ లక్ష్మయ్య భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, ఐలుకు ఆయన అందించిన సేవలను వారు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. బసవపున్నయ్యను, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. నివాళులర్పించిన వారిలో నవతెలంగాణ ఎడిటోరియల్ బోర్డు సభ్యులు, సీనియర్ ఫొటో జర్నలిస్ట్ కె.నరహరి, జనరల్ మేనేజర్లు లింగారెడ్డి, రఘు, నరేందర్ రెడ్డి, ఉపేందర్, స్టేట్ బ్యూరో చీఫ్ బీ.వీ.ఎన్.పద్మరాజు, స్టేట్ బ్యూరో రిపోర్టర్లు గుడిగె రఘు, ఎస్.వెంకన్న, ఎ.ప్రశాంత్, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి సైదులు, ఐఎఫ్‌డబ్ల్యూజే సీనియర్ నేత బి.ఆనందం, టీడబ్ల్యూ జేఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మామిడి సోమయ్య తదితరులున్నారు. అనంతరం భౌతికకాయాన్ని బీబీనగర్ ఎయిమ్స్‌కు చెందిన అంబులెన్స్‌లో అక్కడి వైద్య కళాశాలకు తరలించారు. కాగా లక్ష్మయ్య రెండో కుమారుడు బసవపున్నయ్య నవతెలంగాణ ఎడిటోరియల్ బోర్డు మెంబర్‌గా టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సేవలందిస్తున్న సంగతి తెలిసిందే. ఆయన కోడలు కల్పన టీఎస్‌యూటీఎఫ్‌లో క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారు.

### ఐలు రాష్ట్ర కమిటీ సంతాపం

బొడిగె లక్ష్మయ్య మరణం పట్ల ఐలు రాష్ట్ర కమిటీ సంతాపాన్ని ప్రకటించింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు విద్యాసాగర్, రాష్ట్ర అధ్యక్షులు కొల్లి సత్య నారాయణ, ప్రధాన కార్యదర్శి పార్థసారథి ఒక ప్రకటన విడుదల చేశారు. చనిపోయిన తర్వాత లక్ష్మయ్య భౌతికకాయాన్ని ఎయిమ్స్‌కు అప్పజెప్పడం గొప్ప విషయమని ప్రశంసించారు. ఇలాంటి నిర్ణయాన్ని న్యాయవాదులు ఆదర్శంగా తీసుకోవాలని వారు కోరారు.

# పేదోళ్లను రోడ్డున పడేస్తున్నారు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గతేడాది అసెంబ్లీ ఎన్నికల్లో హైదరాబాద్ ప్రజలు కాంగ్రెస్‌కు ఓటేయలేదనే కారణంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇక్కడి జనాలపై పగబట్టారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే హైడ్రా పేరుతో పేదోళ్లను రోడ్డున పడేస్తున్నారని ఆయన వాపోయారు. మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శేరిలింగంపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ... సీఎం రేవంత్‌రెడ్డి హైడ్రా పేరిట హడావుడి చేస్తున్నారని విమర్శించారు. ఈ విషయంలో సీఎం అన్నకు ఒక న్యాయం? పేదోళ్లకు మరో న్యాయమా? అని ప్రశ్నించారు. అక్రమ నిర్మాణాల కూల్చివేతలపై ముఖ్యమంత్రికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే ముందు వాటికి అనుమతులు ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో అలాంటి నిర్మాణాలకు అసలు పర్మిషన్ ఇచ్చిందే కాంగ్రెస్ అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ పార్టీ అధికారంలో ఉన్నప్పుడే నాగార్జున ఎన్ కన్వెన్షన్‌కు అనుమతులు వచ్చాయని గుర్తు చేశారు. నిబంధనల పేరిట పేదోళ్ల ఇండ్లను కూల్చేస్తామంటే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. పార్టీ ఫిరాయింపుల నేపథ్యంలో శేరిలింగంపల్లిలో ఉప ఎన్నిక ఖాయమని కేటీఆర్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గట్టి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

### బీసీ నేతలతో భేటీ...

బీఆర్ఎస్‌కు చెందిన పలువురు బీసీ ప్రజా ప్రతినిధులు, మాజీ ఎమ్మెల్యేలతో కేటీఆర్ మంగళవారం భేటీ అయ్యారు. తమిళనాడులో బీసీల సంక్షేమం, వారి అభివృద్ధికి అమలవుతున్న పథకాలు, కార్యక్రమాలపై అధ్యయనానికి పార్టీకి చెందిన నాయకులు త్వరలోనే ఆ రాష్ట్రంలో పర్యటిస్తారని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో పార్లమెంటులో బీఆర్ఎస్ డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర, మండలిలో ఆ పార్టీ నేత సిరికొండ మధుసూదనాచారి, మాజీ మంత్రులు శ్రీనివాసగౌడ్, జోగు రామన్న తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలనలో ప్రజల సమస్యలు పట్టవా..?

- విష జ్వరాల నుంచి ప్రజలను కాపాడాలి
- రైతు భరోసాను వెంటనే అమలు చేయాలి
- అర్హులైన వారందరికీ రుణమాఫీ చేసి ఇండ్ల స్థలాలివ్వాలి :సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి




నవతెలంగాణ- మిర్యాలగూడ

రాష్ట్రంలో ప్రజా పాలన సాగుతోందని గొప్పలు చెప్పుకునే కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు.. ఆచరణలో మాత్రం ప్రజలెదుర్కొంటున్న సమస్యలు పట్టించుకోవడం లేదని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి విమర్శించారు. మంగళవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడలోని ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అనేక సమస్యలతో ప్రజలు సతమతమవుతున్నారని, పారిశుధ్యం లోపించి విష జ్వరాలు, టైఫాయిడ్, మలేరియా, డెంగ్యూ జ్వరాల బారినపడి అల్లాడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విష జ్వరాల నుంచి ప్రజలను కాపాడాలని, ప్రభుత్వాస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. ప్రయివేటు ఆస్పత్రుల్లో వైద్య దోపిడీని అరికట్టాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో మొబైల్ వైద్య బృందాలను పంపించి పేద ప్రజలకు వైద్య సేవలందించాలని కోరారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో సురక్షితమైన మంచినీరు అందించాలని, పంటలు ఎండిపోకుండా సాగునీరు ఇవ్వాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం కార్మికులకు అన్యాయం చేసే విధంగా కొత్తగా తీసుకొచ్చిన నాలుగు కార్మిక వ్యతిరేక కోడ్‌లను ఉపసంహరించుకునేలా కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాలన్నారు. కనీస వేతన చట్టం అమలయ్యేలా చూడాలని కోరారు. రాష్ట్రంలో ఇంకా 30 శాతం మంది రైతులకు రుణమాఫీ కాలేదని, అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలని అన్నారు. ప్రస్తుతం వ్యవసాయ సీజన్ కొనసాగుతోందని, రైతు భరోసా కింద పెట్టుబడి సహాయం ఇవ్వకపోవడంతో అప్పుల కోసం రైతులు ప్రయివేటు వడ్డీవ్యాపారులను ఆశ్రయిస్తున్నారని, వెంటనే ఆర్థిక సాయం చేయాలని కోరారు. గత ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు వృథాగా ఉన్నాయని, వాటిని లబ్దిదారులకు అందజేయాలని కోరారు. మిర్యాలగూడ, నల్లగొండ ప్రాంతాల్లో అంతర్గత డ్రయినేజీ అస్తవ్యస్తంగా ఉందని, దాని ఫలితంగా మురుగునీరు రోడ్లపై చేరి ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారని, తక్షణమే డ్రయినేజీ పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. అరులైన వారందరికీ, జర్నలిస్టులకు రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, జిల్లా కమిటీ సభ్యులు రవి నాయక్, డాక్టర్ మల్లు గౌతమ్ రెడ్డి, రాగిరెడ్డి మంగారెడ్డి, వరలక్ష్మి, ఎండీ అంజాద్, లక్ష్మీనారాయణ, దయానంద తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి సీతక్కను కలిసిన మధ్యాహ్న భోజన కార్మికులు



నవతెలంగాణ - ముస్తాబాద్

రాష్ట్రంలో ఉన్న మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని మంత్రి సీతక్కను కలిసి విన్నవించినట్టు సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల మధ్యాహ్న భోజన కార్మికుల అధ్యక్షురాలు సంతోషి తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలంటే మార్కెట్‌లో పెరుగుతున్న నిత్యవసర వస్తువుల ధరలకు అనుగుణంగా మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రతి విద్యార్థిపై డబ్బులు పెంచాలని, నెలనెలా గౌరవ వేతనం వచ్చేలా చూడాలని కోరారు. హరే రామ హరే కృష్ణ ట్రస్ట్‌కు మధ్యాహ్నం భోజనం అప్పగించవద్దని మంత్రిని కోరినట్టు తెలిపారు. సమస్యలన్నింటినీ పరిష్కరించేలా చేసేలా కృషి చేస్తానని మంత్రి మాట ఇచ్చినట్టు చెప్పారు.

## ఈ చిట్కాలు పాటిద్దాం..

వంట చేసే క్రమంలో కొంతమంది పాత్రలపై మూత పెట్టరు. మరికొంతమంది సగం వరకే పెట్టి వదిలేస్తారు. ఇది కూడా వంట ఆలస్యమవడానికి, ఎక్కువ పొగ వెలువడడానికి కారణమవుతుంది. మూత పెట్టకుండా వండుకోవడం వల్ల 20 శాతం అదనంగా ఇంధనం వాడాల్సి వస్తుందని పలు అధ్యయనాలు చెబుతున్నాయి.



కొంతమంది స్టౌపై చిన్న పాత్రల్ని ఉపయోగి స్తుంటారు. దీనివల్ల మంట వెలిగించినప్పుడు గ్యాస్.. గిన్నె అడుగు భాగం దాటి పక్కకు రావడం గమనిస్తుంటాం. ఇంధనం వృథా అవడానికి, కిచెన్‌లో కాలుష్యం పెరగడానికి ఇదీ ఓ కారణమే! ఇలా జరగకూడదంటే పెద్ద పాత్రలు ఉపయోగించడం, చిన్న పాత్రల కోసం ఇండక్షన్ స్టౌ వాడడం.. వంటివి చక్కటి ప్రత్యామ్నాయం. తద్వారా కిచెన్‌లో వేడి కూడా తక్కువగా ఉత్పత్తవుతుంది.

కొంతమంది కాయగూరలు త్వరగా ఉడకాలన్న ఉద్దేశంతో.. ముందు వాటిని నీళ్లలో వేసి ఉడికించడం, అవసరం ఉన్నా లేకపోయినా నీళ్లు వేడి చేయడం.. వంటివి చేస్తుంటారు. దీనివల్ల కూడా అటు గ్యాస్ వృథా! ఇటు వాయువులూ వెలువడ తాయి. పైగా ఈ ప్రక్రియ వల్ల కాయగూరల్లోని పోషకాలూ నశిస్తాయి. అలా జరగకూడదంటే వాటిని చిన్న ముక్కలుగా కట్ చేసుకొని వండుకోవడం ఉత్తమం. అలాగే నీళ్ల మరిగించడానికి ఎలక్ట్రానిక్ కెటిల్ చక్కటి ప్రత్యామ్నాయం!

ఆహారాన్ని మాటిమాటికీ వేడి చేయడం ఆరోగ్యకరం కాదు! పైగా దీనివల్ల కూడా గ్యాస్ వృథా అవుతుంది. తద్వారా పర్యావరణానికీ నష్టమే!

# శ్రీలంక నవ ప్రధాని హరిణి



**వచ్చిన ప్రతి అవకాశాన్ని అందిపుచ్చుకుంటూ వివిధ రంగాల్లో దూసుకుపోతున్న మహిళలు మన చుట్టూ ఎందరో ఉన్నారు. కొన్ని రంగాల్లో మొదటి అడుగు వేసి భావి తరాల్లో స్ఫూర్తినింపుతున్న వారూ ఉన్నారు. మంచి ఉద్యోగాలను వదులుకొని తమ జీవితాన్ని ప్రజలకే అంకితం చేస్తున్నవారూ ఉన్నారు. ఆ కోవకే చెందుతారు హరిణి అమరసూర్య. శ్రీలంకలో కొత్తగా ఏర్పడిన కమ్యూనిస్టు ప్రభుత్వంలో ఆ దేశ ప్రధానిగా ప్రమాణస్వీకారం చేశారు. సిరిమావో బండారు నాయకే తర్వాత ఆ దేశానికి మూడో మహిళా ప్రధానిగా, తన పార్టీ తరపున ఎన్నికైన మొదటి మహిళగా చరిత్ర సృష్టించిన ఆమె పరిచయం క్లుప్తంగా నేటి మానవిలో...**

శ్రీలంక రాజధాని కొలంబోలో 1970 మార్చి 6న పుట్టిన హరిణి యూనివర్సిటీ ఆఫ్ ఎడిన్‌బర్గ్ నుండి సోషల్ ఆంత్రోపాలజీలో పీహెచ్‌డీ పట్టా పొందారు. మొదటి నుండి అభ్యుదయ భావాలు కలిగిన ఆమె హక్కుల కార్యకర్తగా శ్రీలంకలో ఎంతో కృషి చేశారు.

### గణనీయమైన సేవలు

హరిణి లింగ అసమానతలు, శిశు సంరక్షణ, నిరుద్యోగం, దేశ విద్యావ్యవస్థలో లోపాలు వంటి అనేక అంశాలపై పరిశోధన చేసి పలువురి ప్రశంసలు అందుకున్నారు. స్వలింగ సంపర్కుల సమస్యలపై కూడా గళం విప్పారు. అలాగే యువత, రాజకీయాలు, వివక్ష, అభివృద్ధి, రాష్ట్ర - సమాజ సంబంధాలు, పిల్లల రక్షణ, ప్రపంచీకరణ - అభివృద్ధిపై అనేక పుస్తకాలు సైతం రచించారు. చాలా ఏండ్లు పిల్లల రక్షణ కోసం కూడా ఎన్నో సేవలు అందించారు. ఆమె శ్రీలంకలో సామాజిక న్యాయం, విద్యకు గణనీయమైన కృషి చేశారు. శ్రీలంక ప్రభుత్వేతరసంస్థ నెస్ట్ డైరెక్టర్ల బోర్డులో సభ్యురాలిగా కూడా ఈమె ఉన్నారు.



### రాజకీయ జీవితం కోసం...

2019లో ఆమె నేషనల్ ఇంటెలెక్చువల్స్ ఆర్గనైజేషన్‌లో చేరారు. అలాగే 2019 శ్రీలంక అధ్యక్ష ఎన్నికల సమయంలో ఎన్‌పీపీ అభ్యర్థిగా అనుర కుమార దిసనాయకే తరపున ప్రచారం చేశారు. శ్రీలంక ఓపెన్ యూనివర్సిటీలోని సోషల్ స్టడీస్ విభాగంలో సీనియర్ లెక్చరర్‌గా పని చేస్తూ 2020లో నేషనల్ పీపుల్స్ అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఆ పార్టీతో కలిసి పని చేశారు. శ్రీలంక 16వ పార్లమెంటులో ప్రవేశించడానికి జేజేబి జాతీయ జాబితా అభ్యర్థిగా నామినేట్ అయ్యారు. దాంతో ఓపెన్ యూనివర్సిటీలో అకడమిక్ సీనియర్ లెక్చరర్‌గా తన సేవను కొనసాగించాలా వద్దా అనే దానిపై తీవ్రంగా ఆలోచించారు. చివరకు సమాజ సేవకే ఆమె అంకితమవ్వాలనే నిర్ణయానికి వచ్చారు. తన రాజకీయ జీవితాన్ని కొనసాగించేందుకు ఓపెన్ యూనివర్సిటీ సీనియర్ లెక్చరర్ పదవికి రాజీనామా చేశారు.

### మహిళా పురోగతికి...

తన జీవితాన్ని ప్రజా సేవకే అంకితం చేసిన హరిణి నేడు ప్రధానిగా బాధ్యతలు చేపట్టడం రాజకీయాల్లో మహిళలకు పురోగతిని సూచించడమే. అంతే కాకుండా ప్రగతిశీల నాయకత్వం, సంస్కరణపై ఎన్‌పీపీ దృష్టి ఎలాంటిదో రుజువు చేస్తోంది. ఇప్పుడు శ్రీలంకకు మూడో ప్రధానిగా హరిణి నిలిచారు. శ్రీలంక ఫ్రీడమ్ పార్టీకి చెందిన బండారునాయకే తొలి మహిళా ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. మొత్త మూడు సార్లు ప్రధానిగా బాధ్యతలు చేపట్టి ప్రపంచంలో ఆ పదివిని అధిరోహించిన మొదటి మహిళగా ఆమె ఖ్యాతికెక్కారు. ఆ తర్వాత 1994లో చంద్రికా కుమారతుంగ ప్రధానిగా రెండు నెలలు కొనసాగారు.

### కీలక బాధ్యతల్లో...

24 సెప్టెంబరు 2024న 54 ఏండ్ల హరిణితో శ్రీలంక 16వ ప్రధానమంత్రిగా అధ్యక్షుడు అనుర కుమార దిసానాయకే ప్రయాణ స్వీకారం చేయించారు. ఇలా ఆమె తన పార్టీకి మొదటి ప్రధానమంత్రిగా, సిరామావో బండారునాయకే, చంద్రికా కుమారతుంగ తర్వాత ఆ పాత్రను నిర్వహించిన మూడవ మహిళగా రికార్డు బద్దలు కొట్టారు. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నలుగురు సభ్యులతో కూడిన శ్రీలంక మంత్రి వర్గం నిన్ననే కొలువు తీరింది. ఇందులో హరిణి ప్రధానితో పాటు ఆమెకు న్యాయ, విద్య, కార్మిక, పరిశ్రమలు, సైన్స్ అండ్ టెక్నాలజజీ, ఆరోగ్యం, పెట్టుబడులు వంటి కీలకమైన మంత్రిత్వ బాధ్యతలు అప్పగించారు.




## రన్నింగ్ పూర్తి చేసిన వెంటనే..

శరీరాన్ని ఫిట్‌గా ఉంచుకోవడానికి రన్నింగ్ చాలా ఉపయోగకరమని నమ్ముతాం. ప్రతి రోజూ ఉదయం పూట పార్కు లేక ఫుట్‌పాత్‌పై పరుగులు తీస్తుంటారు. ఇది అద్భుతమైన వ్యాయామం. మీరు ప్రతిరోజూ 20 నుంచి 30 నిమిషాలు పరిగెత్తినట్ల యితే, అది మీ గుండె, మొత్తం ఆరోగ్యానికి ప్రయోజనకరం. కానీ ఆ సమయంలో కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. ఎందుకంటే కొన్ని తప్పులు మనిషి ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయి.



### హాయిగా కూర్చోవడం మానుకోండి

చాలా సేపు పరిగెత్తిన వ్యక్తులు అలసిపోయినట్టు అనిపిస్తే... వెంటనే కూర్చోవడం లేదా మంచం మీద పడుకోవడం, విశ్రాంతి తీసుకోవడం చేస్తుంటారు. కానీ ఇలా అస్సలు చేయకూడదు. పరుగెత్తిన వెంటనే విశ్రాంతి లేదా నిద్రపోకూడదు. లాంగ్ రన్నింగ్ అనేది ఒక రకమైన హై ఇంటెన్సిటీ వర్కవుట్, కాబట్టి రన్నింగ్ తర్వాత శరీరంలో రక్త ప్రసరణ, హృదయ స్పందన రేటు అధికంగా ఉంటుంది. ఇది సాధారణ స్థితికి రావటానికి సమయం పడుతుంది. ఇలా చేయడం వల్ల మైకం లేదా గుండెకు సంబంధించిన వ్యాధులకు గురయ్యే అవకాశం ఉంటుంది. అందువల్ల, మీరు అకస్మాత్తుగా పరుగును ఆపి విశ్రాంతి తీసుకోకండి. ఇలా కాకుండా నెమ్మదిగా నడవడం.. లేదా తేలికపాటి వ్యాయామం చేయడం వంటివి ప్రారంభించండి.

### శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచుతాయి

పరుగు తర్వాత, శరీరానికి శక్తి, హైడ్రేషన్ రెండూ అవసరం. అందువల్ల తగినంత నీరు తాగాలి. ఇది శరీరాన్ని హైడ్రేట్ గా ఉంచడంలో సహాయపడుతుంది. లేదంటే.. మీరు ఎలక్ట్రోలైట్ పానీయాన్ని కూడా తీసుకోవచ్చు. ప్రతిరోజూ హై ఇంటెన్సిటీ వర్కవుట్ చేస్తుంటే.. ఆరోగ్యంపై పూర్తి శ్రద్ధ వహించండి. ఆహారంలో కార్బోహైడ్రేట్లు, ప్రోటీన్లు అధికంగా ఉండే ఆహారాన్ని చేర్చండి. ఇది కండరాల పునరుద్ధరణ, శక్తికి సహాయపడుతుంది.

## తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం స్ఫూర్తిదాయకం



(మొదటిపేజి తరువాయి)

కడుపు కాలిన ప్రతి ఒక్క రైతూ, నిరుపేద ప్రజలు అందరూ కలిసికట్టుగా పోరాటం నిర్వహించారని తెలిపారు. ఇంతటి గొప్ప పోరాటాన్ని రాష్ట్రంలో కొన్ని రాజకీయ పార్టీలు తమ స్వార్థం కోసం ఉపయోగించుకుంటున్నాయని ఆరోపించారు. కేవలం నిజాం నవాబుకు వ్యతిరేకంగా హిందువులు పోరాటం నిర్వహించారని బీజేపీ అసత్య ప్రచారం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీకి, ఈ పోరాటానికి ఎలాంటి సంబంధం లేదని, కేవలం ప్రజల మధ్య మత విద్వేషాలను రెచ్చగొట్టేందుకే ఇలాంటి వైఖరి బీజేపీ తీసుకున్నదని తెలిపారు. దీన్ని కమ్యూనిస్టు పార్టీలు, ప్రజాస్వామికవాదులు తిప్పి కొట్టాలని సూచించారు. ఈ పోరాట దినోత్సవాన్ని కాంగ్రెస్ అధికారికంగా నిర్వహించడంలో తన దొంగ వైఖరి అవలంబిస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) శేరిలింగంపల్లి నాయకులు శోభన్, కృష్ణ, మధుసూదన్ రావు, సీతారామయ్య, మాణిక్యం, సుందరయ్య విజ్ఞాన కేంద్రం నిర్వాహకులు సాంబశివరావు, అనిల్, విజయ్‌కుమార్, రవి పాల్గొన్నారు.

## రూల్స్ మార్పు ప్రభావాన్ని వివరించండి

(మొదటిపేజి తరువాయి)

ప్రకారం సమాంతర రిజర్వేషన్లు అమలు చేయాలని పిటిషనర్ లాయర్ కోరారు. అదేవిధంగా 1:50 నిష్పత్తిలో ప్రిలిమ్స్ నుంచి మెయిన్స్‌కు పిలవాలని కోరారు. అన్ని దశల్లో ఆర్టిలాంటికల్ రిజర్వేషన్లను అమలు చేయాలని కోరారు. హైకోర్టు జోక్యం చేసుకుంటూ సర్వీసు వ్యవహారాలపై సింగిల్ జడ్జి విచారించాలనీ, డివిజన్ బెంచ్ వద్దకు పిటిషన్ ఎలా వచ్చిందని ప్రశ్నించింది. విచారణను 25కు వాయిదా వేసింది.

## అప్రమత్తంగా ఉండాలి

(మొదటిపేజి తరువాయి)

వాపోయారు. అలాంటి శక్తులను కట్టడి చేసేలా బందోబస్తు పెంచాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఎంతో కాలంగా సఖ్యతతో నివసిస్తున్న ముస్లిం, ఆదివాసీ ప్రజల మధ్య వైషమ్యాలు రెచ్చగొట్టే మూకలపై కఠిన చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ..ఆదివాసీ, మైనార్టీ ప్రజల మధ్య విభేదాలు తలెత్తడం పట్ల విచారం వ్యక్తం చేశారు. సమస్య మూలాల గుర్తించి పరిష్కరిస్తామని హామీనిచ్చారు. ఆదివాసీలకు ప్రత్యేక చట్టాలున్నందున వాటిని మైనార్టీలు గౌరవించాలని సూచించారు. కొంత మంది యువకులు చేస్తున్న చేష్టలను చూపి మైనార్టీల పట్ల వ్యతిరేక భావనను కలిగించేందుకు కొన్ని దుష్టశక్తులు ప్రయత్నిస్తున్న తీరును ఎండగట్టారు. ఇలాంటి విషయాలపై మైనార్టీ యువతకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆదివాసీ చట్టాలను, మహిళలను గౌరవించేలా ప్రార్థనా మందిరాల్లో అవగాహనా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఏజెన్సీ ఏరియాల్లో, వెనకబడిన ప్రాంతాల్లో పదేండ్లుగా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లేనందున ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నిరుద్యోగ సమస్యను అడ్డంపెట్టుకుని యువతను కొన్ని శక్తులు తమ స్వార్థ రాజకీయాల కోసం వాడుకుంటున్న తీరును వివరించారు. వాటి పట్ల తమ ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని హెచ్చరించారు. ఏదైనా సమస్య తలెత్తితే శాంతియుతంగా నిరసన తెలపాలి తప్ప చట్టాన్ని ఎవ్వరూ చేతుల్లోకి తీసుకోవద్దని హితవు పలికారు. స్థానిక ప్రజల మధ్య సఖ్యతతో ఉంటేనే అభివృద్ధి సాధ్యమవు తుందన్నారు. షబ్బీర్ అలీ మాట్లాడుతూ.. ఆదివాసీలు, ముస్లింల మధ్య నెలకొన్న అపనమ్మకాన్ని పోగొట్టేలా ఇరుపక్షాల పెద్దలతో త్వరలో ఉమ్మడి సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపారు. త్వరలో సీఎంతో ఇరు పక్షాలను సమావేశ పరుస్తా మన్నారు. మత రాజకీయాల పట్ల తమ ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోందని స్పష్టం చేశారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్ మాట్లాడుతూ ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఆదివాసీ ఏరియాభివృద్ధిలో, శాంతిని నెలకొల్పడంలో మైనార్టీ సోదరులు సహకరించాలని కోరారు.

## అలాంటి వ్యక్తి గవర్నరా..?

(మొదటిపేజి తరువాయి)

'ఈ గవర్నర్ రాజ్యాంగం పేరిట ప్రమాణస్వీకారం చేశారు. మన రాజ్యాంగంలో లౌకికతత్వం అనేది ఓ భాగమని నేను అనుకుంటున్నాను. రాజకీయాల నుంచి మతాన్ని వేరు చేయడం మన రాజ్యాంగంలో భాగమే. మన రాజ్యాంగం విదేశీ భావన అని రేపు ఆయన చెబుతారు. అది ఆర్‌ఎస్‌ఎస్ అవగాహన. తమిళనాడు వంటి ముఖ్యమైన రాష్ట్రానికి అలాంటి వ్యక్తిని గవర్నరుగా నియమించడం సిగ్గుచేటు' అని అన్నారు.

### రవి ఏమన్నారు?

లౌకికతత్వం అనేది యూరోపియన్ భావన అని, అది భారత్‌కు చెందినది కాదని తమిళనాడు గవర్నర్ రవి సోమవారం చేసిన వ్యాఖ్య దుమారం రేపింది. కన్యాకుమారిలోని తిరువత్తూర్‌లో జరిగిన హిందూ ధర్మ విద్యా పీఠం సదస్సును ఉద్దేశించి ఆయన ప్రసంగిస్తూ 'ఈ దేశంలో ప్రజలకు అనేక మోసాలు జరిగాయి. లౌకికతత్వంపై వారికి తప్పుడు అర్థం చెప్పడం అందులో ఒకటి. లౌకికతత్వం అంటే ఏమిటి? అది యూరోపియన్ భావన. భారతీయ భావన కాదు' అని చెప్పారు. దేశంలో లౌకికతత్వం అవసరమే లేదని కూడా అన్నారు. వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం తమిళనాడు గవర్నర్ రవికి ఇదేమీ కొత్త కాదు. ఈ దేశాన్ని విచ్ఛిన్నం చేయాలని ప్రయత్నిస్తున్న వ్యక్తులు లౌకికతత్వానికి వక్ర భాష్యం చెబుతున్నారని గతేడాది ఆయన చెప్పారు.

### ప్రతిపక్షాల ఆగ్రహం

రవి వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేత చిదంబరం స్పందిస్తూ ఫెడరలిజం, ఒకే దేశం ఒకే ఎన్నిక, ప్రజాస్వామ్యానికి కూడా ఇదే లాజిక్ వర్తిస్తుందా అని ప్రశ్నించారు. ఇవన్నీ యూరప్ నుంచి వచ్చినవేనని గుర్తు చేశారు. ఫెడరలిజం యూరోపియన్ భావన అని, అలాంటప్పుడు దానికి భారత్‌లో స్థానం లేదని ప్రకటించగలమా అని నిలదీశారు. జమిలి ఎన్నికలు, ప్రజాస్వామ్యం కూడా అక్కడి భావనలేనని, వాటికి కూడా మన దేశంలో చోటులేదని ప్రకటించగలమా అని ప్రశ్నించారు. కాగా గవర్నర్ వ్యాఖ్యలను డీఎంకే కూడా ఖండించింది. లౌకికతత్వం గురించి రవికి ఏం తెలుసని సీపీఐ నేత డి.రాజా మండిపడ్డారు.

## ఆ టైంలో సెలవులివ్వాలి

(మొదటిపేజి తరువాయి)

తెలిపారు. "రెండోసారి ఐరాస సదస్సుకు హాజరైనందుకు గర్వంగా ఉంది. నెలసరి రోజుల్లో వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలన్నదే నా ప్రధాన లక్ష్యం. ఆ రోజుల్లో ఒకటి నుంచి రెండు రోజులు సెలవులు ఇవ్వాలి. జీతం ఇవ్వకపోతే.. ఏ మహిళ కూడా ఆ సెలవు తీసుకోదు. కెన్యాలో జరిగిన ఐరాస సదస్సులో ఈ విషయం గురించి తొలిసారి ప్రస్తావించా" అని ప్రియదర్శిని అన్నారు. కెన్యా సదస్సు అనంతరం ఒడిశా ప్రభుత్వం ఈ దిశగా నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఈ ఏడాది ఆగస్టు 15 నుంచి పెయిడ్ పీరియడ్ లీవ్ ఇన్షియేటివ్‌ను అమలుచేసింది. అలాగే కర్నాటక ప్రభుత్వం ఏడాదికి ఆ తరహాలో ఆరు సెలవులు ప్రకటించింది. అయితే కర్నాటక ప్రభుత్వ చర్యను అభినందించిన ఆమె.. ఆ సెలవుల సంఖ్యను 12కు పెంచాలని కోరారు.

తన పోరాటం వెనక వ్యక్తిగతంగా ఎదుర్కొన్న అనుభవాలు కారణమని ఆమె తెలిపారు. ఆ సమయంలో తాను సెలవు కోరినందుకు తన మేనేజర్ నుంచి అవమానం ఎదుర్కొన్నానని, ఆ తర్వాత తాను ఉద్యోగానికి రాజీనామా చేశానని వెల్లడించారు. కాగా ఆమె ప్రయత్నాలు నెలసరి ఆరోగ్యంపై చర్చించేలా, ఆ దిశగా నిర్ణయాలు తీసుకునేందుకు దోహదం చేస్తున్నాయి.

ఇదిలా ఉంటే.. స్వాతంత్ర్య దినోత్సవ వేళ ఒడిశా ప్రభుత్వం మహిళలకు శుభ వార్త చెప్పిన సంగతి తెలిసిందే. ఉద్యోగినుల కోసం ఒక రోజు నెలసరి సెలవు పాలసీని ప్రవేశపెడుతున్నట్టు ప్రకటించింది. ప్రభుత్వ ప్రయివేటు రంగాల్లో పనిచేసే మహిళా ఉద్యోగులకు ఇది వర్తిస్తుందని వెల్లడించింది. ఈ పాలసీ తక్షణమే అమల్లోకి వస్తుందని అప్పట్లో పేర్కొంది. మహిళా ఉద్యోగులు ప్రతినెలా తమ రుతుక్రమంలో తొలి లేదా రెండో రోజు ఈ సెలవు తీసుకునేలా దీన్ని రూపొందించినట్టు తెలిపింది. ఉద్యోగుల ఆరోగ్యం, శ్రేయస్సును కాంక్షిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించింది.

## సిద్ధరామయ్యకు ఎదురుదెబ్బ

### 'ముడా స్కామ్' లో పిటిషన్‌ను కొట్టేసిన హైకోర్టు



**బెంగళూరు:** కర్నాటక రాజకీయాల్లో ముడా స్కామ్ కలకలం రేపుతుండగా హైకోర్టులో సీఎం సిద్ధరామయ్యకు ఎదురుదెబ్బ తగిలింది. ఆ కుంభకోణానికి సంబంధించి తనను విచారించేందుకు గవర్నర్ అనుమతి మంజూరు చేయడంపై సీఎం హైకోర్టులో సవాల్ చేసిన సంగతి తెలిసిందే. ఆ పిటిషన్‌ను తాజాగా కోర్టు కొట్టివేసింది. గవర్నర్ థావర్‌చంద్ గహ్లాత్, ముఖ్యమంత్రి, పిటిషనర్ల తరపు వాదనలు విన్న కోర్టు తీర్పును వాయిదా వేయడం తాజాగా సీఎం పిటిషన్‌ను తోసిపుచ్చుతూ.. గవర్నర్ చర్యలు చట్టప్రకారం ఉన్నాయని కోర్టు వ్యాఖ్యానించింది. ఆయన చర్యల్లో ఎలాంటి లోపాలు లేవని, ఈ కేసులో పేర్కొన్న అంశాలపై విచారణ చేపట్టాల్సి ఉందని స్పష్టం చేసింది. 'ముడా' స్థలాల కేటాయింపుల్లో సీఎం సిద్ధరామయ్య కుటుంబ సభ్యులు లబ్ధి పొందటం, అందుకు ముఖ్యమంత్రి అధికారాన్ని దుర్వినియోగం చేసినట్టు దాఖలాలతో సామాజిక కార్యకర్త టి.జె.అబ్రహం గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. ఆయనతో పాటు స్నేహమయి కృష్ణ, ప్రదీప్‌కుమార్ సైతం సీఎంపై ఫిర్యాదు చేశారు. వీరి ఫిర్యాదుల మేరకు ఆగస్టు 16న సీఎంను విచారించాలంటూ గవర్నర్ ఆదేశించారు. ఈ ఆదేశాలను రద్దు చేయాలని మంత్రివర్గం తీర్మానించగా.. దానిని గవర్నర్ తోసిపుచ్చారు. దాంతో సీఎం హైకోర్టును ఆశ్రయించారు.మరోపక్క ఈ తీర్పు సిద్ధరామయ్య భవిష్యత్తుకు ఎంతో కీలకమని రాజకీయవర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఆయన విచారణను ఎదుర్కోవాల్సి వస్తే రాజీనామా చేయాలన్న డిమాండ్ విపక్షాల నుంచే కాక స్వపక్షం నుంచీ ఎదురవుతోంది. మరోవైపు ఆయన వెంటనే రాజీనామా చేయాలని బీజేపీ డిమాండ్ చేసింది.

## ప్రచారం జాస్తి ఎఫ్‌డీఐలు నాస్తి

**న్యూఢిల్లీ :** మేక్ ఇన్ ఇండియా విఫల ప్రయత్నంగా మారింది. పథకాలకు పేర్లు మార్చటం మినహా ప్రవేశపెట్టిన పాత పథకాలను గాలికి వదిలేస్తోందనటానికి ఈ పథకమే ఉదాహరణగా నిలుస్తున్నది.విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐలు)లో తయారీ రంగానికి సంబంధించిన వాటాను పెంచే విషయంపై పాలకులు పెద్దగా దృష్టి సారించడం లేదు. చారిత్రకంగా చూస్తే ఆగ్నేయాసియా ప్రాంతంలో విదేశీ పెట్టుబడులకు మంచి అనువైన వాతావరణం ఉంది. ఆసియా అభివృద్ధి బ్యాంక్ (ఏడీబీ) కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తోంది. ప్రాంతీయ ఏకీకరణ నుండి వచ్చిన అవకాశాల కారణంగా ఆగ్నేయాసియాలో విదేశీ పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం ఉన్నదని తెలిపింది.

### అవాస్తవ లెక్కలు

'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమంలో భాగస్వాములయ్యేందుకు దేశీయ కంపెనీలు విముఖత చూపాయి. అయినప్పటికీ గత రెండు దశాబ్దాలలో ఎఫ్‌డీఐలు కుప్పలు తెప్పలుగా వచ్చి పడ్డాయని అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. కానీ అంతర్జాతీయ గణాంక వర్గాలు మాత్రం దీనితో ఏకీభవించడం లేదు. విదేశీ పెట్టుబడులలో హెచ్చుతగ్గులు ఉన్నాయని, 2020 నుండి ఎఫ్‌డీఐలు తగ్గిపోయా యని ఆ వర్గాలు కుండబద్దలు కొట్టాయి. మేక్ ఇన్ ఇండియా సచివాలయం అందించిన సమాచారం ప్రకారం 2020-2023 మధ్య దేశంలోకి 919 బిలియన్ డాలర్ల ఎఫ్‌డీఐలు వచ్చాయి. అయితే వాస్తవానికి గత తొమ్మిది సంవత్సరాల కాలంలో వచ్చిన విదేశీ పెట్టుబడులు 595 బిలియన్ డాలర్లు మాత్రమే.

### పెట్టుబడులు ఎక్కడ?

ఇతర రంగాలతో పోలిస్తే తయారీ రంగంలో ఎఫ్‌డీఐలు చాలా తక్కువగానే ఉన్నాయి. 2022-23లో సేవల రంగం (16 శాతం), కంప్యూటర్ సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ (15 శాతం), ట్రేడింగ్ (6 శాతం), టెలీకమ్యూనికేషన్ (6 శాతం), ఆటోమొబైల్స్ (5 శాతం) మేర విదేశీ పెట్టుబడులను ఆకర్షించాయి. ఎఫ్‌డీఐలను అత్యధికంగా ఆకర్షించిన రంగాలలో ఇవి తొలి ఐదు స్థానాలను దక్కించుకున్నాయి. ఐరాస ట్రేడ్ అండ్ డెవలప్‌మెంట్ అందించిన సమాచారాన్ని బట్టి చూస్తే దేశంలోకి ఎఫ్‌డీఐల ప్రవాహం చాలా స్వల్పంగా ఉంది. 2019-23 మధ్య కాలంలో దేశంలోకి కేవలం 240 బిలియన్ డాలర్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు మాత్రమే వచ్చాయి. 2023లో ఇవి మరింత పడిపోయి 28 బిలియన్ డాలర్లకు చేరాయి. అంటే అంతకుముందు సంవత్సరంతో పోలిస్తే ఏకంగా 29 శాతం తగ్గాయన్న మాట. 2020-23 మధ్యకాలంలో భారత్‌లో గ్రీన్‌ఫీల్డ్ పెట్టుబడి ప్రాజెక్టులు ఎఫ్‌డీఐలను బాగా ఆకర్షించాయని, ఆ కాలంలో 200 బిలియన్ డాలర్ల విలువ కలిగిన ప్రాజెక్ట్ ప్రకటనలు వచ్చాయని ఐరాస సంస్థ తెలిపింది.

### ప్రభుత్వ పెట్టుబడులు, రాయితీలే అధికం

ఆగ్నేయాసియా మాదిరిగా భారత్‌కు ప్రపంచ శ్రేణి తయారీ సామర్థ్యం ఉన్నదా లేదా అని చిప్ తయారీ సంస్థ మైక్రాన్, స్మార్ట్‌ఫోన్ తయారీదారు యాపిల్ పరీక్ష పెట్టబోతున్నాయి. దేశంలో తొలిసారి మోడీ స్వరాష్ట్రమైన గుజరాత్‌లో డీఆర్‌ఏఎం -ఎన్‌ఏఎన్‌డీ (స్టోరేజ్, మెమరీ చిప్స్) అసెంబ్లీ-టెస్ట్ కేంద్రాన్ని ఏర్పాటు చేయబోతున్నట్లు గత సంవత్సరం జూన్‌లో మైక్రాన్ ప్రకటించింది. రెండు దశలుగా చేపట్టే ఈ ప్రాజెక్టుపై 825 మిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టాలని ఆ సంస్థ యోచిస్తోంది. తొలి దశను ఈ ఏడాది చివరలో అమలు చేస్తారు. రెండో దశను ఈ దశాబ్దపు ద్వితీయార్థంలో చేపడతారు. ఈ కేంద్రం ద్వారా నేరుగా ఐదు వేల ఉద్యోగాలు, వాటికి అదనంగా మరో పదిహేను వేల కమ్యూనిటీ ఉద్యోగాలు కల్పిస్తామని కంపెనీ ప్రకటించింది. అయితే అమెరికాకు చెందిన ఈ కంపెనీకి ప్రభుత్వం నుండి అవసరమైన ఆర్థిక సహకారం అందుతుందా లేదా అనేది ప్రశ్నార్థకం. ఎందుకంటే కేంద్ర ప్రభుత్వ పథకం ప్రకారం ప్రాజెక్ట్ వ్యయంలో యాభై శాతాన్ని ప్రభుత్వం భరించాల్సి ఉంటుంది. మరో 20 శాతం వ్యయాన్ని అదనపు ప్రోత్సాహకాల రూపంలో గుజరాత్ ప్రభుత్వం సమకూర్చాలి. దీనిని బట్టి చూస్తే మొత్తం ప్రాజెక్ట్ వ్యయం 2.75 బిలియన్ డాలర్లలో మైక్రాన్ పెట్టేది 825 మిలియన్ డాలర్లు మాత్రమే.

అదే విధంగా దేశంలో యాపిల్ స్మార్ట్‌ఫోన్ల ఉత్పత్తి చుట్టూ కూడా వివాదాలు అలుముకుంటున్నాయి. ఈ ప్రాజెక్టులో భాగస్వాములుగా ఉన్న ముగ్గురు కాంట్రాక్ట్ ఉత్పత్తిదారులు...ఫాక్స్‌కాన్, టాటా గ్రూపునకు చెందిన వెస్ట్రన్, పెగట్రాన్...కేంద్రం నుండి 440 మిలియన్ డాలర్ల ప్రోత్సాహకాలు పొందుతారు.

### నిపుణుల పెదవి విరుపు

ప్రభుత్వం ఇవ్వజూపుతున్న ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాలపై విధాన నిపుణులు ఇప్పటికే తీవ్ర విమర్శలు సంధిస్తున్నారు. మైక్రాన్ సంస్థకు ఇవ్వాల్సిన ప్రభుత్వ సబ్సిడీలు ఉన్నత విద్యకు కేంద్ర వార్షిక బడ్జెట్‌లో కేటాయించిన మొత్తంలో మూడో వంతుకు పైగానే ఉన్నాయని ఆర్‌బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ తెలియజేశారు. 'ఇదంతా ఎందుకు? ప్రభుత్వ అంచనాల ప్రకారం ఈ ప్రాజెక్ట్ ద్వారా ఐదు వేల ఉద్యోగాలు వస్తాయి. అంటే ఒక్కో ఉద్యోగంపై నాలుగు లక్షల డాలర్ల ఖర్చు. పైగా ఈ ప్లాంటు పరిశోధన, అభివృద్ధికి ఏ మాత్రం దోహదపడదు' అని చెప్పారు. మైక్రాన్‌కు సబ్సిడీల రూపంలో ప్రభుత్వం ఖర్చు చేసే సొమ్మును దేశీయంగా ఉన్నత విద్యపై వెచ్చిస్తే మంచిదని ఆయన సలహా ఇచ్చారు.

### పనితీరు పేలవం

మేక్ ఇన్ ఇండియా పనితీరు పేలవంగా ఉండడానికి పలు కారణాలున్నాయని మోడీ ప్రభుత్వ మాజీ ప్రధాన ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రమణియన్ తెలిపారు. మోడీ తొలి, రెండవ ప్రభుత్వ కాలాలలో మేక్ ఇన్ ఇండియా విషయంలో అనుసరించిన వైఖరులను ఆయన పోల్చి చూశారు. తొలి ప్రభుత్వ హయాంలో సమస్యలను తగ్గించేందుకు ప్రయత్నించగా రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత పెట్టుబడిదారులను నిరుత్సాహపరచే విధంగా విధాన నిర్ణయాలు తీసుకున్నారని గుర్తు చేశారు. దేశంలోని బడా కంపెనీలకే భారీ ప్రాజెక్టులు కట్టబెట్టారని, వాటికి ఆర్థిక, విధానపరమైన ప్రోత్సాహకాలు అందించారని చెప్పారు. స్థానిక, విదేశీ సంస్థలపై రెవెన్యూ అధికారులు పన్నుల భారం మోపారని, కంపెనీలు ముడి పదార్థాలు, విడిభాగాలను విదేశాల నుండి దిగుమతి చేసుకోవాల్సి వచ్చిందని, ఇవన్నీ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు ప్రతిబంధకాలయ్యాయని వివరించారు.

# పెండింగ్ వేతనాలు చెల్లించాలి

**లేదంటే సమ్మె తప్పదు :**
**హాస్టల్ వర్కర్ల ధర్నాలో సీఐటీయూ నేతలు**



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గిరిజన సంక్షేమ శాఖ పోస్టుమెట్రిక్ పీఎంహెచ్ హాస్టల్ వర్కర్ల 20 నెలల పెండింగ్ వేతనాలను చెల్లించాలని తెలంగాణ గిరిజన సంక్షేమ శాఖ హాస్టల్ డైలీవేజ్, ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. మధు డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్ ముందు పీఎంహెచ్ హాస్టల్ ఔట్‌సోర్సింగ్, డైలీవేజ్ వర్కర్లు ధర్నా నిర్వహించారు. అనంతరం రాష్ట్ర నోడల్ ఆఫీసర్ దివ్య, గిరిజన సంక్షేమ శాఖ అడిషనల్ డైరెక్టర్ సర్వేశ్వర్‌రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసిఫాబాద్ జిల్లాలో డైలీవేజ్ వర్కర్లకు జిల్లా కలెక్టర్ గెజిట్ ప్రకారం వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 20 నెలలుగా గిరిజన కార్మికులు చేసిన కష్టానికి వేతనాలు ఇవ్వకపోతే ఎలా బతుకుతారని ప్రశ్నించారు.తంతజజ మంత్రులకు, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన కార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. జూలై రెండున ప్రజాభవన్‌లో ధర్నా చేయటంతో చెక్కులను ఆర్థిక శాఖకు పంపించారనీ, రాష్ట్రవ్యాప్తంగా వర్కర్లకు రావాల్సిన రూ. 12 కోట్ల చెక్కులు ఆర్థిక శాఖ పరిధిలో పెండింగ్‌లో ఉన్నాయని గుర్తు చేశారు. వాటిని వెంటనే రిలీజ్ చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ వేతనాలు చెల్లించకపోతే నిరవధిక సమ్మె తప్పదని హెచ్చరించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రతినెలా 1న లక్షల రూపాయల జీతాలు తీసుకుంటున్నారనీ, గిరిజన కార్మికులకు ఇచ్చే రూ. పదివేల జీతం కూడా సక్రమంగా ఎందుకు ఇవ్వటం లేదని ప్రశ్నించారు. ఆసిఫాబాద్ జిల్లాలో 36 మంది కార్మికులకు జిల్లా కలెక్టర్ గెజిట్ ప్రకారం వేతనాలు చెల్లించవలసి ఉండగా అందుకు విరుద్ధంగా రూ. 10వేలు మాత్రమే చెల్లిస్తున్నారని చెప్పారు. దీంతో ప్రతి కార్మికుడు రూ. 8 వేలు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు వేతనాలు పెరిగేలా జిల్లా కలెక్టర్ గెజిటను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

**పెండింగ్‌లో ఉన్న చెక్కులను క్లియర్ చేపిస్తాం**

ఆర్థిక శాఖ అధికారులతో మాట్లాడి పెండింగ్‌లో ఉన్న చెక్కులను క్లియర్ చేయించి జీతాలు ఇప్పిస్తామని సమస్యలపై వినతిపత్రం స్వీకరించిన ప్రజాపాలన నోడల్ ఆఫీసర్ దివ్య , ప్రజాపాలన ఇన్‌చార్జి జి.చెన్నారెడి హామీ ఇచ్చారు. సమ్మె చేయవద్దని కార్మికులను కోరారు. అదే విధంగా గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శితో మాట్లాడి సమస్యలు పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు టేకం ప్రభాకర్, కార్యదర్శి కె బ్రహ్మాచారి, నాయకులు కృష్ణమాచారి, హీరాలాల్, జలందర్, జయ, తిరుపతమ్మ, ముత్తయ్య, శ్యామ్‌రావ్, సీతారాం, రాంబాయి తదితరులు పాల్గొన్నారు.త

# ప్రభుత్వాస్పత్రుల్లో వ్యవస్థల ప్రక్షాళన

**బయోమెట్రిక్‌ను పర్యవేక్షించాలి :**
**మంత్రి దామోదర రాజనర్సింహ**



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రభుత్వాస్పత్రుల్లో శానిటేషన్, సెక్యూరిటీ, పేషెంట్ కేర్ వ్యవస్థను ప్రక్షాళన చేయాలని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. వారికి బయోమెట్రిక్ అటెండెన్స్ తప్పనిసరి చేయాలని ఆదేశించారు. హాస్పిటళ్ల సూపరింటెండెంట్లతో పాటు, డీఎంఈ, డీహెచ్, వీవీపీ కమిషనర్ కూడా తమ పరిధిలోని హాస్పిటళ్లలో పని చేస్తున్న వారి బయోమెట్రిక్ అటెండెన్స్‌ను పర్యవేక్షించాలని సూచించారు. పేషెంట్లతో ఎలా మాట్లాడాలో కింది స్థాయి సిబ్బందికి ట్రైనింగ్ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ మేరకు మంగళవారం ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ఆఫీసులో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. డైట్, శానిటేషన్ సెక్యూరిటీ, పేషెంట్ కేర్ విభాగాలకు ప్రతి నెలా సకాలంలో నిధులు మంజూరు చేయాలనీ, సిబ్బందికి వేతనాలు చెల్లించాలని మంత్రి సూచించారు. నిబంధనలు ఉల్లంఘించే కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

శానిటేషన్, సెక్యూరిటీ విషయంలో ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్స్, కార్పొరేట్ హాస్పిటల్స్ అవలంబిస్తోన్న విధానంపై అధ్యయనం చేయాలనీ, ఇందుకోసం ఎక్స్‌పర్ట్ కమిటీని నియమించాలని హెల్త్ సెక్రెటరీని మంత్రి ఆదేశించారు. హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్, సెక్యూరిటీ విభాగాల పనితీరు, హెచ్ఆర్, జాబ్‌చార్ట్‌ను క్షుణ్ణంగా పరిశీలించి, పది రోజుల్లో తనకు కమిటీ నివేదిక అందజేయాలని కోరారు. రోగుల రద్దీకి తగ్గట్టు టాయిలెట్స్ ఉండాలని మంత్రి సూచించారు.

దవాఖాన్ల వారీగా పేషెంట్ లోడ్, టాయిలెట్స్ సంఖ్య వంటి వివరాలతో నివేదిక తయారు చేయాలనీ, అవసరమైన చోట టాయిలెట్ల సంఖ్య పెంచేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. అన్ని టీచింగ్ హాస్పిటల్స్‌లో సెక్యూరిటీ అవుట్ పోస్టుల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. అవుట్ పేషెంట్ల వెయిటింగ్ సమయాన్ని తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ఈ సమావేశంలో హెల్త్ సెక్రెటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు తదితరులు పాల్గొన్నారు.

**చెపాక్ ఎర్రమట్టి పిచ్‌పై నాలుగు రోజుల పాటు పదునైన పేస్, మంచి బౌన్స్ లభించగా.. కాన్పూర్‌లో సంప్రదాయ స్పిన్ పిచ్‌కు రంగం సిద్ధమైంది. భారత్, బంగ్లాదేశ్ రెండో టెస్టుకు గ్రీన్‌పార్క్ క్యూరేటర్ నల్లమట్టి పిచ్‌ను తయారు చేస్తున్నారు. దీంతో బౌన్స్ తగ్గుముఖం పట్టి.. బంతి గింగిరాలు తిరగనుంది!. భారత్, బంగ్లాదేశ్ రెండో టెస్టు శుక్రవారం నుంచి ఆరంభం కానుంది.**

# ఇక స్పిన్ సవాల్!

**కాన్పూర్‌లో నల్లమట్టి పిచ్ సిద్ధం**
**ఇరు జట్లు ముగ్గురు స్పిన్నర్లకు మొగ్గు**

నవతెలంగాణ క్రీడావిభాగం

ఎర్రమట్టి పిచ్.. నల్ల మట్టి పిచ్‌గా మారనుంది. పిచ్ లభించే బౌన్స్, అదనపు పేస్ తగ్గుముఖం పట్టనుంది. తొలి రోజు నుంచే సూపర్ టర్న్ చూడకపోయినా.. మ్యాచ్ సాగుతున్న కొద్ది తిరిగే బంతిని ఎదుర్కోవటం బ్యాటర్లకు సవాల్ విసరనుంది. చెపాక్‌లో పేస్ సవాల్‌లో తిరుగులేని విజయం సాధించిన టీమ్ ఇండియా టెస్టు సిరీస్‌లో 1-0తో ఆధిక్యంలో నిలిచింది. శుక్రవారం నుంచి భారత్, బంగ్లాదేశ్ రెండో టెస్టుకు కాన్పూర్‌లోని గ్రీన్‌పార్క్ మైదానం వేదిక కానుంది. తొలి టెస్టులో పేస్ ప్రతాపం కనిపించగా.. కాన్పూర్‌లో పూర్తి స్పిన్ స్వర్గధామ పిచ్ సిద్ధం చేస్తున్నట్టు సమాచారం.

**ముగ్గురు స్పిన్నర్లతో! :** కాన్పూర్ టెస్టులో ఇరు జట్లు అదనపు స్పిన్నర్‌ను తుది జట్టులోకి తీసుకునేందుకు మొగ్గు చూపనున్నాయి. చెపాక్ పిచ్ స్వభావం దృష్ట్యా అక్కడ ముగ్గురు పేసర్లతో ఆడగా.. ఇక్కడ పిచ్ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని ముగ్గురు స్పిన్నర్లతో ఆడనున్నారు. భారత శిబిరంలో యువ పేసర్ ఆకాశ్ దీప్ స్థానంలో కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్‌లో ఒకరు ఆడనున్నారు. బంగ్లాదేశ్ తరఫున తైజుల్ ఇస్లాం, నయీమ్ హసన్‌లు మూడో స్పిన్నర్ రేసులో ఉన్నారు.



**నల్లమట్టి పిచ్ :** కాన్పూర్ పిచ్ సంప్రదాయంగా స్పిన్‌కు అనుకూలం. ఇక్కడ అందుబాటులో ఉన్న అన్ని పిచ్‌లు నల్ల మట్టితో తయారు చేశారు. నల్ల మట్టి పిచ్‌లు సూర్య కాంతి కాస్త ఎక్కువ పడగానే.. పగుళ్లు ఏర్పడుతుంది. పగుళ్లు తేలిన పిచ్‌పై స్పిన్నర్లు మాయజాలం సృష్టిస్తారు. ఇదే సమయంలో పేసర్లకు ఆశించిన బౌన్స్, పేస్ దక్కదు. వికెట్ల వేటలో పేసర్లు సహనంతో ఉండాల్సిందే. ఇదే సమయంలో తొలి రెండు రోజుల్లో పిచ్ బ్యాటర్లకు గొప్పగా సహకరించనుంది. పిచ్‌పై పగుళ్లు అప్పటికే రావు. దీంతో ఇటు పేస్, అటు స్పిన్‌ను సమర్థవంతంగా ఎదుర్కొని భారీ స్కోరు చేసేందుకు అవకాశం ఏర్పడుతుంది.

**షకిబ్‌కు గాయం :** బంగ్లాదేశ్ ఆల్‌రౌండర్ షకిబ్ అల్ హసన్ గాయపడ్డాడు. ఎడమ చేతి బొటనవేలి గాయంతోనే తొలి టెస్టులో ఆడిన షకిబ్.. బ్యాటింగ్ చేస్తుండగా మరింత ఇబ్బంది పడ్డాడు. దీంతో కాన్పూర్‌లో అతడు ఆడేది అనుమానంగా ఉంది. అతడి స్థానంలో నయీమ్ హసన్ తుది జట్టులోకి రానున్నాడు. షకిబ్ అల్ హసన్ ఆడినా.. మూడో స్పిన్నర్‌గా తైజుల్ ఇస్లాం జట్టులోకి రానున్నాడు.



# సింధు కోచ్‌గా శ్రీధం

**యూరోప్ సీజన్ వరకు ఒప్పందం!**

**హైదరాబాద్ :** భారత అగ్రశ్రేణి షట్లర్ పి.వి సింధు మరోసారి వ్యక్తిగత కోచ్‌ను మార్చివేసింది. 2016, 2020 ఒలింపిక్స్‌లో పతకాలు సాధించిన పి.వి సింధు 2024 ఒలింపిక్స్‌లో నిరాశపరిచింది. గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో కఠోర సాధన చేస్తున్న సింధు యూరోపియన్ సీజన్ కోసం అనుప్ శ్రీధర్‌ను వ్యక్తిగత కోచ్‌గా ఎంచుకుంది. పారిస్ ఒలింపిక్స్‌తో ఇండోనేషియా కోచ్ ఆగస్ ఒప్పందం ముగిసిన సంగతి తెలిసిందే. శ్రీధర్ పర్యవేక్షణలో సెప్టెంబర్ తొలి వారం నుంచి శిక్షణ పొందుతున్న సింధు.. అక్టోబర్‌లో ఫిన్లాండ్, డెన్మార్క్ ఓపెన్‌లో బరిలోకి దిగనుంది. యూరోపియన్ సీజన్ అనంతరం సమీక్ష చేసుకుని వ్యక్తిగత కోచ్ అంశంపై నిర్ణయం తీసుకుంటామని సింధు తండ్రి రమణ తెలిపారు.

# దీప్తికి రూ.కోటి అందజేత



**హైదరాబాద్ :** పారాలింపిక్స్ పతక విజేత, తెలంగాణ అమ్మాయి దీప్తి జీవాంజికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రూ. 1 కోటి నగదు బహుమతి అందజేసింది. మంగళవారం సీఎం నివాసంలో జరిగిన కార్యక్రమంలో రూ. 1 కోటి చెక్‌ను దీప్తికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, శాట్ చైర్మన్ కే. శివసేనారెడ్డి అందజేశారు. దీప్తి కోచ్ నాగపురి రమేశ్‌కు సైతం రూ.10 లక్షల నగదు ప్రోత్సాహకం అందించారు.

# 26 నుంచి గోల్ఫ్ టోర్నీ




**హైదరాబాద్ :** హైదరాబాద్ గోల్ఫ్ క్లబ్ వేదికగా ఈ నెల 26 నుంచి తెలంగాణ గోల్ఫ్ మాస్టర్స్ టోర్నీ ఆరంభం కానుంది. ఈ టోర్నమెంట్‌లో 126 మంది గోల్ఫర్లు పోటీపడుతున్నట్టు నిర్వాహకులు మంగళవారం జరిగిన మీడియా సమావేశంలో వెల్లడించారు. తెలంగాణలో గోల్ఫ్ టూరిజం వృద్ధి చెందేందుకు ఈ టోర్నీ ఉపయుక్తంగా ఉంటుందని పీజీటీఐ సీఈవో ఉత్తమ్ సింగ్ తెలిపారు.



సుధీర్‌బాబు

## రెండు భిన్న ప్రపంచాలతో జటాధర

సుధీర్ బాబు కథానాయకుడిగా రూపొందుతున్న సూపర్ నేచురల్ థ్రిల్లర్ 'జటాధర'. ప్రేరణ అరోరా సమర్పణలో సుధీర్ బాబు ప్రొడక్షన్ బ్యానర్‌పై ఈ చిత్రం తెరకెక్కుతోంది. వచ్చే ఏడాది శివరాత్రి కానుకగా ఈ సినిమా విడుదల కానుంది. తాజాగా ఈ సినిమా నుండి సెకండ్ పోస్టర్‌ని మేకర్స్ రిలీజ్ చేశారు.

సూపర్ నేచురల్ శక్తితో అదరగొట్టే లుక్‌లో కనిపిస్తున్న సుధీర్ బాబు తీరు సినిమాపై అందరిలోనూ మంచి క్యూరియాసిటీ ఏర్పడేలా చేసింది.

ఈ సందర్భంగా హీరో సుధీర్ బాబు మాట్లాడుతూ, 'ఫస్ట్ లుక్ పోస్టర్‌కు వచ్చిన ఆదరణ చూసి ఆశ్చర్యపోయాను. ఇంత గొప్ప స్పందన రావడం హ్యాపీగా అనిపించింది. ఈ సినిమా లోకి అడుగు పెట్టటం అనేది ఓ సరికొత్త ప్రపంచాన్ని నాకు పరిచయం చేసింది. నాకు ఇది ఎప్పటికీ మరచిపోలేని అనుభవం. శాస్త్రీయత, పౌరాణిక అంశాల కలయికతో స్క్రిప్ట్ రాశారు. ఈ రెండు జోనర్స్‌కు చెందిన ప్రపంచాలను ఆడియెన్స్ వెండితెరపై చూస్తున్నప్పుడు ఓ సరికొత్త సినిమా చూసిన అనుభూతిని పొందుతారు. ఏ సినిమా సక్సెస్‌కైనా కారణం బలమైన స్క్రిప్ట్. దీనికి మంచి టీమ్ తోడైతే అది మంచి సినిమాగా ప్రాణం పోసుకుంటుంది. మా సినిమా విషయంలో అదే జరుగుతుంది. ప్రేరణ అరోరా బెస్ట్ టీమ్‌తో ఈ సినిమాను ఆవిష్కరిస్తున్నారు. ఆమెతో కలిసి ట్రావెల్ చేయటం గొప్ప అనుభూతి. విజువల్‌గా, ఎమోషనల్‌గా ఓ అద్భుతమైన సినిమాను ఆమె తెరకెక్కిస్తున్నారు. ఈ మూవీకి సంబంధించిన సెకండ్ పోస్టర్ పౌరాణిక ప్రపంచాన్ని తెలియజేస్తుంది. ప్రేక్షకులను ఆశ్చర్యపరిచేలా ఉండే అంశాలు ఎన్నో ఈ సినిమాలో ఉండబోతున్నాయి. వాటి గురించి తెలియజేయటానికి, ప్రేక్షకులు ఈ సినిమాటిక్ ఎక్స్‌పీరియెన్స్‌ను ఎలా ఎంజాయ్ చేస్తారో చూడాలని నేను ఎంతో ఆతృతగా ఎదురు చూస్తున్నాను' అని అన్నారు.

భారీ బడ్జెట్‌తో అంచనాలను మించేలా ఓ అద్భుతమైన సరికొత్త చిత్రాన్ని రూపొందించటానికి నిర్మాతలు ప్రేరణ అరోరా, శివిన్ నారంగ్, నిఖిల్ నంద, ఉజ్వల్ ఆనంద్ అహర్నిశలు కష్టపడుతున్నారు. సినిమాలో హీరోయిన్‌గా ఓ ప్రముఖ బాలీవుడ్ స్టార్ హీరోయిన్ నటించనుంది. అలాగే ప్రతినాయకి పాత్రలో మరో బాలీవుడ్ స్టార్ నటించనుంది. ఆ వివరాలను మేకర్స్ త్వరలోనే ప్రకటించనున్నారు. ప్రస్తుతం ఈ చిత్ర ప్రీ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. త్వరలోనే షూటింగ్ హైదరాబాద్‌లో ప్రారంభం కానుంది.

# నవచిత్రం

## మీ మనసులకు నచ్చే సినిమా



కార్తీ, అరవింద్ స్వామి లీడ్ రోల్స్‌లో రాబోతున్న చిత్రం 'సత్యం సుందరం'. '96' ఫేమ్ సి. ప్రేమ్‌కుమార్ దర్శకుడు. 2డి ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై సూర్య, జ్యోతిక నిర్మించారు. ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఈ చిత్రాన్ని తెలుగులో రిలీజ్ చేస్తున్నారు. ఈనెల 28న ఈ సినిమా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన చిత్ర ప్రీరిలీజ్ ఈవెంట్‌లో హీరో విశ్వక్ సేన్, డైరెక్టర్ ప్రశాంత్ వర్మ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు.హీరో కార్తీ మాట్లాడుతూ,'అందరికీ పర్సనల్‌గా కనెక్ట్ అయ్యే స్క్రిప్ట్ ఇది. డైరెక్టర్ ప్రేమ్ కుమార్ చాలా ప్లాన్డ్‌గా షూట్ చేశారు. 'ఖైదీ'లాగే నైట్ షూట్ ఉండే కథ ఇది. అరవింద్ స్వామి ఇందులో చాలా కొత్తగా కనిపిస్తారు. గోవింద్ వసంత బ్యూటిఫుల్ మ్యూజిక్ ఇచ్చారు. అమ్మానాన్నలు, బ్రదర్స్ సిస్టర్ల ఎమోషన్స్‌ని చూశాం. కానీ ఇప్పటివరకు కజిన్స్ ఎమోషన్‌ని చూడలేదు. ఈ సినిమా చూశాక ప్రతి ఒక్కరూ వాళ్ల కజిన్స్‌కి ఫోన్ చేసి మాట్లాడుతారు.

## భయాన్ని గౌరవించాలని చెప్పే దేవర



'ఎన్టీఆర్‌తో జర్నీ ఎప్పుడూ నాకు స్పెషలే. ఏ విషయం అయినా ఆయనతో డిస్కస్ చేసినప్పుడు బాగున్నా, బాగోలేకపోయినా ఓపెన్‌గా మనసులో ఉన్న భావాన్ని చెబుతారు. 'దేవర' లైన్ చెప్పినప్పుడు ఆయన స్పందించిన తీరుతోనే సినిమాని నెక్స్ట్ లెవల్‌కు తీసుకెళ్లాలని నిర్ణయించుకున్నాం' అని దర్శకుడు కొరటాల శివ చెప్పారు.ఎన్టీఆర్ కథానాయకుడిగా రూపొందిన చిత్రం 'దేవర'. కొరటాల శివ దర్శకత్వంలో నందమూరి కళ్యాణ్ రామ్ సమర్పణలో ఎన్టీఆర్ ఆర్ట్స్, యువ సుధ ఆర్ట్స్ పతాకాలపై మిక్కిలినేని సుధాకర్, హరికృష్ణ.కె నిర్మించిన ఈ చిత్రం ఈనెల 27న వరల్డ్ వైడ్ గ్రాండ్ రిలీజ్ అవుతోంది.ఈ సందర్భంగా దర్శకుడు కొరటాల శివ మీడియాతో సంభాషించారు. ఆ విశేషాల సమాహారం..

### మితిమీరిన ధైర్యం కరెక్ట్ కాదు

'దేవర' కథ అంతా ఫిక్షనల్. ఎక్కడా నిజ ఘటనలను ఆధారంగా చేసుకోలేదు. మనిషికి మితిమీరిన ధైర్యం కూడా కరెక్ట్ కాదు. అది మూర్ఖత్వం అవుతుంది. మనకు తెలియకుండానే మనలో ఓ భయం ఉంటుంది. దాన్ని గౌరవించాలని చెప్పటమే 'దేవర' కథ. భయం మనిషికి ఎంతో అవసరం.. మంచిది కూడా. అదే నేను 'దేవర' సినిమాలో చెప్పాను. జవాబుదారీ తనం కూడా ఓ భయమే. ఇలాంటి భయం ఉండటం వల్ల మనం చేసే పనిని చెక్ చేసుకుని మంచి రిజల్ట్ పొందుతాం.

> 'ఆచార్య' ఆశించిన స్థాయిలో ఆడలేదు. 'ఆచార్య' తర్వాత ఈసారి నువ్వు ఇంకా గట్టిగా హిట్ కొడతావంటూ మెసేజ్ పెట్టిన మొదటి వ్యక్తి చిరంజీవి. అలాంటి ఆయనకు, నాకు మధ్య తేడాలెందుకుంటాయి?. ఈ సినిమాకు ఇంకా బాగా ప్రిపేర్ అయ్యాను. 'ఆచార్య' రిలీజైన 20 రోజుల్లోనే ఈ సినిమా మోషన్ పోస్టర్ పనిలో పడ్డాను.
>
> - దర్శకుడు కొరటాల శివ

### దేవరకు మించి వర పాత్ర..

'దేవర'..ఎన్టీఆర్ పాత్ర చుట్టూ తిరిగే కథ. కథ రాసుకునేటప్పుడే రెండు పాత్రలకు ఎన్టీఆర్‌ని అనుకునే రాసుకున్నాను. దేవర కొడుకు వర పాత్ర ఆయన్ని మించేలా ఉంటుంది. దేవర రెండు భాగాల్లోనే పూర్తయ్యే సినిమా. సముద్రం బ్యాక్‌డ్రాప్‌లో తీయాల్సిన సినిమా కావడంతో చాలా హోమ్ వర్క్ చేశాం. లక్కీగా ఈ సినిమాకు సాబు శిరిల్, రత్నవేలు, శ్రీకర్ ప్రసాద్, అనిరుద్ వంటి టాప్ టెక్నీషియన్స్ కుదిరారు. ఎవరికీ స్పూన్ ఫీడింగ్ ఇవ్వాల్సిన పని లేదు. అందుకనే వాళ్ల ఐడియాస్‌తో వర్క్ చేసుకుని వచ్చారు. అందరూ మంచి టెక్నీషియన్స్ కాబట్టి మంచి ఇన్‌పుట్స్ ఇచ్చారు.

### కన్నుల పండగలా ఉంటుంది

దేవర, వరగా ఎన్టీఆర్ భిన్న రూపాల్లో అత్యద్భుతంగా నటించారు. జాన్వీ కపూర్ శ్రీదేవి కుమార్తె అని కానీ.. ప్రతి విషయం ఎంతో జాగ్రత్తగా నేర్చుకుని మరీ చేసింది. ఫస్ట్ డే షూటింగ్‌లో ఆమె నటించిన సీన్ కాగానే ఎన్టీఆర్ ఫెంటాస్టిక్ అంటూ చేయి చూపించారు. సైఫ్ అలీఖాన్‌ని 'ఓంకార' సినిమాలో చూసినప్పుడు భైర పాత్రకు సరిపోతాడనిపించింది. అవుట్‌పుట్ చూసినప్పుడు భైర ఎలా ఉండాలని అనుకున్నానో ఆయన అలాగే ఉన్నారు. అనిరుద్ మంచి మ్యూజిక్ ఇచ్చారు. ఈ సినిమా అందరికీ ఓ కన్నుల పండగలా ఉంటుంది.

## అవన్నీ సర్‌ప్రైజ్ చేస్తాయి



హసిత్ గోలి

శ్రీవిష్ణు, డైరెక్టర్ హసిత్ గోలి అప్ కమింగ్ హిలేరియస్ ఎంటర్‌టైనర్ 'శ్వాగ్'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై నిర్మాత టీజీ విశ్వప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అక్టోబర్ 4న ఈ సినిమా థియేటర్లలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో డైరెక్టర్ హసిత్ గోలి మీడియాతో పలు విశేషాలను షేర్ చేసుకున్నారు.

- ఇది ఒక వంశానికి సంబంధించిన కథ. దీని కోసం డిఫరెంట్ జనరేషన్స్‌ని టచ్ చేశాం. ప్రతి జనరేషన్‌లో విష్ణు క్యారెక్టర్ ఉంటుంది. సింగా క్యారెక్టర్ ప్రజెంట్ జనరేషన్. అలాగే 90కి సంబంధించిన క్యారెక్టర్ ఉంటుంది. దాని కంటే ముందుకు వెళితే 70కి సంబంధించిన క్యారెక్టర్ ఉంటుంది. ఇంకా ముందుకెళ్తే.. మూల పురుషుడికి సంబంధించినంత వరకు వెళ్దాం అనే ఆలోచనతో చేసిన స్క్రిప్ట్ ఇది. రాజులకు సంబంధించిన క్యారెక్టర్ గురించి చెప్తున్నప్పుడు ఇంగ్లీష్ అవసరం ఉండదు. అక్కడ స్వచ్ఛమైన తెలుగు ఉంటుంది. ఇందులో అచ్చ తెలుగు విషయాలే ఉన్నాయి. అలాగే రూటేడ్ కల్చర్ ఉంది.
- ఆడ- మగ.. ఎవరు గొప్ప అనే గొడవ ఎప్పటి నుంచో ఉంది. ఎప్పటికీ ఉంటుంది. ఎప్పటికీ ఉండేది వంశం. ఈ రెండింటిని లింక్ చేసినప్పుడు చాలా ఎగ్జైటింగ్‌గా కనిపించింది. మాతృస్వామ్య వ్యవస్థ అనేది అక్కడక్కడ కనిపిస్తుంది. దాన్ని ఎక్స్‌ప్లోర్ చేయడం ఇంట్రెస్టింగ్‌గా అనిపించింది. సందేశం కాదు గాని.. తరతరాలుగా మగ, ఆడ గొడవ అనేది ఎలా మారుతూ వచ్చింది?, ఇప్పటికి దాని రిలవెన్స్ ఏంటి అనే ఆలోచనతో చేసిన కథ.
- ఇందులో నాలుగు క్యారెక్టర్లకి సేమ్ ఇంపార్టెన్స్ ఉంటుంది. ఆ నాలుగు క్యారెక్టర్స్ కలిసి ఎలాంటి కథ చెప్పబోతున్నారనేది చాలా ఇంట్రెస్టింగ్. ఈ క్యారెక్టర్లు, ఇంటర్వెల్ బ్లాక్ ప్రేక్షకులను సర్‌ప్రైజ్ చేస్తాయి. స్క్రీన్ ప్లే చాలా ఎంగేజింగ్‌గా ఉంటుంది.
- విష్ణు నుంచి కోరుకునే ఫన్ ఇందులో పుష్కలంగా ఉంటుంది. ముఖ్యంగా ఆయన వేసిన డిఫరెంట్ గెటప్స్, ఆ కాల పరిస్థితుల నుంచి ఆర్గానిక్‌గా వినోదం జనరేట్ అయ్యింది. దీన్ని ప్రేక్షకులు బాగా ఎంజాయ్ చేస్తారు. రీతూవర్మ, మీరా జాస్మిన్ నటన, వివేక్ సాగర్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సినిమాకి హైలెట్‌గా నిలుస్తాయి.





Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886